మంగళవారం
3•12•2019
కరీంనగర్

• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 158
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







# ఆర్టీసీ కొత్త చార్జీలు

మూడేండ్ల తర్వాత చార్జీల పెంపు

ఆరేండ్ల తర్వాత బస్‌పాసుల ధరల్లో పెరుగుదల

ఆర్థిక నష్టాల కారణంగానే పెంచుతున్నామన్న యాజమాన్యం

ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి

**కిలోమీటర్‌కు 20 పైసల పెంపు**

**బస్సులను బట్టి పెరిగిన కనీస చార్జీలు**




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొత్త బస్‌చార్జీలు మంగళవారం నుంచి అమలులోకి వస్తున్నాయి. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కిలోమీటర్‌కు 20 పైసల చొప్పున పెంచడానికి ప్రభుత్వం అనుమతించడంతో రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ (ఆర్టీసీ) యాజమాన్యం.. బస్సులవారీగా పెంచిన చార్జీలను ప్రకటించింది. పల్లెవెలుగు, ఆర్డినరీ, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, వజ్ర, గరుడ, గరుడ ప్లస్, వెన్నెల వంటి అన్ని రకాల బస్సుల్లో చార్జీలను పెంచినట్లు సోమవారం సర్క్యులర్ విడుదలచేసింది. కనీస చార్జీల్లో మార్పుచేయడంతోపాటు పెరిగిన చార్జీలకు అనుగుణంగా బస్‌పాసుల చార్జీల్లోనూ మార్పుచేసినట్లు పేర్కొన్నది. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను చివరిసారి 2013లో సవరించారు. తిరిగి ఆరేండ్ల తర్వాత ఇప్పుడే మార్పుచేశారు. బస్‌చార్జీలను కూడా చివరిసారి 2016లో సవరించారు. మళ్లీ మూడేండ్ల తర్వాత వాటిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. సాధారణ ప్రయాణికులకోసం ఇచ్చే కాంబో టికెట్ల చార్జీలను పెంచినట్లు ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. టోల్ ప్లాజా టారిఫ్, ప్యాసింజర్ సెస్, ఎమినిటీస్, ఏసీ సర్వీసులపై జీఎస్టీ తదితర చార్జీలు అదనమని పేర్కొన్నది. కొత్త చార్జీల పట్టికలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అన్ని యూనిట్ల అధికారులకు సూచించింది. సోమవారం నాడు ప్రయాణం ప్రారంభించి దూర ప్రాంతాలకు ప్రయాణించేవారికి.. టికెట్లు ముందుగా బుక్‌చేసుకున్నవారికి పాతచార్జీలే వర్తిస్తాయని స్పష్టంచేసింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో తిరిగే మెట్రో, లగ్జరీ, సిటీ శీతల్ రకం సర్వీసుల చార్జీల్లో ప్రస్తుతానికి పాత చార్జీలే అమలులో ఉంటాయని.. సవరించిన తర్వాత వాటిని ప్రకటిస్తామని వెల్లడించింది. ఆర్టీసీని నష్టాల నుంచి కాపాడేందుకు తీసుకొంటున్న చర్యల్లో భాగంగా చార్జీలు పెంచుకునే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనికి అనుగుణంగానే సంస్థపై పడుతున్న భారం, ఆక్యుపెన్సీ రేషియో, ప్రయాణికులకు అందించాల్సిన సేవలను దృష్టిలో ఉంచుకొని, నిబంధనలకు లోబడి చార్జీలు పెంచుతున్నామని.. ఈ పెంపు అనివార్యమైనందున ప్రయాణికులు మంచిమనసుతో సహకరించాలని

మిగతా 2వ పేజీలో

**కొత్త కనీస చార్జీ వివరాలు**

| బస్సు సర్వీసు | కనీస చార్జీ |
|---|---|
| పల్లెవెలుగు | రూ. 10 |
| సెమీ ఎక్స్‌ప్రెస్ | రూ. 10 |
| ఎక్స్‌ప్రెస్ | రూ. 15 |
| డీలక్స్ | రూ. 20 |
| సూపర్ లగ్జరీ | రూ.25 |
| రాజధాని ఏసీ, వజ్ర ఏసీ | రూ.35 |
| గరుడ ఏసీ | రూ. 35 |
| గరుడ ప్లస్ ఏసీ | రూ. 35 |
| వెన్నెల ఏసీ స్లీపర్ | రూ. 70 |

**సర్వీసులను బట్టి కి.మీ.కు (పైసలలో)**

| బస్సు సర్వీసు | పాత చార్జీ | కొత్త చార్జీ |
|---|---|---|
| పల్లె వెలుగు | 63 | 83 |
| సెమీ ఎక్స్‌ప్రెస్ | 75 | 95 |
| ఎక్స్‌ప్రెస్ | 87 | 107 |
| డీలక్స్ | 98 | 118 |
| సూపర్ లగ్జరీ | 116 | 136 |
| రాజధాని ఏసీ, వజ్ర | 146 | 166 |
| గరుడ ఏసీ | 171 | 191 |
| గరుడ ప్లస్ ఏసీ | 182 | 202 |
| వెన్నెల ఏసీ స్లీపర్ | 253 | 273 |

**బస్‌పాసుల చార్జీలు**

స్టూడెంట్ బస్‌పాస్ కనీసచార్జీని రూ.130 నుంచి 165కి పెంచారు. సిటీ ఆర్డినరీ పాస్ చార్జీని రూ.770 నుంచి రూ.950కి, మెట్రో ఎక్స్‌ప్రెస్ చార్జీ రూ.880 నుంచి రూ.1070కి, మెట్రోడీలక్స్ పాస్ చార్జీని రూ.990 నుంచి రూ.1185కి పెంచారు. దీంతోపాటు కాంబో టికెట్ల ధరలు కూడా పెరిగాయి.



సోమవారం రాయదుర్గంలో ఇంటెల్ డిజైన్ అండ్ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు

## ఎలక్ట్రానిక్ పరిశ్రమద్వారా 3 లక్షల ఉద్యోగాలు

గత ఐదేండ్లలో 2 ఈఎంసీల ద్వారా 60 వేల ఉద్యోగాలు

మూడో ఈఎంసీకోసం కేంద్రానికి లేఖ.. ఏప్రిల్ నాటికి టీవర్క్స్ పూర్తి

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ వెల్లడి

ఇంటెల్ డిజైన్, ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రానున్న నాలుగు సంవత్సరాలలో.. ఎలక్ట్రానిక్ పరిశ్రమ ద్వారా రాష్ట్రంలో మూడు లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకొన్నామని ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఇందుకోసమే.. తెలంగాణకు మూడో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ని మంజూరుచేయాలని కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్లు, న్యాయశాఖల మంత్రి రవిశంకర్‌ప్రసాద్‌కు లేఖ రాశామని చెప్పారు. సోమవారం రాయదుర్గంలో ఇంటెల్ డిజైన్ అండ్ ఇంజినీరింగ్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఇంటెల్ సంస్థ భారతదేశంలో తన రెండో సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేసింది. మొత్తం మూడు లక్షల చదరపు అడుగులు, ఆరు అంతస్తుల్లో నిర్మించిన సెంటర్‌లో 1500 మంది ఉద్యోగులు పనిచేయనున్నారు. గత ఐదేండ్లలో ప్రపంచ దిగ్గజ కంపెనీలైన గూగుల్, అమెజాన్, ఉబర్, మైక్రాన్, ఇంటెల్, సేల్స్‌ఫోర్స్ తదితర కంపెనీలు తమ కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటుచేశాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ రంగం ద్వారా 60 వేల ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. ఇటీవలే ఎలక్ట్రానిక్ రంగంలో చైనాకు చెందిన స్కైవర్త్ కంపెనీ 50 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ పారిశ్రామికవాడను ఏర్పాటుచేయాలని

మిగతా 2వ పేజీలో

## ఉద్యోగుల చేతికి సెప్టెంబర్ జీతం



సోమవారం రాజేంద్రనగర్ డిపో పరిధిలో ఏటీఎం నుంచి సెప్టెంబర్ నెల జీతాలు అందుకున్న ఆనందంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు

సీఎం కేసీఆర్ ఆదేశాలతో చెల్లించిన ఆర్టీసీ

ఉద్యోగుల ఇండ్లల్లో పండుగ వాతావరణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ ఉద్యోగులు కండ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. సమ్మెకు ముందు నెల.. సెప్టెంబర్ జీతాలు సోమవారం వారి ఖాతాల్లో జమకావడంతో కార్మికుల ఇండ్లల్లో పండుగ వాతావరణం కనిపించింది. సమ్మె కారణంగా దాదాపు మూడు నెలల జీతం అందక ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితిని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. తక్షణం జీతాలు చెల్లించాలని ఆదివారం జనహితలో ఉద్యోగులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో అధికారులను ఆదేశించారు. సమ్మెకాలం నాటి జీతాన్ని ఒకే దఫాలో చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు సీఎం కేసీఆర్ చెప్పినట్టుగానే అధికారులు సెప్టెంబర్ నెల జీతాలను ఉద్యోగులకు చెల్లించారు. ఉద్యోగుల జీతాలు వారి అకౌంట్లలో జమ చేసినట్టు ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. జీతాలు అందడంతో ఉద్యోగులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం తమకు జీతాలు అందించారని సంతోషం వ్యక్తంచేశారు.

## ఢిల్లీ వెళ్లిన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పవర్ ఫైనాన్స్‌కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌శర్మ ఇంట్లో జరిగే వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం రాత్రి బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. సీఎం వెంట విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ ఉన్నారు. సీఎం కేసీఆర్ తన ఢిల్లీ పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీతోపాటు ఇతర కేంద్ర మంత్రులను కలిసే అవకాశమున్నట్లు సమాచారం.

# కఠిన చట్టాలకు సిద్ధం



నేరస్థులకు క్షమాభిక్షపై పునరాలోచించాలి: ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు




30 రోజుల్లోగా శిక్షపడేలా చట్టం చేయాలి: నామా నాగేశ్వర్‌రావు

3

### దిశ దారుణ ఘటనను ఏకగ్రీవంగా ఖండించిన పార్లమెంట్

మహిళలపై లైంగికదాడులను నిరోధించడంతోపాటు దోషులకు వేగంగా శిక్షపడేలా కఠినచట్టాలు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 'దిశ' ఉదంతం తనను కలిచివేసిందన్నారు. లైంగికదాడి వంటి అమానవీయ కేసుల్లో దోషులను క్షమాభిక్షకు అనుమతించే విషయంపై పునరాలోచించాలని రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు సూచించారు. మహిళలపై నేరాల నిరోధానికి కఠిన చట్టాలు తేవడంతోపాటు ప్రజల ఆలోచన విధానంలో కూడా మార్పులు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. 'దిశ' దారుణ ఉదంతంపై సోమవారం పార్లమెంట్‌లో చర్చ జరిగింది. పశువైద్యురాలిపై జరిగిన పాశవిక లైంగికదాడి, హత్యను లోక్‌సభ, రాజ్యసభ అత్యంత ఆవేదనతో, ముక్తకంఠంతో ఖండించాయి. నిందితులకు ఉరిశిక్ష విధించాలని పార్టీలకతీతంగా సభ్యులందరూ డిమాండ్ చేశారు. దోషులకు 30 రోజుల్లోగా శిక్షపడేలా చట్టాన్ని తీసుకురావాలని రాజ్యసభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

వివరాలు 5లో



దోషులకు సత్వరం కఠినశిక్ష పడేలా నిబంధనలు సవరిస్తాం

లోక్‌సభలో ప్రకటించిన రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



'దిశ' నిందితులను నడిబజార్లో కొట్టి చంపాలి. నిర్భయ, కతువా, ఇప్పుడు దిశ.. ఇలాంటి బాధితుల్లో ఎంతమందికి న్యాయం జరిగిందో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి.
– జయాబచ్చన్

## కాళేశ్వరం అద్భుతం

హైకోర్టు ప్రశంస

2

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 88.00 | రిటైల్ లైవ్ | 110.00 |
| డ్రెస్‌డ్ | 160.00 | స్కిన్‌లెస్ | 182.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 443.00 | రంగారెడ్డి | 441.00 |
| మెదక్ | 443.00 | కరీంనగర్ | 447.00 |
| వరంగల్ | 447.00 | చిల్లర ధర | 5.00 |

టెల్కోల బాదుడు మొదలు

## 50% పైకి సెల్ జ్వరం!

- అమల్లోకి వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ కొత్త చార్జీలు




**మొబైల్** వినియోగదారుల నెత్తిన చార్జీల పిడుగు పడింది. వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌లు పెంచిన 50 శాతం చార్జీలు సోమవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చాయి. రిలయన్స్ జియో సవరించిన 40 శాతం చార్జీలు ఈ నెల 6 నుంచి అందుబాటులోకి రానున్నాయి. తమ నెట్‌వర్క్ పరిధిలోని వినియోగదారులకు కొన్ని ప్లాన్లకు ఉచిత కాల్స్‌ను అందిస్తున్న సంస్థలు.. ఇతర నెట్‌వర్క్ కస్టమర్లకు చేసే కాల్స్‌పై నిమిషానికి 6 పైసల చొప్పున వసూలు చేయడం ప్రారంభించాయి. ఇప్పటికే జియో ఈ తరహా విధానాన్ని ప్రవేశపెట్టగా, వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్‌లు కూడా అదే బాటపట్టాయి. ఫలితంగా అపరిమిత ఉచిత కాల్స్‌కు తెరపడినట్లైంది.

వివరాలు 9లో

నాలుగేండ్లలో 'గీత' దాటినవారు


## 21,194 లైసెన్సులు ఫట్

- మరో ఆరువేల లైసెన్సుల రద్దుపై త్వరలో నిర్ణయం
- నిబంధనల అతిక్రమణపై రవాణాశాఖ కొరడా

**రద్దయిన లైసెన్సులు**

| | |
|---|---|
| డ్రంకన్ డ్రైవ్ | 2,210 |
| సెల్‌ఫోన్ డ్రైవింగ్ | 616 |
| ఓవర్‌లోడ్ వాహనాలు | 2,616 |
| ఓవర్‌స్పీడ్ | 65 |
| గూడ్స్ వాహనాల్లో ప్రయాణికుల తరలింపు | 313 |
| నిర్లక్ష్యపు డ్రైవింగ్, సిగ్నల్ జంప్ కారణాలు | 8,987 |
| కోర్టు కేసుల నేపథ్యంలో రద్దు | 937 |
| ఇతర నిబంధనల ఉల్లంఘన | 5,450 |
| మొత్తం | 21,194 |

6



epaper.ntnews.com



సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎంపీలు కే కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, బండా ప్రకాశ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ ఉన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుతం

- ప్రశంసించిన హైకోర్టు
- సంకల్ప బలం ఉంటే మూసీ ప్రక్షాళన లెక్కకాదు
- మూసీ కాలుష్యంపై కలెక్టర్లకు, అధికారులకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుతమని హైకోర్టు కితాబిచ్చింది. 'ఇలాంటి అద్భుతం సుసాధ్యమైనప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయడం ఎంతపని? అని వ్యాఖ్యానించింది. ఇటీవల తాము నందిమేడారం పంప్‌హౌజ్‌ను సందర్శించామని, ఎన్నో సంక్లిష్టతలతో కూడిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే మూసీ ప్రక్షాళన అసాధ్యమేమీకాదని పేర్కొన్నది. మూసీ కాలుష్యం గురించి పత్రికల్లో వచ్చిన కథనాలపై సుమోటోగా స్వీకరించిన కేసుతోపాటు మూసీలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గతంలో దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. మూసీలో కాలుష్యం తొలిగించడం పెద్ద సమస్యకాదని, దీనికి కావాల్సిందల్లా సంకల్పబలమేనని తెలిపింది. కోర్టు కేసులతో ముందుకెళ్లలేకపోతున్నామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ పేర్కొనడంతో.. కేసులు పెద్ద సమస్యకాదని, ఏ కేసులు లేని ప్రాంతంలో మూసీని ఎందుకు శుభ్రం చేయడంలేదని ధర్మాసనం ప్రశ్నించింది. మూసీ నుంచి వచ్చే దుర్వాసనతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సాయంత్రం వేళల్లో హైకోర్టు సమావేశాల నిర్వహణ కూడా కష్టమైపోయిందని, బయటకు అందంగా కనిపిస్తున్న హుస్సేన్‌సాగర్ నుంచి కూడా దుర్వాసన వస్తున్నదని తెలిపింది. ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా నదులు, సరస్సుల ప్రక్షాళన చేపట్టారని, వాటిని పరిశీలించి మూసీ ప్రక్షాళనకు కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని వివిధశాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లకు నోటీసులు జారీచేసిన ధర్మాసనం.. ఈ అంశంపై తదుపరి విచారణను జనవరి 3కు వాయిదావేసింది.







రాయదుర్గంలో ఇంటెల్ డిజైన్ అండ్ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, ఇంటెల్ కంట్రీహెడ్ నివృతిరాయ్ తదితరులు

# ఎలక్ట్రానిక్ పరిశ్రమద్వారా 3 లక్షల ఉద్యోగాలు

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించిందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం దేశంలోనే అతి పెద్ద ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లు (ఈఎంసీ) రెండున్నాయని, మూడో ఈఎంసీ మంజూరు కోసం చేసిన విజ్ఞప్తికి కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏప్రిల్ నాటికి టీ వర్క్స్ పూర్తవుతాయని తెలిపారు. హైదరాబాద్ ఐటీ రంగంలో సుస్థిరతను, అభివృద్ధిని సాధించిందని, ఇది కేవలం సర్వీస్ సెక్టార్‌కు మాత్రమే పరిమితంకాకుండా ప్రొడక్ట్ ఇన్నోవేషన్‌కు ఉపయోగపడుతుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఐటీ పరిశ్రమల స్థాపనకు హైదరాబాద్‌లో అనుకూలమైన వాతావరణం ఉన్నదని పేర్కొన్నారు. ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, టాస్క్, రిచ్, టీహబ్, వీహబ్ లాంటివి ఎన్నో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఇన్నోవేటివ్ రంగంపై దృష్టిపెట్టామన్నారు. గత రెండు క్వార్టర్స్‌లో ఐటీ ఎగుమతుల్లో బెంగళూరును దాటామని ప్రకటించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ఉత్పత్తి సృజనాత్మకతలో హైదరాబాద్ అందరికీ గమ్యస్థానంగా మారిందని మంత్రి కేటీఆర్ చెప్పారు. రానున్న రోజులో ఇక్కడ ఇంటెల్ కార్యకలాపాలు మరింత పెరుగుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

### హైదరాబాద్ నుంచే అమెరికాకు ఎక్సా స్కేల్ ఆఫ్ కంప్యూటర్

ప్రపంచంలోనే కంప్యూటర్‌రంగంలో నూతన అధ్యాయంగా భావించే ఎక్సా స్కేల్ ఆఫ్ కంప్యూటర్‌ను హైదరాబాద్ ఇంటెల్ సెంటర్‌లో తయారుచేయనున్నారు. 2021 నాటికి అమెరికాకు ఈ కంప్యూటర్‌ను సరఫరా చేయనున్నట్లుగా ఇంటెల్ సీనియర్ ఉపాధ్యక్షుడు కొడూరి రాజా తెలిపారు. 2022 నాటికి దీనిని భారతదేశంలో అందుబాటులోకి తెస్తామనిచెప్పారు. దీనిలో అనేక ప్రత్యేకతలు, సరికొత్త టెక్నాలజీ ఉంటుందని వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభించిన ఇంటెల్‌లో వచ్చే సంవత్సరం తరువాత 1500 మంది ఉద్యోగులు పనిచేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, ఇంటెల్ కంట్రీహెడ్ నివృతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో పౌల్ట్రీ పాలసీ

- దేశంలోనే అత్యుత్తమంగా రూపొందించేందుకు అధ్యయనం
- పౌల్ట్రీ ఫాంల రిజిస్ట్రేషన్
- పెరటికోళ్ల పెంపకానికి ప్రోత్సాహం
- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రి తలసాని




సోమవారం పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్ కార్యాయంలో పౌల్ట్రీరంగ సమస్యలు, అభివృద్ధిపై సమావేశమైన మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో త్వరలో దేశంలోనే అత్యుత్తమమైన పౌల్ట్రీ పాలసీని తీసుకురానున్నామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఇందుకోసం అన్నిరాష్ట్రాల్లో అధ్యయనం చేయనున్నామన్నారు. సోమవారం పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్ కార్యాయంలో పౌల్ట్రీరంగం సమస్యలు, అభివృద్ధిపై తలసాని అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మొదటి సమావేశం జరిగింది. మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పౌల్ట్రీరంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ చర్చించింది. అనంతరం కమిటీ చైర్మన్ తలసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో పౌల్ట్రీరంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు. పశుసంవర్ధకశాఖ ద్వారా పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామని, పేద రైతులకు సబ్సిడీపై పెరటి కోళ్ల యూనిట్లను సరఫరా చేస్తామన్నారు. తెలంగాణ ప్రస్తుతం గుడ్ల ఉత్పత్తిలో దేశంలో 3వ స్థానంలో, బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటుచేసే పౌల్ట్రీ ఫాంలను రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న చిన్న, పెద్ద పౌల్ట్రీఫారంల జాబితాను వెంటనే జిల్లాలవారీగా సేకరించాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వీ లక్ష్మారెడ్డిని కమిటీ ఆదేశించింది. గుడ్లు, మాంసం వినియోగాన్ని పెంచి, ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా పౌల్ట్రీరంగాన్ని అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. పౌల్ట్రీరంగంలో మానవవనరుల అభివృద్ధి ఎంతో అవసరమని.. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీస్థాయిల్లో పౌల్ట్రీ విద్యను అందజేసేందుకు అనువైన అవకాశాలను అన్వేషించాల్సి ఉన్నదన్నారు. బ్రాయిలర్ కోళ్ల పెంప కం హైదరాబాద్ చుట్టుపక్కల ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నదని చెప్పారు. పౌల్ట్రీ రంగానికి గోదాముల ఏర్పాటుపై కమిటీలో చర్చిస్తామని తెలిపారు. పౌల్ట్రీరంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక రూపొందించి ముఖ్యమంత్రికి అందజేస్తామని, ఈ నెల 13న మరోసారి సమావేశమవుతామని తలసాని తెలిపారు.

### పౌల్ట్రీ రంగానికి జీవం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో సబ్సిడీపై కోళ్ల దాణా, ఇతర సదుపాయాలు కల్పించి అవసానదశలో ఉన్న పౌల్ట్రీ రంగానికి జీవం పోశారని సమావేశంలో పాల్గొన్న పౌల్ట్రీ రంగ ప్రతినిధులు ప్రశంసించారు. గుడ్ల ఉత్పత్తి వ్యయం, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం అధికంగా ఉండి రైతులు నష్టపోతున్నారని వారు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, డైరెక్టర్ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి, రాజేంద్రనగర్‌లోని కోళ్ల పరిశోధన డైరెక్టర్ డాక్టర్ చటర్జీ, వెటర్నరీ యూనివర్సిటీ డీన్ ఎస్‌టీ వీరోజిరావు, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ రాంచందర్, ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్‌కుమార్, నాబార్డ్ మేనేజర్ తేజస్ క్షీర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతరావు


# నేడు దివ్యాంగుల దినోత్సవం

- రవీంద్రభారతిలో వేడుకలు
- సంగారెడ్డి కలెక్టర్ హనుమంతరావుతో సహా 20 మందికి అవార్డులు

**హైదరాబాద్/సంగారెడ్డి, ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మం గళవారం అధికారికంగా వేడుకలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తున్నవారికి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డులను ప్రదానం చేయనున్నట్టు దివ్యాంగుల సంక్షేమశాఖ ఎండీ బీ శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరవుతున్నారని చెప్పారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతరావుతోపాటు దివ్యాంగ కవులు, కళాకారులు, క్రీడలు, స్వచ్ఛంద సంస్థల విభాగాల్లో మొత్తం 20 మందికి అవార్డులు అందజేయనున్నట్టు వివరించారు. ఎన్నికల సమయంలో కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి బూత్‌స్థాయిలో ఎక్కడా వికలాంగులకు ఇబ్బందులు రాకుండా ఓటింగ్‌కు ఏర్పాట్లుచేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'గ్రీవెన్స్‌డే'కు వచ్చే వృద్ధులు, దివ్యాంగుల వద్దకు కలెక్టరే స్వయంగా వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఈ సేవలు గుర్తించిన ప్రభుత్వం వికలాంగుల సాధికారతలో సంగారెడ్డిని ఉత్తమ జిల్లాగా ఎంపిక చేసింది.

# ఆర్టీసీ కొత్త చార్జీలు

**ముహూర్తం**



సూర్యోదయం: 6.34 గంటలకు



సూర్యాస్తమయం: 5.32 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం సప్తమి రాత్రి 11.15 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: ధనిష్ఠ మధ్యాహ్నం 2.17 వరకు, తదుపరి శతభిషం, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 2.47 నుంచి సాయంత్రం 4.10 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.45 నుంచి 9.29 వరకు, తిరిగి మధ్యాహ్నం 1.52 నుంచి 2.37 వరకు, వర్జ్యం: రాత్రి 10.21 నుంచి 12.08 వరకు.

మొదటిపేజీ తరువాయి...

ఆర్టీసీ విజ్ఞప్తిచేసింది. రోజురోజుకూ పెరుగుతున్న నష్టాలు, ఆర్థికభారం వల్లనే చార్జీల పెంపు అనివార్యమైందని ఆర్టీసీ యాజమాన్యం విడుదలచేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీని ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్ రాబడి రూ.4,233.05 కోట్లు ఉండగా, వ్యయం రూ.4,982.33 కోట్లుగా ఉన్నది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాబడి రూ.4,570.37 కోట్లు కాగా, వ్యయం రూ.5,319.27 కోట్లుగా ఉన్నది. అంటే రూ.748.90 నష్టం చవిచూసింది. 2018 అక్టోబర్‌లో కార్మికులకు 16 శాతం మధ్యంతర భృతి ఇవ్వడం వల్ల రూ.133.07 కోట్ల భారం పడింది. తరుచూ పెరుగుతున్న ఇంధనధరలు సంస్థకు అదనపు భారంగా తయారయ్యాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాబడి రూ.4,882.72 కోట్లు ఉండగా, వ్యయం రూ.5,811.39 కోట్లుగా ఉన్నది. అంటే రూ.928.67 కోట్ల నష్టాన్ని చవిచూసింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు-2019 నాటికి సంస్థ రూ.303.39 కోట్ల నష్టం చవిచూసింది. ఇలాగే కొనసాగితే ఈ ఆర్థిక సంవత్సరంలో సంస్థకు రూ.1200 కోట్ల నష్టం వచ్చే అవకాశమున్నది.

### పల్లె వెలుగులో కిలోమీటర్‌కు 83 పైసలు

ఆర్టీసీ తాజా నిర్ణయంతో ప్రతి కిలోమీటర్‌కు 20 పైసల చొప్పున చార్జీలు పెరిగాయి. బస్సు రకాన్ని బట్టి ఆర్టీసీ వేర్వేరుగా చార్జీలను వసూలు చేస్తున్నది. పాత చార్జీలను పరిశీలిస్తే.. కనిష్ఠంగా పల్లెవెలుగు బస్సులో కిలోమీటర్‌కు 63 పైసలు ఉండగా, ప్రస్తుతం 83 పైసలకు చేరింది. గరిష్ఠంగా వెన్నెల ఏసీ స్లీపర్ బస్సుల్లో కిలోమీటర్‌కు 253 పైసలు ఉండగా, తాజాపెంపుతో అది 273పైసలకు చేరింది.



పెరిగిన చార్జీల వివరాలను టిమ్ములలో నమోదు చేస్తున్న వనపర్తి డిపో మేనేజర్ దేవదానం

**పల్లె వెలుగు**

| రూటు | ప్రస్తుతం-సవరించబడినవి |
|---|---|
| సిద్దిపేట- హన్మకొండ | 61-83 |
| జేబీఎస్- గజ్వేల్ | 41-54 |
| సంగారెడ్డి- పటాన్‌చెరు | 16-21 |
| హన్మకొండ- నర్సంపేట | 29-35 |
| హన్మకొండ- ఖమ్మం | 82-105 |
| ఆదిలాబాద్- నిర్మల్ | 58-76 |
| నిర్మల్- నిజామాబాద్ | 49-64 |
| ఖమ్మం- కోదాడ | 24-34 |
| హైదరాబాద్- వికారాబాద్ | 50-66 |
| హైదరాబాద్- కల్వకుర్తి | 61-80 |

### పెరిగిన కనీస చార్జీలు

ఇప్పటివరకు పల్లెవెలుగు, సెమీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రతి ఐదు కిలోమీటర్ల ప్రాతిపదికన కనీస చార్జీ రూ.6 గా ఉండేది. ఇప్పుడు ఈ కనీసచార్జీని రూ.10 కి పెంచారు. ప్రతి రెండు కిలోమీటర్ల ప్రాతిపదికన సిటీలో కొనసాగుతున్న కనీస చార్జీలను ఆర్డినరీలో రూ.10 కి పెంచారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ కనీసధర (రూ.10)లో మార్పుచేయలేదు. మెట్రో డీలక్స్ కనీసచార్జీ రూ.10 నుంచి రూ.15కు పెరిగింది. పండుగలు, జాతరల సందర్భాల్లో నడిపే ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీల కంటే 1.5 రెట్లు మించకుండా చూసుకోనున్నారు.

**వివిధ సర్వీసుల చార్జీల వివరాలు**

| రూటు | ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం - సవరించబడినవి | సూపర్ లగ్జరీ ప్రస్తుతం-సవరించబడినవి | రాజధాని (ఏసీ) ప్రస్తుతం- సవరించబడినవి | గరుడ ప్లస్ (ఏసీ) ప్రస్తుతం- సవరించబడినవి |
|---|---|---|---|---|
| హైదరాబాద్- బెంగళూరు | - | - | - | 1010-1290 |
| హైదరాబాద్- పుణె | - | - | - | 1305-1500 |
| హైదరాబాద్- షిర్డి | - | - | - | 1245-1610 |
| హైదరాబాద్- తిరుపతి | - | - | - | 1130-1170 |
| హైదరాబాద్- విజయవాడ | - | - | - | 570-620 |
| హైదరాబాద్- రాయ్‌చూర్ | 195-224 | - | - | - |
| జేబీఎస్- కరీంనగర్ | 148-180 | 195-230 | 269-310 | 330-370 |
| హైదరాబాద్- హన్మకొండ | 130-170 | 185-215 | 260-290 | 310-350 |
| హైదరాబాద్- నిజామాబాద్ | 174-210 | 232-270 | 294-330 | - |
| హైదరాబాద్- ఖమ్మం | 179-220 | 238-280 | 326-370 | 400-440 |
| హైదరాబాద్- ఆదిలాబాద్ | - | 394-460 | 523-590 | - |
| హైదరాబాద్- నిర్మల్ | 220-270 | 290-345 | 363-445 | - |
| హైదరాబాద్- మహబూబ్‌నగర్ | 95-115 | 125-145 | - | - |
| సంగారెడ్డి- విజయవాడ | - | 409-480 | - | - |
| హన్మకొండ- బెంగళూరు | - | 884-1045 | 1049-1350 | 1303-1620 |
| ఖమ్మం- భద్రాచలం | 110-135 | 146-175 | 208-220 | - |



ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ

# తెలంగాణలో సర్వమత సంక్షేమం

- క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ ప్రతినిధుల భేటీలో ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎలాంటి రాగద్వేషాలు, పక్షపాతాలకు తావివ్వకుండా సమాజంలో అన్ని మతాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతున్నదని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ చెప్పారు. యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో వినోద్‌తో భేటీ అయ్యారు. తమ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న సికింద్రాబాద్ వెస్లీ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే క్రిస్మస్ వేడుకలకు రావాలని ఆయనను ఆహ్వానించారు. క్రైస్తవుల శ్మశానవాటికల కోసం 68.32 ఎకరాల భూమిని కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు, సహకరించిన వినోద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. జెరూసలేం యాత్రకు వెళ్లే క్రైస్తవులకు ప్రభుత్వపరంగా రాయితీని కల్పించాలన్న కమిటీ వినతిని సీఎం దృష్టికి తీసుకెళ్తానని వినోద్ హామీఇచ్చారు.

# నవంబర్‌లో 14% అధిక వర్షపాతం

- రాష్ట్ర సగటు భూగర్భ నీటిమట్టం 7.53 మీటర్లు
- గరిష్ఠంగా సంగారెడ్డిలో 16.89 మీటర్లు.. కనిష్ఠంగా వరంగల్ అర్బన్‌లో 3.32 మీటర్లు
- భూగర్భ జలవనరులశాఖ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ ముగిసేనాటికి 14 శాతం అధిక వర్షపాతం నమోదైందని భూగర్భజల వనరుల శాఖ పేర్కొన్నది. 33 జిల్లాల్లోని 589 మండలాల నుంచి వివరాలను సేకరించిన నీటిమట్టాలను విశ్లేషించింది. జయశంకర్‌భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, వనపర్తి, వరంగల్ అర్బన్ జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే అత్యధికంగా నమోదైందని తెలిపింది. 2018 నవంబర్‌తో పోలిస్తే సగటు భూగర్భ జల మట్టం 3.56 శాతం పెరిగినట్టు భూగర్భ జలవనరులశాఖ వెల్లడించింది. ఈ ఏడాది నవంబర్‌లో సగటు భూగర్భనీటిమట్టం 7.53 మీటర్లుగా నమోదైంది. కనిష్ఠ నీటిమట్టం 3.32 మీటర్లు వరంగల్ అర్బన్ జిల్లాలో, అత్యధిక భూగర్భ నీటిమట్టం సంగారెడ్డి జిల్లాలో 16.89 మీటర్లుగా నమోదైనట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 2018 నవంబర్‌తో పోలిస్తే 2019 నవంబర్‌లో భూగర్భ జల మట్టం జయశంకర్ జిల్లాలో 0.9 శాతం అతి తక్కువగా, అత్యధికంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో 8.87 శాతం పెరిగింది. పదేండ్ల సరాసరితో పోలిస్తే 589 మండలాలకు 445 మండలాల్లో 0.01 నుంచి 8.5 మీటర్ల పెరుగుదల, 144 మండలాల్లో 0.01 నుంచి 11.16 మీటర్లు తగ్గుదల నమోదైనట్టు భూగర్భజలవనరులశాఖ పేర్కొన్నది.

**లోకం పోకడ**




నిన్నటి వరకు కాల్ రాగానే మొబైల్ వైబ్రేట్ అయ్యేది.. చార్జీలకు భయపడి ఇప్పుడు తనే అవుతున్నాడు!

# 5న సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఉద్యోగ అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్‌లోని అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గ్రేడ్-2, అసిస్టెంట్ స్టోర్స్ ఆఫీసర్ గ్రేడ్-2, డాటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2కు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల ఐదున నాంపల్లిలోని ప్రతిభాభవన్‌లో నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని టీఎస్‌పీఎస్సీ సోమవారం ఒక ప్రకటనలో సూచించింది. జీహెచ్‌ఎంసీలోని బిల్ కలెక్టర్ పరీక్ష అభ్యర్థులు, ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థులు కూడా అదేరోజు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం రావాలని మరో ప్రకటనలో తెలిపింది. వీరందరికి ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఈ నెల ఎనిమిదిన ఉంటుందని, ఐదోతేదీ సాయంత్రం 5 గంటల నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. 'ప్రొఫిషియెన్సీ ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ విత్ యూసేజ్ ఆఫ్ కంప్యూటర్ అండ్ అసోసియేటెడ్ సాఫ్ట్‌వేర్'పై టెస్ట్ ఉంటుందని తెలిపింది.

### ఎడిట్ వెబ్‌ఆప్షన్ అవకాశం

వివిధశాఖల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, జూనియర్ స్టెనో, జూనియర్ అసిస్టెంట్ కం టైపిస్ట్ పోస్టుల అభ్యర్థులకు ఎడిట్ వెబ్‌ఆప్షన్ కల్పిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ సోమవారం ప్రకటించింది. క్వాలిఫికేషన్‌కు అనుగుణంగా ఆప్షన్లు ఇచ్చుకోవాలని, మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఈ అవకాశం ఉంటుందని స్పష్టంచేసింది.



ఆర్టీసీ యాజమాన్యం యూనియన్ నేతలకు డ్యూటీ రిలీఫ్ రద్దుచేసిన నేపథ్యంలో సోమవారం కరీంనగర్ -1 డిపోలో టీఐ-2 (సూపర్‌వైజర్)గా విధులు నిర్వర్తిస్తున్న జేఏసీ నాయకుడు థామస్‌రెడ్డి

# గ్రీన్‌చాలెంజ్‌కు విశేష స్పందన

- మొక్కలు నాటిన జర్నలిస్టులు
- ముఖ్యఅతిథులుగా మంత్రులు
- మొక్కకు 'దిశ' పేరుపెట్టిన మీడియా అకాడమీ చైర్మన్
- ఎంపీ సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్‌కు విశేష స్పందన లభిస్తున్నది. సోమవారం మీడియా అకాడమీ చైర్మన్, టీయూడబ్ల్యూజే పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు, పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు మొక్కలునాటారు. హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మె ల్యే కాలనీలోని జీహెచ్ఎంసీ పార్కులో 'తెలంగాణ కలం-హరిత హారం'పేరుతో జర్నలిస్టులు మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు అల్లం నారాయణ 'దిశ'గా నామకరణంచేశారు. 'దిశ' మొక్క రూపంలో సజీవంగా ఉంటారని ఆకాంక్షించారు. ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ చాలెంజ్ పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నదని కొనియాడారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. ఒకప్పుడు అశోకుడు మొక్కలు నాటించారని చెప్పుకొనే రోజులు పోయి.. ఎంపీ సంతోష్‌కుమార్ మొక్కలు నాటించారని చెప్పుకోవాల్సి ఉంటుందని చెప్పారు. స్టంట్ మాస్టర్లు రామ్,లక్ష్మణ్ కూడా అక్కడే మొక్కలు నాటారు. వరంగల్‌లోని కేయూలో మంత్రి ఎర్రబెల్లి, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, మేయర్ గుండా ప్రకాశ్‌రావు.. జర్నలిస్టులతో కలిసి మొక్కలు నాటారు. సినీ నిర్మాత దిల్‌రాజ్, వివిధ పత్రికలు, చానల్స్ అధినేతలు రామోజీరావు, రాధాకృష్ణ, నరేంద్రచౌదరి, రామేశ్వర్‌రావులకు ఎర్రబెల్లి గ్రీన్ చాలెంజ్ చేశారు. కరీంనగర్‌లోని గిద్దెపెరుమాండ్లస్వామి దేవాలయం సమీపం లో జర్నలిస్టులతో కలిసి మంత్రి గంగుల మొక్కలు నాటారు. కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ జిల్లా కేంద్రంలో మొక్కలను నాటారు.

### కోట్లమందిని కదిలిస్తున్నది: ఎంపీ సంతోష్

నేల పచ్చగా ఉంటే మనుషులంతా చల్లగా ఉంటారనే సీఎం కేసీఆర్ మాటల స్ఫూర్తితో ప్రారంభించిన 'గ్రీన్ ఇండియా చాలెంజ్'కు అపూర్వ స్పందన వస్తున్నదని ఎంపీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. కోట్ల మంది మొక్కలు నాటడంతో గ్రీన్‌చాలెంజ్ 'ఇంతింతై వటుడింతై' అన్నట్టు విస్తరిస్తున్నదని సంతోషం వ్యక్తంచేశారు. ఇందులో జర్నలిస్టులు, అధికారులు మొక్కలు నాటడంపై హర్షం వ్యక్తంచేశారు. మొక్కలు నాటిన సిరిసిల్ల కలెక్టర్ కృష్ణభాస్కర్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణను అభినందించారు. కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ కుమార్తెను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆదివారం సర్ఫరాజ్ అహ్మద్ మొక్క నాటుతుండగా ఆయన కూతురు ఉత్సాహంగా మట్టిపోస్తూ సహకరించారు. ఈ ఫొటో సోషల్‌మీడియాలో వైరలవడంతో ఎంపీ సంతోష్‌కుమార్.. ఆ చిన్నారిని ప్రశంసిస్తూ సోమవారం ట్వీట్‌చేశారు.


వరంగల్‌లోని కాకతీయ వర్సిటీ ఆవరణలో మొక్క నాటుతున్న మంత్రి ఎర్రబెల్లి , చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, జర్నలిస్టులు


కరీంనగర్‌లో మొక్క నాటుతున్న మంత్రి గంగుల


బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని జీహెచ్ఎంసీ పార్కులో మొక్కనాటి నీళ్లు పోస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, జర్నలిస్టులు


సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పార్కులో మొక్క నాటుతున్న కలెక్టర్ కృష్ణభాస్కర్

# ఆత్మరక్షణపై మెళకువలు నేర్పండి

- డీజీపీకి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి లేఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా కళాశాల విద్యార్థినులకు ఆత్మరక్షణపై మెళకువలను నేర్పించడానికి ప్రత్యేకంగా షీ-టీమ్స్ ఏర్పాటుచేయాలని డీజీపీకి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి సూచించారు. సోమవారం డీజీపీ మహేందర్‌రెడ్డికి ఈ మేరకు లేఖరాశారు. పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. సమస్య వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవా లి? ఎవరిని ఆశ్రయించాలనే విషయంపై విద్యార్థినులను చైతన్య పరుచాలని కోరారు. అందుబాటులో ఉన్న కంట్రోల్ రూమ్, షీ-టీమ్‌తోపాటు, వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో ఫిర్యాదులపై పోలీసులు స్పందించి బాధితులకు అండగా నిలువాలని మంత్రి కోరారు.

# 30 రోజుల్లో శిక్షపడేలా చట్టం చేయాలి

- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లైంగికదాడికి పాల్పడిన నిందితులకు 30 రోజుల్లో శిక్ష పడేలా చట్టం తీసుకురావాలని టీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వర్‌రావు కేంద్రాన్ని కోరారు. ఎవరైనా మళ్లీ అలాంటి నేరాలు చేయాలంటే భయపడేలా ఆ చట్టం ఉండాలని సూచించారు. సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. దిశ ఘటన చాలా బాధాకరమన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీకి సవరణలు చేయాల్సిన అవసరం ఉన్నదని, మహిళలపై దాడులు దేశం మొత్తానికి సంబంధించిన సమస్య అని అన్నారు. తెలంగాణ పోలీసులు దిశ నిందితులను 24 గంటల్లో పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నదన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్, భరోసా సెంటర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. అలాగే పోలీస్ వ్యవస్థను పటిష్ఠం చేసి డయల్ 100 ద్వారా తక్షణమే స్పందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని తెలిపారు. తెలంగాణ సీఎం కేసీఆర్ గతంలో 15వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్నప్పుడు కేంద్రం నిర్భయ చట్టం తెచ్చిందని అన్నారు.

### దిశ ఘటన సిగ్గుచేటు: మాలోతు కవిత



దిశపై దారుణం ప్రతి సభ్యుడు సిగ్గుపడాల్సిన ఘటన అని ఎంపీ మాలోతు కవిత ఆవేదన వ్యక్తంచేశారు. లోక్‌సభలో జస్టిస్ ఫర్ దిశపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ నలుగురు దుర్మార్గులు లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన ఘటన దేశం మొత్తాన్ని కలిచివేసిందన్నారు. 2012లో నిర్భయ తరహాలోనే ఈ ఘటన ఉన్నదని తెలిపారు. నిర్భయ నిందితులకు ఉరిశిక్ష విధించినా ఇంకా అమలుచేయలేదని పేర్కొన్నారు. అంతా రాజకీయాల గురించి మాట్లాడుతున్నారు కానీ, చట్టాల గురించి మాట్లాడటం లేదని ఆవేదన చెందారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు ఉరిశిక్ష వేసేలా కొత్తచట్టం తీసుకరావాలని కోరారు.

### ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలి: బండా ప్రకాశ్



దిశ ఘటన దేశాన్ని కలిచివేసిందని ఎంపీ బండా ప్రకాశ్ అన్నారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ లైంగికదాడి నిందితులకు వెంటనే శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలని కోరారు. ఎన్సీఆర్బీ లెక్కల ప్రకారం.. దేశంలో ప్రతి 20 నిమిషాలకు ఒక లైంగికదాడి జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల తెలంగాణలో 9నెలల పాపపై జరిగిన పాశవిక ఘటనపై ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు ఏర్పాటుచేసి నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసిందని.. అయితే పైకోర్టుకు వెళితే ఆ శిక్ష జీవితఖైదీగా మారిందని చెప్పారు. ఇలాంటి ఘటనల్లో తక్షణం శిక్షపడాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారని చెప్పారు.

# బాలికను గర్భవతిని చేసిన బాలుడు

- పంచాయతీలో అవమానంతో బాలిక తండ్రి ఆత్మహత్య
- నిందితుడిపై పోక్సో కేసు

**మరిపెడ, నమస్తే తెలంగాణ:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ బాలిక(15)ను ఓ బాలుడు(17) గర్భవతిని చేయగా పంచాయతీలో బాలుడి తండ్రి అవమానపర్చడంతో బాలిక తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఓ గిరిజన తండాలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై సిరిసిల్ల అశోక్ కథనం ప్రకారం.. తండాకు చెందిన ఓ వ్యక్తి (45) చిన్న కూతురును అదే తండాకు చెందిన ఓ బాలుడు పెళ్లి చేసుకుంటానని లోబర్చుకున్నాడు. గర్భం దాల్చడంతో ఆమె తల్లిదండ్రులు తండాలోని పెద్దమనుషులను ఆశ్రయించారు. బాలుడు, అతడి తల్లిదండ్రులు.. పెళ్లికి ఒప్పుకోవడంతో బాలికకు గర్భస్రావం చేయించారు. కొద్దిరోజుల తరువాత 'బాలిక గర్భానికి తమ కొడుకే కారణమని ఎలా అనుకుంటాం?, ఇంకెవరైనా కావొచ్చు కదా' అంటూ బాలికపై అబాండాలు వేస్తూ పెళ్లికి ససేమిరా అన్నారు. బాలిక తల్లిదండ్రులు ఆదివారం మరిపెడ పోలీసులను ఆశ్రయించారు. కూర్చొని మాట్లాడుకుందామని బాలిక తల్లిదండ్రులను తండా పెద్దలు పిలిచారు. బాలిక తండ్రిని బాలుడి తల్లిదండ్రులు అవమానపర్చడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో కింద కేసు నమోదు చేశారు.

# విద్యార్థినిపై ఆర్ఎంపీ వైద్యుడు లైంగికదాడి యత్నం

- 'పోక్సో' కేసు నమోదు.. అరెస్టు

**సుబేదారి (వరంగల్):** అనారోగ్యంతో చికిత్స కోసం వచ్చిన ఓ విద్యార్థినిపై ఆర్ఎంపీ వైద్యుడు లైంగికదాడికి యత్నించాడు. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థిని (14) హన్మకొండ జులైవాడ ఎస్టీ వసతిగృహంలో చదువుతున్నది. రెండ్రోజుల కిందట అనారోగ్యంతో చికిత్స కోసం స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు రాజు వద్దకు వెళ్లగా.. మత్తుమందు ఇచ్చి లైంగికదాడికి యత్నించాడు. మత్తునుంచి తేరుకున్న విద్యార్థిని వసతిగృహానికి వచ్చి తల్లిదండ్రులకు విషయం తెలిపింది. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, రాజును అదుపులోకి తీసుకుని, పోక్సో చట్టం కింద కేసు చేశారు.

# లైంగికదాడి నిందితుడికి 20 ఏండ్ల జైలు

- విజయవాడ పోక్సో స్పెషల్ కోర్టు సంచలన తీర్పు

**విజయవాడ:** ఏపీ విజయవాడలోని పోక్సో స్పెషల్ కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 2017లో కృష్ణారావు.. ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసుపై విచారణ చేపట్టిన కోర్టు పోక్సో చట్టం కింద నిందితుడికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధించింది.

# ఆర్టీసీలో ఆనందహేల

- సీఎం కేసీఆర్ వరాలతో ఉద్యోగుల్లో మిన్నంటిన సంబురాలు
- సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు
- జయజయ నినాదాలు
- సంబురాల్లో పాలుపంచుకొన్న రవాణామంత్రి పువ్వాడ అజయ్
- బస్సు నడిపి ఉద్యోగుల్లో భరోసా నింపిన మంత్రి


ఖమ్మం డిపోలో ఖాకీ చొక్కా వేసుకొని ఇంద్ర బస్సు నడుపుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ ఉద్యోగుల్లో ఉద్విగ్నవాతావరణం నెలకొన్నది. సంస్థను లాభాలబాట పట్టించే చర్యలతోపాటు ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలతో సంబురాలు మిన్నంటాయి. ప్రతి డిపోలో సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. కేసీఆర్ జై అంటూ ముక్తకంఠంతో నినదించారు. మిఠాయిలు పంచుకొంటూ అభినందనలు తెలుపుకున్నారు. జగిత్యాల డిపోలో ఏకంగా పంచామృతంతో ముఖ్యమంత్రి చిత్రపటాన్ని అభిషేకించారు. అటు ఖమ్మం డిపోలో జరిగిన వేడుకల్లో రవాణామంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాలుపంచుకొన్నారు. ఉద్యోగుల్లో చైతన్యం పెంచేందుకు ఇంద్ర బస్సును నడిపించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులందరూ సమిష్టి బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. భవిష్యత్తు ఉద్యోగులదేనని భరోసా ఇచ్చారు. మంథని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతోకలిసి జెడ్పీ చైర్మన్ భార్య పుట్ట శైలజ ఇతర నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వేములవాడ డిపో బోయినపల్లిలో, మెదక్ డిపోలో ఉద్యోగులు సోమవారం సంబురాలు చేసుకున్నారు. ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబర్ నెల వేతనాలను సత్వరమే విడుదల చేసిన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల డిపోలో డీఎం జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోఎదుట సోమవారం డ్రైవర్లు, కండక్టర్లు,ఇతర ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచుకుంటూ కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలోని డిపో ఎదుట సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి ఆర్టీసీ కార్మికులు సోమవారం క్షీరాభిషేకం చేశారు.


సోమవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు


పెద్దపల్లి జిల్లా మంథని డిపోలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

### అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి: టీజీవో

అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, ఆర్టీసీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించడం, సమస్యలన్నీ పరిష్కారం చేసేందుకు నిర్ణయం తీసుకోవడం సీఎం కేసీఆర్‌కే సాధ్యమని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేసింది. ఏండ్ల తరబడి ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ మేరకు టీజీవో అధ్యక్షురాలు వీ మమత, ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పీ రవీంద్రకుమార్, హైదరాబాద్ జిల్లాశాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎంబీ కృష్ణయాదవ్, టీజీవో అబ్కారీ విభాగం అధ్యక్షుడు రవీందర్‌రావు, లక్ష్మణ్ గౌడ్, టీసీ టీజీవో అధ్యక్షుడు బీ వెంకటయ్య, సబిత, శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

### జేఏసీ నుంచి వైదొలిగిన సూపర్ వైజర్స్ సంఘం

ఆర్టీసీలో సమ్మె ముగిసినందున జేఏసీ నుంచి తాము వైదొలుగుతున్నట్టు సూపర్‌వైజర్స్ అసోసియేషన్ సోమవారం ప్రకటించింది. జేఏసీలో భాగస్వామిగా ఉండి తమ వంతు పోరాటం చేశామని సంఘం అధ్యక్షురాలు సుధ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# పదిరోజులు కస్టడీకి ఇవ్వండి

- దిశ నిందితుల కస్టడీ కోరుతూ షాద్‌నగర్ కోర్టులో పోలీసుల పిటిషన్
- విచారణను నేటికి వాయిదావేసిన న్యాయమూర్తి
- దిశ నిందితులకు సహకరించం: షాద్‌నగర్ బార్ అసోసియేషన్
- కృష్ణానదిలో దిశ అస్థికలు నిమజ్జనం
- సూర్యాపేటలో విద్యార్థుల భారీర్యాలీ


సోమవారం నిందితులను కఠినంగా శిక్షించాలంటూ సూర్యాపేటలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) 'దిశ' అక్షరరూపంలో విద్యార్థులు

**హైదరాబాద్/షాద్‌నగర్, నమస్తే తెలంగాణ, బొడ్రాయిబజార్ (సూర్యాపేట):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ షాద్‌నగర్ సోమవారం షాద్‌నగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దిశ హత్యకేసులో అరెస్టయి చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను విచారించేందుకు పదిరోజులు కస్టడీకి అనుమతించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి కస్టడీపై తీర్పును మంగళవారానికి వాయిదా వేశారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అందుబాటులో లేకపోవడంతో విచారణను వాయిదావేసినట్టు తెలిసింది. నిందితుల కస్టడీ పిటిషన్‌పై విచారణ విషయం తెలుసుకున్న ప్రజలు, మీడియా ప్రతినిధులు పెద్దఎత్తున కోర్టు ఆవరణకు చేరుకున్నారు. మంగళవారం నిందితులను పోలీసు కస్టడీకి అప్పగించవచ్చని తెలుస్తున్నది. దిశ నిందితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయసహాయం అందించబోమని షాద్‌నగర్ బార్ అసోసియేషన్ తీర్మానం చేసింది. సోమవారం కోర్టు ఆవరణలో సమావేశమైన న్యాయవాదులు ఈ మేరకు తీర్మానం చేసినట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నడికూడ సత్యనారాయణ యాదవ్, ఉపాధ్యక్షుడు చెట్ల శంకర్, మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మహిళలు, యువతులపై లైంగికదాడి, హత్య కేసుల్లో నిందితులకు త్వరగా శిక్ష పడేలా చట్టాలను మరింత కఠినం చేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

### కఠినచట్టాలు తీసుకురావాలి: హైకోర్టు న్యాయవాదులు

మహిళలపై లైంగికదాడులను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని హైకోర్టు న్యాయవాదులు పేర్కొన్నారు. షాద్‌నగర్, వరంగల్ ఘటనలను నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం హైకోర్టు మదీనా రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. నిందితులకు తక్షణమే ఉరిశిక్ష వేసేలా చట్టానికి సవరణలు చేయాలని హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి సుంకరి జనార్దన్‌గౌడ్, న్యాయవాదులు శారద, రామారావు డిమాండ్ చేశారు. మహిళలపై లైంగికదాడి, ఇతర అకృత్యాల కేసుల్లో నేరపరిశోధన, శిక్షల తీరు ఆశాజనకంగా లేవని, దీంతో దాడులు పెరిగిపోతున్నాయని భారతీయ న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ పేర్కొన్నారు. పదింట తొమ్మిది కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలేదని తెలిపారు. ఐఏఎల్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ అమృత ఎస్టేట్స్ వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. శంషాబాద్, వరంగల్‌లో లైంగిక దాడుల నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేటలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు సుమారు ఆరువేల మంది విద్యార్థినులు పెద్ద ఎత్తున ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. 'సేవ్ గర్ల్స్.. సేవ్ ఇండియా', 'నిందితులకు ఉరే..సరి' అంటూ నినదించారు.

## స్పందించేముందు వాస్తవాలు గ్రహించాలి

- రేఖాశర్మను ట్విట్టర్‌లో కోరిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏదైనా ఒక విషయంపై స్పందించేముందు పూర్తిగా వాస్తవాలు తెలుసుకోవాలని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో సూచించారు. దురదృష్టవశాత్తు కొన్ని మీడియా సంస్థలు టీఆర్పీ కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. దిశ ఘటన నేపథ్యంలో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ట్వీట్ చేసిన జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మకు మంత్రి కేటీఆర్ రీట్వీట్ ద్వారా సమాధానమిచ్చారు. 'మీరు చాలా ముఖ్యమైన పదవిలో ఉన్నారు. సీఎం కేసీఆర్ చేయని వ్యాఖ్యలపై స్పందించేముందు వాస్తవాలు గ్రహించాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.


రేఖాశర్మ ట్వీట్‌కు సమాధానంగా మంత్రి కేటీఆర్ చేసిన రీట్వీట్


హైదరాబాద్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ వర్సిటీ విద్యార్థుల నివాళి



షాద్‌నగర్‌లో 'దిశ'కు న్యాయవాదుల సంఘీభావం


అస్థికల నిమజ్జనం అనంతరం కృష్ణమ్మకు నమస్కారం చేస్తున్న దిశ తండ్రి

### దిశ అస్థికలు నిమజ్జనం

**ఎర్రవల్లి చౌరస్తా:** దుండగుల చేతిలో హత్యకు గురైన దిశ అస్థికలను ఆమె తండ్రి, బంధువులు సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. అనంతరం దిశ తండ్రి మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితి ఏ ఆడబిడ్డకూ రాకూడదని కన్నీళ్లు పెట్టుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


హైకోర్టు వద్ద అడ్వకేట్ల కొవ్వొత్తుల ప్రదర్శన




**TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION**
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

**NOTIFICATION No. 11/2018 (RTC), 17/2018 (GHMC) & 18/2018 (BEVERAGES) DT: 2/06/2018.**

**PRESS ADVERTISEMENT**

It is hereby informed that the candidates who have provisionally qualified and completed the process of certificate verification to the various posts of said Notifications (11/2018, 17/2018 & 18/2018) and candidates who are short listed in 3rd spell (vide web note dt: 02/12/2019) for certificate verification can download their Hall Tickets from 05/12/2019, 5.00 PM onwards for the test of "Proficiency in Office Automation with usage of Computer and Associated Software" on commission's Website i.e., www.tspsc.gov.in. The said Proficiency Test will be held on 08/12/2019. For details visit Commission's website (www.tspsc.gov.in)

Hyderabad
Dt. 02/12/2019
Sd/-
SECRETARY
DIPR R.O. No. 517-PP/CL/Advt/1/2019-20 Dt: 02.12.2019



హైదరాబాద్ లైంగికదాడి విషయంలో ప్రభుత్వం నిర్దిష్టంగా వ్యవహరించాలి. ఏ విధంగా న్యాయం చేకూరుస్తారో చెప్పాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. వారిని బహిరంగంగా ఉరితీయాలి.


**జయాబచ్చన్, రాజ్యసభ ఎంపీ**

జీడీపీ విషయంలో, ఆర్థిక మందగమనం విషయంలో పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. అదంత ప్రాధాన్యమైంది కాదు. ఇవ్వాళ్టి రోజుల్లో సుస్థిరాభివృద్ధి దిశగా సాధారణ పౌరుని సంక్షేమం గురించి పట్టించుకుంటున్నామా లేదా అనేది ముఖ్యం. ప్రజా సంతోషం అనేది జీడీపీ కన్నా విలువైంది.

**నిషికాంత్ దూబె, బీజేపీ ఎంపీ**



**చరిత్రలో నేడు**



**1828**
అమెరికా 7వ అధ్యక్షునిగా ఆండ్రూ జాక్సన్.

**1847**
'నార్త్ స్టార్' పత్రికా ప్రచురణ ప్రారంభించిన ఫ్రెడరిక్ డగ్లస్.





**1946**
స్పెయిన్ నియంత ఫ్రాన్సిస్కో ఫ్రాంకో గద్దెదిగాలని ఐక్యరాజ్యసమితి ఆదేశించాలని కోరిన అమెరికా.

పాకిస్థాన్‌లో చోటుచేసుకున్న అక్రమ గృహ నిర్మాణ కుంభకోణం విశృంఖల స్వార్థపరత్వానికి, లోపభూయిష్ట పరిపాలనకు అద్దం పడుతున్నది. దేశవ్యాప్తంగా రాజకీయ పెద్దలు, తాబేదారులు, అధికారులు వేలాదిమంది సామాన్య ప్రజల కష్టార్జితాన్ని, సొంత ఇల్లుండాలనే వారి కలలను కొల్లగొట్టి దోచుకున్నారు. పోలీసు యంత్రాంగం ఈ దోపిడీదారులకే అండగా నిలిచింది. సుప్రీంకోర్టు ఆదేశించిన దర్యాప్తులో దాదాపు ఆరు దేశాల ప్రాజెక్టులు అక్రమమని లేదా కాగితాల మీద మాత్రమే ఉన్నాయని తేలింది.

**డాన్**

లండన్‌లో కత్తిదాడి ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఉగ్రవాదుల చేతిలో నాగరిక ప్రపంచానికి ఎంత ప్రమాదం పొంచి ఉన్నదో ఈ ఘటన వల్ల తెలుస్తున్నది. కొందరు పౌరులు ఉగ్రవాదిని సాహసంతో బంధించారు. పోలీసులు వచ్చీరాగానే నిర్బంధంలో ఉన్న ఉగ్రవాదిని కాల్చిచంపారు. శ్రీలంకలో కనుక ఈ విధంగా ఉగ్రవాదిని హతమార్చి, విచారణ లేకుండానే నిందితుడిని హత్య చేశారని అంతర్జాతీయంగా గగ్గోలు పుట్టేది. జెనీవాలో శ్రీలంక ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డదంటూ అభిశంసించేవారు.

**ది ఐలాండ్**



# సామాజిక రుగ్మత

మహిళలపై లైంగికదాడులను అరికట్టే విషయమై పార్లమెంటు ఉభయసభలు చర్చించడం వల్ల ఈ దిశగా అర్థవంతమైన చర్యలు తీసుకోవచ్చునే ఆశ కలుగుతున్నది. మహిళలపై లైంగికదాడుల పట్ల దేశవ్యాప్తంగా కలవరం చెలరేగుతున్న దశలో, పార్లమెంటు ఇప్పటికైనా ఈ అంశంపై సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలె. ఢిల్లీలో నిర్భయ ఉదంతం మాదిరిగా కొన్ని సందర్భాల్లో ఆందోళనలు చెలరేగుతున్నాయి. మీడియాలో ప్రాముఖ్యం పొందనప్పటికీ దేశవ్యాప్తంగా లైంగికదాడులు తీవ్రస్థాయిలో సాగుతున్నాయి. గత బుధవారం హైదరాబాద్ నగరంలో ఒక మహిళపై నలుగురు లారీ సిబ్బంది బలత్కారానికి పాల్పడి దహనం చేయడం తీవ్ర ఆందోళనను కలిగించింది. ఇటీవలే హన్మకొండలో కూడా ఒక బాలికపై తెలిసిన వ్యక్తే లైంగికదాడి జరిపి హతమార్చాడు. అసిఫాబాద్‌లోనూ ఒక మహిళపై లైంగికదాడి జరిపి హత్య చేశారు. గత గురువారం నాడు తమిళనాడులో నినేవేలిలో ఒక 32 ఏండ్ల మహిళపై ఐదుగురు లైంగికదాడి చేశారు. కాంచీపురంలో అదృశ్యమైన ఇరువై ఏండ్ల మహిళ మృతదేహం గురువారంనాడు కనబడ్డది. తెలిసిన వ్యక్తే ఈ దారుణానికి పాల్పడ్డట్టు అనుమానిస్తున్నారు. చండీగఢ్‌లో పదకొండేండ్ల బాలికను బంధువు రైల్వే స్టేషన్‌లో వదిలేసింది. ఆమె ఒంటరిగా ఇంటికి పోతున్నప్పుడు ఆటోవాలా నిర్బంధించి కొన్నిరోజుల పాటు లైంగికదాడికి పాల్పడ్డాడు. వడోదరలో శుక్రవారం పద్నాలుగేండ్ల బాలికపై ఇద్దరు పలుమార్లు లైంగికదాడి చేసి పరారయ్యారు. రాంచీలో గత నెల 26వ తేదీన 25 ఏండ్ల న్యాయ విద్యార్థినిని పన్నెండు మంది అపహరించి లైంగికదాడికి పాల్పడ్డారు. ఒక వారం రోజుల వ్యవధిలో సాగిన లైంగికదాడులను గమనించినా మనసు వికలమవుతుంది. సభ్య సమాజమని చెప్పుకుంటున్నప్పటికీ మహిళల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలిసిపోతుంది.

> **దేశవ్యాప్తంగా లైంగికదాడులను కట్టడానికి పార్లమెంటులో సోమవారం రిగిన చర్చ అసమగ్రంగానే ముగిసింది. అందుకేనేమో కొందరు సభ్యులు తమ రాష్ట్రాలలోని ఘటనలను ప్రస్తావిస్తూ ఈ అంశంపై మరింత కూలంకష చర్చ సాగాలనే సూచనలు చేశారు. ఈ కొద్ది పాటి చర్చలో కొందరి అభిప్రాయాలు సగటు మనిషి ఆందోళనను వ్యక్తం చేసేవిగా ఉంటే, మరి కొందరి సూచనలు పరిగణించేవిగా ఉన్నాయి. లైంగికదాడికి పాల్పడిన వారి బహిరంగంగా మూకదాడికి గురి చేయాలనే ఒక సభ్యురాలి సూచన సమాజంలో నెలకొన్న ఆందోళనకు అద్దం పడుతున్నది.**

నైతిక విలువల పతనం కూడా ఈ లైంగికదాడులకు మూలమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సాంకేతికాభివృద్ధి మూలంగా సెల్‌ఫోన్‌లోనే అనేక అసభ్య రాతలు, దృశ్యాలు అందుబాటులోకి వచ్చాయి. వీటివల్ల ప్రభావితమైన యువత తప్పుదోవపడుతున్నది. ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకొని లైంగికదాడులను అరికట్టడానికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలె. ఒకప్పుడు మహిళలు ఇంటికే పరిమితమై ఉండేవారు. విస్తృత నగరాలు ఉండకపోవడం వల్ల మనుషులు, పరిసరాలు తెలిసి ఉండేవి. నైతిక విలువల ప్రభావం కూడా ఉండేది. మహిళలపై గృహహింస, వరకట్న బాధలు ప్రధాన చర్చానీయాంశాలుగా ఉండేవి. కానీ ఇప్పుడు నగరాలలో మహిళలు ఉద్యోగాలు చేయడం పరిపాటి. మహిళలకు లైంగికదాడుల నుంచి రక్షణ కల్పించడానికి మారుతున్న పరిస్థితులకు అనుగుణమైన ఏర్పాట్లు ఉండాలె. మహిళలపై లైంగికదాడులను మరింత విస్తృతమైన రీతిలో అర్థం చేసుకోవాలె. వీధుల్లో, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో వేధింపులకు గురిచేయడం కూడా మహిళల మానసిక స్థితిపై ప్రభావం చూపుతుంది. మహిళా పార్లమెంటు సభ్యుల్లో 82 శాతం మంది లైంగిక అవమానాలకు గురైనవారేనని ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ వివిధ ఖండాల్లోని 39 దేశాల్లో జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. దీనినిబట్టి ఈ జాడ్యం ఎంత లోతుగా పేరుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు.

దేశవ్యాప్తంగా లైంగికదాడులను కట్టడానికి పార్లమెంటులో సోమవారం రిగిన చర్చ అసమగ్రంగానే ముగిసింది. అందుకేనేమో కొందరు సభ్యులు తమ రాష్ట్రాలలోని ఘటనలను ప్రస్తావిస్తూ ఈ అంశంపై మరింత కూలంకష చర్చ సాగాలనే సూచనలు చేశారు. ఈ కొద్ది పాటి చర్చలో కొందరి అభిప్రాయాలు సగటు మనిషి ఆందోళనను వ్యక్తం చేసేవిగా ఉంటే, మరికొందరి సూచనలు పరిగణించేవిగా ఉన్నాయి. లైంగిక దాడికి పాల్పడిన వారి బహిరంగంగా మూకదాడికి గురి చేయాలనే ఒక సభ్యురాలి సూచన సమాజంలో నెలకొన్న ఆందోళనకు అద్దం పడుతున్నది. కొందరు గస్తీ పెంచాలనే సూచనలు ఇస్తే, మరికొందరు చట్టాలను కఠినతరం చేయాలన్నారు. కేంద్రం చట్టాలను మార్చడానికి సంసిద్ధతను వ్యక్తంచేసింది. చట్టాలు మార్చడంతో సరిపోదని, రాజకీయ చిత్తశుద్ధి, పరిపాలనా నైపుణ్యం ఉండాలనే అభిప్రాయం ఆలోచింపదగినది. ప్రజల ఆలోచనాతీరు మారాలనేది అన్నిటికన్నా ప్రధానమైన పరిగణింపదగిన సూచన. ఇందుకోసం ఏమి చేయాలనే దిశలో చర్చ సాగాలె. మతాల కోణంలో ఆలోచించకుండా, వ్యవస్థలో లోపాన్ని ఎట్లా చక్కదిద్దాలనేది చర్చించాలె. నిర్భయపై లైంగికదాడికి పాల్పడినవారు ఇంకా జైలులోనే ఉండటమేమిటనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అంటే ఖైదు చేయడాన్ని ప్రజలు శిక్షగా భావించకపోగా, మరణదండనే పరిష్కారంగా భావిస్తున్న పోకడ ఇది. ప్రజలలో నెలకొన్న ఆగ్రహాన్ని ఈ అభిప్రాయం ప్రతిబింబిస్తున్నది. అయితే చట్టాలు చేసేవారు ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని పంచుకుంటూనే, ఈ సామాజిక రుగ్మతకు హేతుబద్ధమైన పరిష్కారాన్ని అన్వేషించాలె. ముఖ్యమంత్రి కేసీఆర్ సత్వర విచారణ సాగించాలని ఆదేశించడం ఈ దిశగా ఒక నిర్దిష్ట చర్య. నేరస్తులను పట్టుకోవడం, సత్వర విచారణ సాగించి శిక్షించడం ఒక అంశం. అత్యాచారాలను అరికట్టడం అంతకు మించిన సవాలు. ఇందుకు సమాజపరంగా అన్నివర్గాలు ముందుకురావాలె.

విశ్లేషణ

**కబీర్ అగర్వాల్**
**అనుజ్ శ్రీనివాస్**

# ఎగవేతదారులను దాయొద్దు!

**2011లో ఆర్‌బీఐ నుంచి ఉద్దేశపూర్వక అప్పు ఎగవేతదారుల జాబితా కావాలని స.హ.చట్టం కింద అడిగిన విన్నపాలు సెంట్రల్ ఇన్ఫర్మేష న్ కమిషన్ (సీఐసీ) చెంతకు చేరాయి. దీంతో సీఐసీ కమిషనర్ శైలేష్ గాంధీ ఎగవేతదారుల జాబితా వెల్లడించాలని ఆర్‌బీఐని ఆదేశించారు. ఈ క్రమంలో ఎగవేతదారుల పేర్లు ప్రకటించినంత మాత్రాన బ్యాంకులు విశ్వసనీయతను కోల్పోతాయని, ఆర్థికవ్యవస్థపై ప్రభావం పడుతుందన్నదాన్ని తోసిపుచ్చారు. దేశ ఆర్థికవ్యవస్థకు నష్టం జరుగనంతవరకు ఎగవేతదారుల పేర్లు ప్రకటించవచ్చని తేల్చిచెప్పారు.**

బ్యాంకులకు అప్పు ఎగవేతదారుల పేర్లు బయటపెట్టాలని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాను చాలామంది ఎంతోకాలంగా కోరుతున్నారు. కానీ వ్యక్తిగత గోప్యత హక్కు, దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా బయటపెట్టజాలమని బ్యాంకులు, ప్రభుత్వం చెబుతూవచ్చాయి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని, కావాలని అప్పులు ఎగవేస్తున్న వారి పేర్లు బయటపెట్టాలని స.హ.చట్టం కింద సుప్రీంకోర్టుకు వినతి చేసుకోవటంతో చివరికి సుప్రీంకోర్టు అప్పు ఎగవేతదారుల పేర్లు చెప్పాలని ఆర్బీఐని ఆదేశించింది. ఆ క్రమంలో ఇప్పుడు ఓ ముప్పై మంది అతిపెద్ద అప్పువేతదారుల పేర్లు బయటపెట్టింది.

గత పదేండ్లుగా స.హ.చట్టం కింద వచ్చిన విజ్ఞాపనలను ఆర్బీఐ తిరస్కరిస్తూ వచ్చింది. దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా రుణ ఎగవేతదారుల పేర్లు బయటపెట్టలేమని, బ్యాంకులకు, రుణగ్రహీతలకు మధ్య ఉన్న విశ్వసనీయతకు భంగకరమని చెప్పుకొచ్చింది. ఈ క్రమంలో ఎన్నివైపుల నుంచి ఎగవేతదారుల పేర్లను బయటపెట్టాలన్న డిమాండ్‌ను తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉద్దేశపూర్వకంగా రుణ ఎగవేతదారుల పేర్లు సెంట్రల్ బ్యాంకు వద్ద ఉన్నా, వాటిని వివిధ బ్యాంకుల వారీగా ఉన్న ఎగవేతదారుల పేర్లు ఇవ్వటానికి కూడా సిద్ధపడలేదు.

ఎట్టకేలకు కోర్టు ఆదేశాల మేరకు సెంట్రల్ బ్యాంక్ రుణ ఎగవేతదారులు ముప్పై మంది లిస్టులో మెహుల్ చోక్సీకి చెందిన మూడు కంపెనీలు కూడా ఉన్నాయి. ఈ పెద్ద కంపెనీలు ఎగవేసిన అప్పుల మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది. ఆ మాఫీ చేసిన మొత్తం కూడా రూ.50 వేల కోట్లపై మాటే. ఈ క్రమంలోంచే చూస్తే దేశవ్యాప్తంగా ఉద్దేశపూర్వకంగా బ్యాంకులకు అప్పులు ఎగవేసిన వాటిలో 2018 డిసెంబర్ నాటికి 11 వేల కంపెనీలున్నాయి. ఈ కంపెనీలు ఎగవేసిన మొత్తం ట్రాన్స్ యూనియన్ సిబిల్ డాటా ప్రకారం 1.61 లక్షల కోట్ల రూపాయలు. ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారుల జాబితాను ఆర్‌బీఐ సెంట్రల్ బ్యాంకింగ్ సిస్టం 'సీఆర్ఐఎల్‌సీ' ద్వారా విడుదల చేసింది. ఈ ఎగవేతదారుల్లో ఐదు కోట్ల కన్నా ఎక్కువ మొత్తాలను ఎగవేసిన వారి పేర్లే ఉన్నాయి. గత మూడేండ్లుగా సీఆర్ఐ ఎల్‌సీ ఎగవేతదారుల పేర్లు ప్రకటించటం మూలంగా, అప్పుల కోసం బ్యాంకుల దగ్గరికి వచ్చిన వారిలో ఎగవేతదారులను గుర్తించటం, బ్యాంకులను మోసం చేయకుండా నిలువరించటం సులువైంది. 2019 ఫిబ్రవరి నుంచి బ్యాంకులు సీఆర్ఐఎల్‌సీ ద్వారా రుణం కోసం వచ్చేవారిలో సమస్యాత్మక, ఎగవేతదారులను గుర్తిస్తున్నారు. అప్పు కట్టడానికి తగిన స్థోమత ఉన్నా కట్టకుండా బ్యాంకులను మోసం చేస్తున్నవారిని ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ఆర్‌బీఐ నిర్వచిస్తున్నది. అలాగే రుణగ్రహీలు తాము అప్పు తీసుకునేటప్పుడు ఆ సొమ్మును దేని కోసమైతే వినియోగిస్తామని చెబుతారో, దానికి కాకుండా ఆ నిధులను మరొక వైపు మళ్లించే వారిని కూడా ఆర్‌బీఐ విల్‌ఫుల్ డీఫాల్టర్స్‌గా ప్రకటిస్తున్నది.

ఇలా ఉద్దేశపూర్వకంగా బ్యాంకు అప్పులను ఎగవేసిన వారిలో పేరు మోసిన కంపెనీలుండటం గమనార్హం. వాటిలో గీతాంజలి జెమ్స్, రోటోమాక్ గ్లోబల్, జూమ్ డెవలెపర్స్, డక్కన్ క్రానికల్ హోల్డింగ్స్, విన్‌సమ్ డైమండ్స్, ఆర్ఈఐ ఆగ్రో, సిద్ధివినాయక లాజిస్టిక్స్ అండ్ కుడోస్ చెమీ లాంటి ప్రముఖ కంపెనీలున్నాయి. ఈ కంపెనీల డైరెక్టర్లు, ప్రమోటర్లు అందరూ సీబీఐ, ఈడీ లాంటి కేంద్ర సంస్థలతో విచారణ ఎదుర్కొంటున్నారు. వీరిలో కొందరి పేర్లు ఆర్‌బీఐ గవర్నర్‌గా రఘురాం రాజన్ ఉన్నకాలంలో ప్రధాని కార్యాలయానికి కూడా పంపటం జరిగింది. వారందరిపై సత్వర విచారణ, చర్యలు తీసుకోవాలని సీబీఐ, ఈడీ లాంటి కేంద్ర సంస్థలకు సూచించటం కూడా జరిగింది. అయినా ఇందులో కొన్నివాటిలో మాత్రమే విచారణ సంస్థలు ఒక కొలిక్కి వచ్చి ఆయా కంపెనీల ఆస్తులను జప్తు చేయటం జరిగింది. కానీ మెజారిటీ సంస్థలకు సంబంధించి వాటి అప్పులు, కారణాల విషయంలో ఇంకా విచారణ ప్రారంభం కాకపోవటం గమనార్హం.

ఎగవేతదారుల లిస్టులో మరి కొన్ని ప్రముఖ కంపెనీల పేర్లు కూడా ఉన్నాయి. అయితే ఆ కంపెనీల ప్రమోటర్ల తరపున జరిగిన తప్పు ఏమిటో స్పష్టత లేదు. అలాంటి వాటిలో ఏజీబీ షిప్‌యార్డ్, రుచిసోయా ఇండస్ట్రీస్, హనుంగ్ టాయ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఎస్ కుమార్స్, కెఎస్ ఆయిల్స్ లిమిటెడ్ లాంటి కంపెనీలున్నాయి. ఐడీబీఐ బ్యాంకు రుచిసోయా కంపెనీని 2017 డిసెంబర్‌లో విల్‌ఫుల్ డీఫాల్టర్‌గా ప్రకటించింది. దీన్ని ఆ కంపెనీ యాజమాన్యం సవాల్ చేస్తూ న్యాయస్థానం మెట్లెక్కింది. ఐబీసీ క్రమంలో ఈ కంపెనీని పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ కంపెనీ కొనేసింది. ఈ నేపథ్యంలోనే 2018లో ఈ రుచిసోయా కంపెనీ కేంద్ర సంస్థల నిఘా నీడలో ఉన్నదని మీడియాలో వార్తలు వచ్చాయి. అందులో డబ్బులు దుర్వినియోగం చేయబడ్డాయని ఆరోపించారు. మరోసారి 2018 జూన్‌లో కూడా ఆ కంపెనీలో పెద్ద ఎత్తున సింగపూర్ కంపెనీతో లావాదేవీల విషయంలో నిధుల గోల్‌మాల్ జరిగిందని వార్తలు వచ్చాయి. అలాగే ఏబీజీ షిప్‌యార్డ్ కూడా ఉద్దేశపూర్వక ఎగవేత కంపెనీగా ముద్రవేయబడింది. అలాగే ఖాతాలన్నీ కేంద్ర నిఘా సంస్థల పరిశీలనలో ఉన్నాయని కూడా మీడియాలో వచ్చింది. ఆ సమయంలో ఏబీజీ షిప్‌యార్డ్ కంపెనీ రుణదాతలకు 16 వేల కోట్లు చెల్లించాల్సి ఉన్నది. ఆ కంపెనీని విల్‌ఫుల్ డీఫాల్టర్స్ లిస్టులో పెడుతూ..‘ కంపెనీ ప్రమోటర్లు దాని ఆర్థిక అవసరాలను తీర్చేవిధంగా వారు నడుపుతున్నారా అనేదాని కన్నా, వారు సమర్థంగా ఆర్థిక, వ్యాపార ప్రమాణాలకు తగ్గటుగా నడుపుతున్నారా లేదా అన్నదానిపై కూడా ఆధారపడి ఎగవేతదారుల లిస్టులో చేరుస్తా'మని చెప్పటం జరిగింది. కాని కంపెనీ ఇప్పటి పరిస్థితి ఏమిటంటే దాన్ని అమ్మకానికి పెట్టినా దాన్ని కొనటానికి ఎవరూ ముందుకు రావటం లేదు. ఎందుకంటే ఆ కంపెనీ నిర్వహణ తీరులో వ్యవహరించిన తీరు ప్రధాన అవరోధంగా మారింది. అలాగే హనుంగ్ టాయ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కంపెనీని 2018 మార్చిలో పంజాబ్ నేషనల్ బ్యాంకు 2,600 కోట్ల రూపాయలు ఎగవేసినందుకు గాను ఎగవేతదారుల లిస్టులో చేర్చింది. కానీ బ్యాంకులో ఆర్థిక లావాదేవీల విషయంలో అక్రమాలు జరిగాయా అన్నది తేలలేదు కానీ ఈ కంపెనీ ప్రమోటర్ అశోక్‌కుమార్ బన్సాల్, అతని భార్యను నిర్బంధించారు. ఈ కోవలోనే ఎస్ కుమార్ నేషన్ వైడ్ కంపెనీ కూడా క్రమం తప్పకుండా అప్పులు చెల్లించటంలో వైఫల్యం చెందింది. ఈ కంపెనీ ఐదు నుంచి ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఎగవేసిందని చెబుతూ దాన్ని విల్‌ఫుల్ డీఫాల్టర్స్ లిస్టులో చేర్చారు. ఈ క్రమంలోనే 2019 జూన్‌లో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఎస్.కుమార్ ఆస్తులను అమ్మకానికి పెట్టింది. కానీ దాన్ని కొనేవారు కనిపించలేదు. ఈ కంపెనీ నిర్వహణ వ్యవహారంలో కూడా ఆర్థిక అరాచకం, గోల్‌మాల్ జరిగిందనటానికి రుజువులేమీ లభించలేదు.

> ఉద్దేశ పూర్వక రుణ ఎగవేతదారుల పేర్లు వెల్లడించాలని ప్రజలు సమాచారహక్కు చట్టం సాయంతో బ్యాంకులను కోరిన ఫలితంగా ఇదం తా జరిగింది. అయినా ఇప్పటికీ ఆర్‌బీఐ ఎగవేతదారుల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్న తీరు కనిపించటం లేదు. ఇంత జరిగినా అతి ఎక్కువ మొత్తంలో ఎగవేతదారులంటూ 30 మంది పేర్లనే ఆర్‌బీఐ ప్రకటించింది. నిరర్ధక ఆస్తుల విభాగంలో ఉన్నవాటి పేర్లనే ప్రకటించింది.

2011లో ఆర్‌బీఐ నుంచి ఉద్దేశపూర్వక అప్పు ఎగవేతదారుల జాబితా కావాలని స.హ.చట్టం కింద అడిగిన విన్నపాలు సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (సీఐసీ) చెంతకు చేరాయి. దీంతో సీఐసీ కమిషనర్ శైలేష్ గాంధీ ఎగవేతదారుల జాబితా వెల్లడించాలని ఆర్‌బీఐని ఆదేశించారు. ఈ క్రమంలో ఎగవేతదారుల పేర్లు ప్రకటించినంత మాత్రాన బ్యాంకులు విశ్వసనీయతను కోల్పోతాయని, ఆర్థికవ్యవస్థపై ప్రభావం పడుతుందన్నదాన్ని తోసిపుచ్చారు. దేశ ఆర్థికవ్యవస్థకు నష్టం జరుగనంత వరకు ఎగవేతదారుల పేర్లు ప్రకటించవచ్చని తేల్చిచెప్పారు. ఈ ఎగవేతదారుల పేర్లు వెల్లడించటం అనేది దేశ నైతిక విలువల పరిరక్షణకు భంగం కలిగించకుండా దేశ ప్రయోజనాలను కాపాడేదిగా ఉండాలని గాంధీ అన్నారు. ఎగవేతదారుల పేర్లు వెల్లడించినంత మాత్రాన దేశంలోని బ్యాంకు ఖాతాదారుల విశ్వాసం కోల్పోతామన్నది సరికాదని గాంధీ తన ఆదేశంలో వెల్లడించారు. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఢిల్లీ హైకోర్టు ఆశ్రయించటంతో కోర్టు స్టే ఇచ్చింది.

ఉద్దేశ పూర్వక రుణ ఎగవేతదారుల పేర్లు వెల్లడించాలని ప్రజలు సమాచారహక్కు చట్టం సాయంతో బ్యాంకులను కోరిన ఫలితంగా ఇదం తా జరిగింది. అయినా ఇప్పటికీ ఆర్‌బీఐ ఎగవేతదారుల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్న తీరు కనిపించటం లేదు. ఇంత జరిగినా అతి ఎక్కువ మొత్తంలో ఎగవేతదారులంటూ 30 మంది పేర్లనే ఆర్‌బీఐ ప్రకటించింది. నిరర్ధక ఆస్తుల విభాగంలో ఉన్నవాటి పేర్లనే ప్రకటించింది. మరికొన్నింటి విషయంలో ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఇ) ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో, ప్రత్యేక ఖాతాదారుల పేర్లు వెల్లడించలేమని చెబుతున్నది. అలాగే జయంతిలాల్ మిస్త్రీ తీర్పులోని 77 పేరాలో చెప్పినవిధంగా ప్రత్యేకమైన సమాచారాన్ని చెప్పకుండా దాచి ఉంచవచ్చన్న దానికి అనుగుణంగా చెప్పటానికి నిరాకరిస్తుండటం గమనార్హం.

**('ది వైర్' సౌజన్యంతో..)**

# మనిషికే వైకల్యం, మనసుకు కాదు

సందర్భం



**మల్లవరపు బాల లత**

ఐక్యరాజ్యసమితి ఏటా డిసెంబర్ 3ను అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంగా జరుపుకుంటుంది. దివ్యాంగుల సమస్యల పట్ల అవగాహన కల్పించేందుకు, రాజకీయ సంకల్పాన్ని ప్రోది చేసేందుకు, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి వనరులను కూడగట్టేందుకు ఈ సందర్భంగా పలుకార్యక్రమాలు చేపడుతుంది. దానిలో భాగంగా ఈ ఏడాది 'సమాజ నిర్మాణంలో దివ్యాంగుల భాగస్వామ్యం ప్రోత్సహించడం వారి నాయకత్వానికి ఊతమివ్వడం' అనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికను రచించింది.

**అంకెలు చెప్పే నిజాలు:** 2011 జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో 2.68 కోట్ల మంది ఏదో ఒక వైకల్యంతో బాధపడుతున్నారు. మొత్తం జనాభాలో ఇది 2.1 శాతానికి సమానం. 2011 జనాభా లెక్కల నాటికి చట్ట ప్రకారం గుర్తించబడిన వైకల్యాలు 7 మాత్రమే. 2016లో అమల్లోకి వచ్చిన కొత్త చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలు చట్టపరమైన గుర్తింపు పొందాయి. ఈ లెక్కన వైకల్యంతో బాధపడేవారి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నది.

అధికారిక గణాంకాల ప్రకారం 70 శాతం దివ్యాంగుల జనాభా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తుంది. కేవలం 8.5 శాతం మంది దివ్యాంగులు మాత్రమే గ్రాడ్యుయేట్ విద్యను పూర్తిచేయగలుగుతున్నారు. మొత్తం దివ్యాంగులలో 3వ వంతు మాత్రమే ఏదో ఒకరకమైన ఉపాధిని పొందగలుగుతున్నారు. 40శాతానికి పైగా దివ్యాంగులు జీవితకాలం వివాహం లేకుండానే ఉండిపోవాల్సి వస్తుంది. పాఠశాల విద్యను మధ్యలోనే వదిలివేస్తున్న చిన్నారుల్లో అత్యధికులు దివ్యాంగులే. ఈ గణాంకాలన్ని దివ్యాంగుల దీనస్థితిని కళ్లకు కడుతుంటే మరోవైపు దివ్యాంగులను ఆర్థికవ్యవస్థలో భాగస్వాములు చేయలేకపోవడం వల్ల మనదేశం ఏటా 5 నుంచి 7 శాతం జీడీపీని కోల్పోతున్నట్లు ఓ అంచనా.

**వివక్షే అసలు సమస్య:** ఖగోళ భౌతికశాస్త్ర సైద్ధాంతికుడు దివంగత స్టీఫెన్ హాకింగ్ కదలలేని, మాట్లాడలేని స్థితిలో ఉండి కూడా నిరుపమానమైన పరిజ్ఞానాన్ని సమాజానికి అందించాడు. హాకింగ్ చెప్పినట్లుగా సామాజిక వివక్షే దివ్యాంగులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. శారీరక వైకల్యం కారణంగా దుర్బలంగా మారిన దివ్యాంగులను సామాజిక వివక్ష, ఆర్థిక అవరోధాలు, అవకాశాల కొరత మరింత కుందీస్తున్నాయి.

**ఎన్నో విజయగాథలు:** గత అక్టోబర్‌లో ప్రాంజల్ పాటిల్ అనే యువ ఐఏఎస్ అధికారిణి తిరువనంతపురం సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం మన మనోఫలకాలపై ఇప్పటికీ తాజాగానే ఉన్నది. ఆరేండ్ల వయసులోనే కంటిచూపు పూర్తిగా కోల్పోయినా సడలని సంకల్పం, లక్ష్యం పట్ల చిత్తశుద్ధి, చెదరని స్ఫూర్తి ప్రాంజల్‌ను అన్ని అవరోధాలు దాటి సివిల్స్‌కి ఎంపికయ్యేలా చేశాయి. వైకల్యం శరీరానికి మెదడుకే కానీ మనసుకు కాదని మానవ స్ఫూర్తి, ఆశావహ దృక్పథం, చట్టం కల్పించిన ప్రత్యేక హక్కుల పట్ల అవగాహన, లక్ష్యశుద్ధి, పోరాడే తత్త్వం ఉంటే ఆకాశమే హద్దుగా ఎదుగవచ్చని చాలా మంది విజేతలంతా నిరూపించారు.

**సామాజిక న్యాయం:** భారత రాజ్యాంగం ప్రవేశిక పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్నీ, సమానావకాశాలను, వ్యక్తి గౌరవానికి హామీ ఇస్తుంది. కులం, మతం, ఇతర అంశాల ఆధారంగా వివక్షను నిషేధిస్తున్న భారత రాజ్యాంగం వైకల్యం ఆధారంగా చూపిస్తున్న వివక్షను నిషేధించకపోవడం, దీనిని ప్రాథమికహక్కుల్లో భాగంగా చేయకపోవడం విచారకరం. కాకపోతే ఆదేశిక సూత్రాల్లోని 41వ అధికరణ దివ్యాంగులకు పనిహక్కును, విద్యను, మరింత చేయూతరందించాల్సిన విద్యుక్త ధర్మాన్ని ప్రభుత్వాలకెప్పుడూ గుర్తుచేస్తుంటుంది.

ఐరాస దివ్యాంగుల హక్కుల కన్వెన్షన్ 2006కు అనుగుణంగా దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016ని అమల్లోకి తీసుకువచ్చింది. వైకల్యాన్ని ఒక గతిశీల, కాలానుగుణంగా పరిణామం చెందే భావనగా ఈ చట్టం గుర్తిస్తుంది. తద్వారా వైకల్యభావనను, వైకల్యాల సంఖ్యను, పరిధిని ఈ చట్టం విస్తృతపరిచింది. గతంలో ఏడుగా ఉండే వైకల్యాల సంఖ్య ఈ చట్టంలో 21కి పెరిగింది. మరుగుజ్జుతనం, అంధత్వం వంటి భౌతిక వైకల్యాలతో పాటు, కండరాల క్షీణత, సెరిబ్రల్ పాల్సీ వంటి నాడీ సంబంధిత రుగ్మతలను, థలసేమియా, హీమోఫిలియా, సికిల్‌సెల్ అనీమియా వంటి జన్యుపరమైన, రక్తసంబంధ సమస్యలను, యాసిడ్ దాడి, పార్కిన్‌సన్ వ్యాధి వంటి వాటిని కూడా వైకల్యాలుగా గుర్తిస్తుంది. అంతేకాకుండా ఉన్నతవిద్యలో 5శాతానికి తగ్గకుండా, ప్రభుత్వోద్యోగాల్లో 4 శాతానికి తగ్గకుండా, పేదరిక నిర్మూలన కార్యక్రమాల కేటాయింపులో కనీసం 5 శాతం ప్రాతినిధ్యం దివ్యాంగులకు దక్కేలా చట్టం నిర్దేశిస్తుంది. 6 నుంచి 18 ఏండ్ల మధ్య చిన్నారులకు ఉచిత విద్యను అందజేయవలసిన బాధ్యతని ప్రభుత్వాలపై ఉంచింది. దివ్యాంగుల పట్ల వివక్షను నిషేధిస్తూ చట్ట ఉల్లంఘనకు పాల్పడినవారికి తగిన శిక్షలను, చట్టం అమలుకు కావలసిన వ్యవస్థల గురించి చట్టం వివరిస్తుంది.

> ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అజెండా 2030 అన్ని వర్గాలను సామాజికాభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ అందరి అవకాశాలను, ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తూ, అందరి సంక్షేమానికి విశ్వవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు కృషిచేయవలసిన అవసరాన్ని నిర్దేశిస్తుంది. సమ్మిళిత సమాజ నిర్మాణానికి, సామాజిక న్యాయ సాధనకు దివ్యాంగుల హక్కుల పరిరక్షణ అత్యంత కీలకం.

2018లో దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం రెండేండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా డి.ఆర్.ఐ.ఎఫ్ (డిజబులిటి రైట్స్ ఇండియా ఫౌండేషన్) మరికొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిర్వహించిన ఒక అధ్యయనం చట్టం అమల్లోని లోపాలను కళ్లకు కట్టింది. చట్టం అమల్లోకి వచ్చిన రెండేండ్ల తర్వాత కూడా ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా పూర్తికాలేదు. సగానికి పైగా రాష్ట్రాల్లో రాష్ట్రస్థాయి సలహా కమిటీలు, 80 శాతానికి పైగా జిల్లాల్లో జిల్లాస్థాయి సలహా కమిటీలు ఏర్పాటుకాలేదు. మూడవ వంతు రాష్ట్రాల్లో కమిషనర్‌ల నియామకం చేపట్టనేలేదు. సగం రాష్ట్రాల్లో మాత్రమే కొత్త చట్టానికి అనుగుణంగా గుర్తింపు కార్డుల జారీ మొదలైంది.

గతకొన్ని ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ ప్రతులను విశ్లేషిస్తే దివ్యాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు వహిస్తున్న ఉదాసీనత తేటతెల్లమవుతుంది. సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడిచే వికలాంగుల సశక్తీకరణ విభాగానికి కేటాయింపులు కొన్నేండ్లుగా ఒకేచోట స్థిరంగా ఉన్నాయి. పెరుగుతున్న దివ్యాంగ జనాభా, వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ కోసం అవసరమైన కేటాయింపులు జరుపకపోగా ఆ కేటాయించిన నిధులు కూడా పూర్తిస్థాయిలో విడుదలకు నోచుకోవడం లేదు.

సామాన్య ప్రజలే కాకుండా ప్రభుత్వాధికారులు కూడా దివ్యాంగుల పట్ల వివక్షాపూరిత వైఖరిని కనబరుస్తున్నారు. ట్రైసైకిళ్ళు, కృత్రిమ అవయవాల కేటాయింపు, సమయానుగుణంగా పింఛన్ల పంపిణీ, పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో సరైన ప్రాతినిధ్యం వంటి కనీస అవసరాల కోసం కూడా నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రమాదాల కారణంగా, వృద్ధాప్యం కారణంగా వైకల్యానికి గురైన బాధితుల పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నది.

ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అజెండా 2030 అన్ని వర్గాలను సామాజికాభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ అందరి అవకాశాలను, ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తూ, అందరి సంక్షేమానికి విశ్వవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు కృషిచేయవలసిన అవసరాన్ని నిర్దేశిస్తుంది. సమ్మిళిత సమాజ నిర్మాణానికి, సామాజిక న్యాయ సాధనకు దివ్యాంగుల హక్కుల పరిరక్షణ అత్యంత కీలకం. 'లీవ్ నో వన్ బిహైండ్' అన్న ఐరాస ఆశయం ఒక శుష్క నినాదంగా మిగిలిపోకూడదని మనందరం ఆశిద్దాం.

**జనగళం**

## ఆడపిల్ల అంతరాత్మ

**అర్థరాత్రి ఆడపిల్ల స్వేచ్ఛగా తిరిగితేనే**
స్వాతంత్ర్యమన్నాడు మహాత్మా
ఎప్పోడొస్తుంది స్వాతంత్ర్యం
అని ప్రశ్నిస్తుంది ఆడపిల్ల అంతరాత్మా ?

మంచితనాన్ని మానభంగం చేశారు
మానవత్వాన్ని కాల్చి బూడిద చేశారు
భారతీయులందరూ నా సహోదరులు
అనలేని అనైతికం
ఆడదిలో అమ్మను చూడలేని మూర్ఖత్వం

ఆకాశంలో చుక్కలా మెరవాలనుంది
కానీ కోర్కెల బడబాగ్నిలో
మసి చేసి, నుసి చేసి, చుక్కల్లో కలిపేస్తున్నారు
ప్రకృతిలో ఓ ఆకృతినై మురవాలనుంది
కానీ ఆధిపత్యం నీడల్లో రక్కేసి తొక్కేసి
పంచ భూతాల్లో కలిపేస్తున్నారు !



మృగత్వం వెర్రితలలు వేస్తుంది
మదత్వం విర్రవీగుతుంది.
కామాంధుల వేటుకు సభ్య సమాజం
సిగ్గు పడుతోంది
అవయవాల పోటుకు అమ్మతనం ఏడుస్తుంది,
ఎంతకాలం ఈ ఆరని మంటల ఆడతనం జ్వాలలు
ఎంతకాలం ఓరిమి సహించే నారీ జన్మం బలులు
మారాలి ఈ అమానుషత్వపు స్వార్థం
వినిపించాలి మనిషితత్వపు స్వేచ్ఛాగీతం
వనితలకు ఓదార్పునిచ్చే రాతలు వద్దు
జీవితాలకు భరోసానిచ్చే చేతలే ముద్దు

**– సముద్రాల శ్రీదేవి, 99498 37743**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

# ఎస్సీ/ఎస్టీ క్రీమీలేయర్ తీర్పును సమీక్షించండి

సుప్రీంకోర్టుకు కేంద్రం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** రిజర్వేషన్ సదుపాయాలు పొందకుండా ఎస్సీ/ఎస్టీలలోని క్రీమీ లేయర్‌ను (సంపన్న వర్గాన్ని) మినహాయిస్తూ గత ఏడాది ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి నివేదించాలని సుప్రీంకోర్టుకు కేంద్రం విజ్ఞప్తి చేసింది. షెడ్యూల్డు కులాలు (ఎస్సీ), షెడ్యూల్డు తరగతులు (ఎస్సీ)లలోని సంపన్నులకు కాలేజీ అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ సదుపాయం కల్పించరాదంటూ ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గత ఏడాది తీర్పు చెప్పింది. ఈ తీర్పును సమీక్షించాలని కేంద్రం తాజాగా కోర్టుకు విజ్ఞప్తి చేసింది. క్రీమీలేయర్ మినహాయింపు సూత్రాన్ని ఎస్సీ, ఎస్టీలకు వర్తింపజేయరాదని, కోర్టు ఇచ్చిన తీర్పును ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి నివేదించాలని కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే, జస్టిస్‌లు బీఆర్ గవాయ్, సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. అయితే సమతా ఆందళన్ సమితి పక్షాన హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ్ కేంద్రం విజ్ఞప్తిని వ్యతిరేకించారు. ఈ కేసుపై రెండు వారాల అనంతరం విచారణ చేపడుతామని పేర్కొన్న న్యాయస్థానం..కేంద్ర ప్రభుత్వానికి, జాతీయ ఎస్సీ కమిషన్‌కు మాజీ ఐఏఎస్ అధికారి ఎంఎల్ శరవణ్‌కు, నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఫర్ రివిజన్ ఆఫ్ రిజర్వేషన్ పాలిసీ అధ్యక్షుడు ఓపీ శుక్లాకు నోటీసులు జారీ చేసింది.

# రియల్టర్ సంస్థ వద్ద 3,000 కోట్ల నల్లధనం

ఎన్సీఆర్ పరిధిలో గతవారం ఐటీ దాడులు



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్) పరిధిలోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వద్ద ఇటీవల ఐటీ శాఖ నిర్వహించిన దాడుల్లో రూ.3000 కోట్లకు పైగా నల్లధనం దొరికినట్లు సమాచారం. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సదరు సంస్థ పేరు వెల్లడించలేదు. కానీ అధికార వర్గాల కథనాన్ని బట్టి ఓరియంటల్ ఇండియా గ్రూప్‌పై ఐటీ దాడులు చేసినట్లు తెలుస్తున్నది. గత వారం ఈ గ్రూప్‌కు చెందిన 25కు పైగా ప్రదేశాల్లో ఐటీ దాడులు జరిపింది. 'ఈ దాడుల్లో సదరు సంస్థ రూ.250 కోట్లకు పైగా లెక్కలు చూపని నగదు చెల్లింపులు జరిపినట్లు ఆధారాలు లభించాయి. లెక్కలు చూపని రూ.3.75 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేశాం. రూ.3000 కోట్ల నల్లధనానికి పన్ను చెల్లింపులు జరిపేందుకు సదరు సంస్థ అంగీకరించింది' అని సీబీడీటీ తన ప్రకటనలో పేర్కొంది.

# నౌకాదళ తొలి మహిళా పైలట్ 'శివాంగి'!



**కొచి:** భారత నౌకాదళంలో పైలట్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలి మహిళగా సబ్-లెఫ్టినెంట్ శివాంగి రికార్డు నెలకొల్పారు. సోమవారం కేరళలోని కొచి నౌకాదళ స్థావరం వద్ద విభాగం ఉన్నతాధికారుల సమక్షంలో ఆమె స్వయంగా యుద్ధ విమానాన్ని విజయవంతంగా నడిపారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన శివాంగి.. మీడియాతో మాట్లాడుతూ విమానం పైలట్ కావాలన్నది తన చిన్ననాటి కల అని చెప్పారు. తన దీర్ఘకాల కల సాకారం చేసుకున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు. ఐఎన్ఎస్ గరుడ యుద్ధ నౌకపై డార్నియర్ స్క్వాడ్‌లో భాగంగా ఆమె ఇనాస్ 550 నిఘా విమానాలను నడుపనున్నారు.





ఢిల్లీలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నా


కోల్‌కతాలో కండ్లకు గంతలు కట్టుకొని ర్యాలీ నిర్వహించిన ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు


లక్నోలో ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ ఆందోళన



పాట్నాలో నర్సుల మానవహారం

# దోషులను ఉరితీయాలి

## ముక్తకంఠంతో నినదించిన పార్లమెంట్


- శంషాబాద్ దారుణాన్ని ఏకగ్రీవంగా ఖండించిన లోక్‌సభ, రాజ్యసభ
- నిర్ణీత సమయంలోగా శిక్ష అమలయ్యేలా చట్టాలను మార్చాలని సూచన
- మహిళలపై నేరాలు ఓ సామాజిక వ్యాధిగా పరిణమించాయి: వెంకయ్యనాయుడు
- కఠిన చట్టం రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నాం: రాజ్‌నాథ్ సింగ్
- నిందితులను నడిబజార్లో కొట్టి చంపాలి: జయాబచ్చన్


ఢిల్లీలో జరిగిన నిరసన ప్రదర్శనలో రోదిస్తున్న ఓ విద్యార్థిని

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** హైదరాబాద్‌లోని శంషాబాద్ సమీపంలో జరిగిన 'దిశ' దారుణ ఉదంతంపై సోమవారం పార్లమెంట్ అట్టుడికింది. పశువైద్యురాలిపై లైంగిక దాడి, హత్యను పార్టీలకతీతంగా ఎంపీలందరూ ముక్తకంఠంతో ఖండించారు. నిందితులకు ఉరిశిక్ష విధించాలని, శిక్షను సత్వరం అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మహిళలపై లైంగిక నేరాలు పెరిగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. దోషులను నడి బజార్లో నిలబెట్టి కొట్టి చంపాలని ఎంపీ జయాబచ్చన్ ఆగ్రహం వ్యక్తంచేయగా.. దోషులకు క్షమాభిక్షకు అనుమతించే విషయంపై పునరాలోచించాలని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు సూచించారు. నిందితులకు వేగంగా శిక్షపడేలా చట్టాలను కఠినతరం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించారు.

### క్షమాభిక్షపై పునరాలోచించాలి: వెంకయ్య

లైంగికదాడుల నిరోధానికి కఠిన చట్టాలు తేవడంతోపాటు ప్రజల ఆలోచన విధానంలోనూ మార్పులు రావాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ 'ఇలాంటి ఘటనల్లో కోర్టులు నిందితులకు కఠిన శిక్షలు విధిస్తున్నాయి. అయితే వెంటనే ఆ శిక్షను తగ్గించాలంటూ క్షమాభిక్ష పిటిషన్లు దాఖలవుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు శిక్ష విధిస్తున్నా.. పైకోర్టుల్లో అప్పీళ్లకు వెళ్తున్నారు. ఇలా ఏండ్లపాటు విచారణ సాగుతూనే ఉన్నది. కాబట్టి న్యాయ ప్రక్రియలో మార్పులపై ఆలోచించాల్సిన అవసరం ఉన్నది' అని పేర్కొన్నారు. న్యాయ, పోలీస్ వ్యవస్థల్లో ఎక్కడో లోపం ఉన్నదని, ఫలితంగా మహిళలపై నేరాలు ఓ సామాజిక వ్యాధిగా పరిణమించాయని వ్యాఖ్యానించారు. మహిళలపై నేరాలకు పాల్పడే వ్యక్తుల ఫొటోలను బహిరంగంగా ప్రదర్శించాలని, దీంతో వారు సమాజంలో భయంభయంగా తిరుగాల్సి వస్తుందని, ఇది ఇతరులకు గుణపాఠంగా ఉంటుందని పేర్కొన్నారు.



**నిర్ణీత సమయంలోగా ఉరిశిక్ష అమలు చేయాలి**

సోమవారం రాజ్యసభ సమావేశమవగానే ఎంపీలందరూ ముక్తకంఠంతో 'దిశ' ఘటనను ఖండించారు. హైదరాబాద్ ఘటనపై చర్చించాలంటూ సభ్యులు వాయిదా తీర్మానం కోరగా, చైర్మన్ వెంకయ్యనాయుడు తిరస్కరించారు. 'దిశ'తోపాటు దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలకు సంబంధించి సభ్యులు తమ అభిప్రాయాలను క్లుప్తంగా చెప్పాలని సూచించారు. నిందితులకు వేగంగా శిక్షపడేలా మరిన్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, నిర్ణీత సమయంలోగా ఉరిశిక్ష అమలుచేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ కుల, మత, ప్రాంతీయతలను దృష్టిలో పెట్టుకోకుండా దోషులను వేగంగా, కఠినంగా శిక్షించాలని సూచించారు. డీఎంకే ఎంపీ పీ విల్సన్ మాట్లాడుతూ లైంగిక దాడి కేసుల్లో దోషులను ఆపరేషన్ లేదా రసాయనిక చర్య ద్వారా నపుంసకులుగా మార్చేలా చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దోషులకు నిర్ణీత సమయంలోగా శిక్ష పడాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ సూచించారు. నిందితులకు మతం రంగు పులుమొద్దని కాంగ్రెస్ ఎంపీ అలీఖాన్ కోరారు. దిశ ఘటనలో నిందితులు భిన్న మతాలకు చెందినవారని గుర్తుచేశారు. నిందితులను బహిరంగంగా ఉరితీయాలని టీడీపీ ఎంపీ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు.

### వాళ్లను కొట్టి చంపాలి



'దిశ' ఘటనపై సమాజ్‌వాదీ ఎంపీ జయాబచ్చన్ ఉద్వేగంగా మాట్లాడారు. లైంగిక దాడుల దోషులను ప్రజల మధ్యకు తీసుకొచ్చి కొట్టి చంపాలని డిమాండ్ చేశారు. 'ప్రజలు ప్రశ్నించాల్సిన సమయం వచ్చింది. నిర్భయ, కతువా, ఇప్పుడు దిశ.. ఇలాంటి బాధితుల్లో ఎంతమందికి న్యాయం జరిగిందో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. లైంగికదాడి కేసుల్లో నిందితులను సమాజం ఛీకొట్టేలా.. వారి పేర్లను బహిర్గతం చేయాలి. రేపిస్టులను ప్రజలమధ్యకు ఈడ్చుకొచ్చి నడిరోడ్డుపై కొట్టిచంపాలి' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

**చట్టాలను పటిష్ఠం చేస్తాం**

లోక్‌సభలో జీరో అవర్‌లో 'దిశ' ఘటనపై చర్చ జరిగింది. ఈ ఘటనను సభ ముక్తకంఠంతో ఖండిస్తున్నదని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. యువ వైద్యురాలి దారుణ హత్య ఎంతో బాధ కలిగించిందన్నారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ 'దిశ' ఘటనపై స్పందించేందుకు తనకు మాటలు రావడం లేదన్నారు. నిర్భయ చట్టం తెచ్చిన తర్వాత కూడా ఇలాంటి దారుణాలు జరుగడం బాధాకరమన్నారు. ఇలాంటి నేరాల్లో దోషులను మరింత కఠినంగా శిక్షించేలా చట్టాలను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఘటనల్లో నిందితులకు వేగంగా, కఠినంగా శిక్ష పడేలా ఐపీసీ, సీఆర్‌పీసీ నిబంధనలను సవరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ మేరకు రాష్ట్రాలకు, పోలీస్ ఉన్నతాధికారులకు లేఖలు రాశామన్నారు. వివిధ రాజకీయ పార్టీల సలహాలు సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఇదో అమానవీయ ఘటన' అని పేర్కొన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో వేగంగా విచారణ జరిపి, దోషులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి నేరాల్లో దోషులకు అక్కడికక్కడే శిక్ష పడాలని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. డీఎంకే ఎంపీ టీఆర్ బాలు.. కోయంబత్తూర్‌లో ఇంటర్ విద్యార్థినిపై జరిగిన లైంగికదాడిని ప్రస్తావించారు. ఇలాంటి కేసుల్లో దోషులకు నిర్ణీత సమయంలో శిక్ష పడేలా చట్టం తీసుకురావాలన్నారు.



బెంగళూరులో మహిళల నిరసన

### దేశవ్యాప్తంగా నిరసనలు

'జస్టిస్ ఫర్ దిశ' నిరసనలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పలువురు విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పశ్చిమబెంగాల్‌లో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగాయి. హండ్రెడ్స్ ఆఫ్ ప్రెసిడెన్సీ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో కోల్‌కతాలో భారీ ర్యాలీ జరిగింది. మహిళలకు రక్షణ కల్పించాలంటూ వారు నినాదాలు చేశారు. జాదవ్‌పూర్ వర్సిటీ విద్యార్థులు దిశకు నివాళిగా మానవహారం ఏర్పాటు చేశారు. కోల్‌కతాలోని కాళీఘాట్, బెహలా తదితర ప్రాంతాలకు చెందిన దుర్గ పూజా కమిటీలు తమ ఫేస్‌బుక్ పేజీల్లో హెల్ప్‌లైన్ నంబర్లను పోస్ట్ చేశాయి. మహిళలు అత్యవసర సందర్భాల్లో సహాయం కోసం తమను సంప్రదించాలని కోరాయి. బీహార్, చండీగఢ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోనూ నిరసనలు చేపట్టారు.

### నేటి నుంచి నిరాహారదీక్ష

ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ప్రకటన



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న లైంగిక నేరాలకు నిరసనగా మంగళవారం నుంచి నిరవధిక నిరాహారదీక్ష చేపట్టనున్నట్టు ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ప్రకటించారు. నిందితులకు ఆరునెలల్లో మరణశిక్ష అమలు చేసేలా చట్టంలో మార్పులు చేసేవరకు దీక్ష విరమించబోనన్నారు. లైంగిక నేరాల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థతోపాటు పోలీస్ స్టేషన్లలో, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో వసతులు పెంచాలని డిమాండ్ చేశారు.

### మోదీ, స్మృతి మౌనమేల?: కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** దిశ ఘటనపై ప్రధాని మోదీ, కేంద్ర మహిళాశిశు సంక్షేమ శాఖమంత్రి స్మృతి ఇరానీ ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ విమర్శించింది. వారిద్దరూ వెంటనే స్పందించి, మహిళలపై నేరాల నిరోధానికి అత్యవసర కార్యాచరణ రూపొందించాలని ఆ పార్టీ ఎంపీ అమీ యాజ్ఞిక్ డిమాండ్ చేశారు. మరో ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ దేశంలో రోజూ 984 లైంగిక దాడి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. నిర్భయ చట్టం తర్వాత కూడా ఇలా ఎందుకు జరుగుతున్నదో తీవ్రంగా ఆలోచించాలన్నారు.



'దిశ'పై పాశవికంగా లైంగికదాడి జరిగింది. 'నిర్భయ'కు న్యాయం కోసం ఏడేండ్లుగా పోరాడుతున్నాం. మా బిడ్డలాగా కాకుండా 'దిశ'కు సత్వరం న్యాయం జరుగాలి. ఇలాంటి ఘటనలు ఎందుకు పునరావృతమవుతున్నాయో ప్రభుత్వాలు ఆలోచించాలి.

– ఆశాదేవి, నిర్భయ తల్లి

**లైంగికదాడి** కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసిన వెంటనే ప్రజల మధ్యలో వదిలేసేలా చట్టం తేవాలి. అప్పుడు ప్రజలే సరైన శిక్ష విధిస్తారు. నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలుచేయకుండా ఏడేండ్లుగా జైల్లో కూర్చోబెట్టారు. వారిని అప్పుడే శిక్షించి ఉంటే నేరగాళ్లకు భయం పట్టుకునేది.

– 'నిర్భయ' తాత

### టెన్త్‌క్లాస్ దళిత బాలికపై గ్యాంగ్‌రేప్

**లక్నో:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ' ఘటన మరువకముందే ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో జిల్లాలో అలాంటి దారుణమే మరొకటి చోటుచేసుకుంది. బహిర్భూమికి వెళ్లిన పదో తరగతి దళిత బాలికను నలుగురు యువకులు అపహరించి సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. జిల్లాలోని సద్‌పూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఆదివారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లగా.. అదే గ్రామానికి చెందిన నలుగురు యువకులు ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్లి సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు.. నలుగురు నిందితులను అంకిత్, ఘన్‌శ్యామ్, సురేశ్, పుష్పేంద్రగా గుర్తించి అరెస్టుచేశారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు. ప్రస్తుతం బాధిత బాలిక దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఇటీవలే ఇదేరాష్ట్రంలోని సంభల్ జిల్లాలో ఇలాంటి దారుణమే జరిగింది. ఓ వ్యక్తి 16 ఏండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడి కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన బాలిక 9 రోజులు మృత్యువుతో పోరాడి కన్నుమూసింది.

### బిడ్డపై కన్నతండ్రి లైంగికదాడి

**జైపూర్:** గొలుసులతో బంధించి కొన్నిరోజులుగా కన్నబిడ్డపై లైంగికదాడికి పాల్పడుతున్న ఓ దుర్మార్గుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వేరే మహిళతో ఏకాంతంగా ఉండటాన్ని 17 ఏండ్ల కూతురు చూసిందని అతడు ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ ఘటన రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తండ్రి నిత్యం పెట్టే వేధింపులు తాళలేక బాధితురాలి తల్లి ఏడేండ్ల క్రితం ఇల్లువదిలి వెళ్లిపోయింది. బాలిక మాత్రం తండ్రితోనే ఉంటున్నది. ఇటీవల వేరే మహిళతో ఏకాంతంగా తాను గడుపడాన్ని చూసిందని గమనించిన తండ్రి.. కుమార్తెను బంధించి కొన్ని రోజులుగా లైంగికదాడికి పాల్పడుతున్నాడు. ఆ రాక్షసుడి చెర నుంచి తప్పించుకొనివెళ్లి జరిగిన దారుణాన్ని తన మేనమామకు బాలిక తెలిపింది. బాలిక ఫిర్యాదు మేరకు తండ్రిని పోలీసులు అరెస్టుచేశారు.

# 40 వేల కోట్లకోసం.. ఫడ్నవీస్ నాటకం

- అందుకే మెజార్టీ లేకపోయినా సీఎంగా ప్రమాణం
- కేంద్ర మాజీ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే సంచలన వ్యాఖ్యలు
- అంతా వట్టిదేనంటూ కొట్టేసిన దేవేంద్ర ఫడ్నవీస్





**బెంగళూరు/నాగ్‌పూర్/ముంబై/ఢిల్లీ:** మహారాష్ట్రలో మరోసారి అధికారాన్ని చేపట్టేందుకు విఫలయత్నంచేసి చతికిలబడిన బీజేపీకి సొంత శిబిరం నుంచే షాక్ తగిలింది. ఆ రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైనంత మెజార్టీ బీజేపీకి లేకపోయినప్పటికీ రూ.40,000 కోట్ల కేంద్ర నిధులను 'కాపాడటం' కోసమే గతనెల 23న ఆదరాబాదరాగా ఫడ్నవీస్‌తో సీఎంగా ప్రమాణం చేయించారని బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే సంచలన ప్రకటన చేశారు. నవంబర్ 29న ఆయన కర్ణాటక ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కేంద్రం నుంచి వచ్చిన రూ.40,000 కోట్లు దుర్వినియోగం కాకూడదని ఫడ్నవీస్ భావించారు. రాష్ట్రంలో కాంగ్రెస్-శివసేన-ఎన్సీపీ కూటమి అధికారంలోకి వస్తే ఈ నిధులను దుర్వినియోగం చేస్తారని ఆయనకు తెలుసు. అందుకే ఫడ్నవీస్ నాటకమాడాలని నిశ్చయించుకొన్నారు. దీనిలో భాగంగానే ఆయన సీఎంగా ప్రమాణంచేశారు. ఆ తర్వాత 15 గంటల వ్యవధిలోనే ఆ నిధులను కేంద్రానికి తిప్పిపంపారు. ఈ పథక రచన ముందుగానే జరిగింది' అని హెగ్డే వెల్లడించారు.

**రూపాయి కూడా తిప్పి పంపలేదు: ఫడ్నవీస్**


హెగ్డే వ్యాఖ్యలను మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఖండించారు. హెగ్డే ప్రకటనలో వాస్తవం లేదన్నారు. 'హెగ్డే తప్పుడు వ్యాఖ్యలు చేశారు. వాటిని పూర్తిగా ఖండిస్తున్నా. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ సంస్థ మహారాష్ట్రలో బుల్లెట్ రైలు ప్రాజెక్టును అమలుచేస్తున్నది. ఈ ప్రాజెక్టులో మహారాష్ట్ర ప్రభుత్వ పాత్ర కేవలం భూసేకరణ వరకే పరిమితం. కేంద్రాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం నిధులు అడుగడంగానీ, ఆ నిధులను మళ్లీ కేంద్రానికి తిప్పిపంపడంగానీ జరుగలేదు. ఇతర ప్రాజెక్టు నుంచి కూడా కేంద్రానికి కనీసం ఒక్క రూపాయి తిప్పిపంపలేదు. నేను సీఎంగా ఉన్నప్పుడు లేదా ఆపద్ధర్మ సీఎంగా ఉన్నప్పుడు అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు' అని పేర్కొన్నారు.

**భగ్గుమన్న శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్**

ఫడ్నవీస్‌పై శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ ధ్వజమెత్తాయి. మహారాష్ట్రకు ఫడ్నవీస్ ద్రోహం చేశారని శివసేన విమర్శించగా.. హెగ్డే వ్యాఖ్యలు నిజమైతే ప్రధాని పదవికి మోదీ రాజీనామా చేయాలని ఎన్సీపీ డిమాండ్ చేసింది. మోదీ సర్కారు నిజస్వరూపాన్ని, మహారాష్ట్ర పట్ల బీజేపీ వ్యతిరేక ధోరణిని హెగ్డే బట్టబయలుచేశారని కాంగ్రెస్ పేర్కొన్నది.

# బాబ్రీ మసీదును పునర్నిర్మించాలి

- అప్పుడే సంపూర్ణ న్యాయం జరుగుతుంది
- అయోధ్యపై తీర్పును సమీక్షించాలి
- సుప్రీంకోర్టులో జమియత్ ఉలేమా హింద్ పిటిషన్


జమియత్ ఉలేమా ఏ హింద్ జాతీయ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ


**న్యూఢిల్లీ:** అయోధ్యలోని వివాదాస్పద భూమి విషయంలో ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. వివాదాస్పద స్థలంలో బాబ్రీ మసీదును పునర్నిర్మిస్తేనే 'సంపూర్ణ న్యాయం' జరుగుతుందని పిటిషనర్ పేర్కొన్నారు. అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని రామ మందిర నిర్మాణం కోసం అప్పగిస్తూ నాటి చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం గత నెల 9వ తేదీన తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. అలాగే అయోధ్యలోనే మసీదు నిర్మాణానికి సున్నీ వక్ఫ్ బోర్డుకు ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని న్యాయస్థానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఆ కేసులో ప్రధాన కక్షిదారుగా ఉన్న సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టు తీర్పుపై సమీక్ష కోరరాదని ఇప్పటికే నిర్ణయించింది. కాగా జమియత్ ఉలేమా హింద్ ఉత్తర్ ప్రదేశ్ శాఖ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అషద్ రషీదీ తీర్పును సమీక్షించాలని కోరుతూ తాజా పిటిషన్ దాఖలు చేశారు. మందిర నిర్మాణం కోసం మూడు నెలల్లోగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించాలని కూడా ఆయన కోరారు. మసీదు నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని కోర్టు తీర్పునిచ్చిందని, కానీ ముస్లిం కక్షిదారులు ఎన్నడూ అటువంటి విజ్ఞప్తిని చేయలేదని పిటిషనర్ గుర్తు చేశారు. మసీదును ధ్వంసం చేయడం సహా హిందూ కక్షిదారులు పలు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు ఒప్పుకున్న న్యాయస్థానం వారిని క్షమించడమే కాకుండా సదరు స్థలాన్ని కూడా వారికే మంజూరు చేసిందని తెలిపారు. కోర్టు తన తీర్పు ద్వారా బాబ్రీ మసీదును కూల్చి రాముని గుడి కట్టేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లుగా ఉన్నదని పేర్కొన్నారు. తాము తీర్పు మొత్తాన్ని సమీక్షించాలని కోరడం లేదని, కొన్ని లోపాలను మాత్రమే సమీక్షించాలని కోరుతున్నామన్నారు. 1934లో బాబ్రీ మసీదు గోపురాలను కూల్చడం దగ్గర నుంచి 1992లో మసీదును ధ్వంసం చేసే వరకు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారికి అనుకూలంగా ధర్మాసనం తీర్పు ఎలా వెలువరించిందన్నారు.

**మూకస్వామ్యానికి' చట్టబద్ధత కల్పించినట్లుంది**

జమియత్ ఉలేమా ఏ హింద్ జాతీయ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ ఢిల్లీలో మాట్లాడుతూ, అయోధ్యపై కోర్టు ఇచ్చిన తీర్పు 'మెజారిటీవాదానికి, మూకస్వామ్యానికి' చట్టబద్ధత కల్పించినట్లుందని వ్యాఖ్యానించారు. తమకు రాజ్యాంగం కల్పించిన హక్కు ఆధారంగానే కోర్టు తీర్పును సమీక్షించాలని పిటిషన్ వేశామని తెలిపారు.

# నిర్మల కాదు నిర్బల

- మోదీ, అమిత్ షా, అద్వానీ చొరబాటుదారులు
- కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి వివాదాస్పద వ్యాఖ్యలు
- క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై లోక్‌సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేంద్ర పన్నుల సవరణ చట్టంపై సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి బలహీనురాలిగా మారారంటూ విమర్శించారు. ఆమెను 'నిర్బల సీతారామన్' అని సంబోధించారు. దీంతో బీజేపీ సభ్యులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అధిర్ వ్యాఖ్యలకు ఆర్థిక మంత్రి ఘాటుగా సమాధానమిచ్చారు. 'నేను ఎప్పటికీ నిర్మలనే.. మోదీ ప్రభుత్వ హయాంలో ప్రతి మహిళ ఓ సబలే' అని వ్యాఖ్యానించారు. అధిర్ క్షమాపణలు చెప్పాలని ఆర్థిక శాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సూచించగా.. అధిర్ తిరస్కరించారు. 'మీకు ఇష్టమైతే తొలగించుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. అధిర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ చెప్పారు.


**ఆ ముగ్గురే చొరబాటుదారులు**

లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా అధిర్ రంజన్ చౌదరి లేచి ప్రశ్న అడుగుతుండగా బీజేపీ సభ్యులు 'చొరబాటుదారులు' అంటూ నినాదాలు చేశారు. దీనిపై అధిర్ స్పందిస్తూ.. 'అవును నేను చొరబాటుదారుడినే. ఓ చెదపురుగును కూడా. మోదీ, అమిత్ షా, అద్వానీ కూడా చొరబాటుదారులే' అని వ్యాఖ్యానించారు. దీంతో బీజేపీ సభ్యులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. తాను దేశమంతటా ఎన్నార్సీకి వ్యతిరేకం గానే ఈ వ్యాఖ్యలు చేశానని అధిర్ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయినా బీజేపీ సభ్యులు నిరసన కొనసాగించడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఓ సభలో అధిర్ మాట్లాడుతూ 'మోదీ, షా ఇండ్లు గుజరాత్‌లో ఉన్నాయి. వారు ఇప్పుడు ఢిల్లీలోకి చొరబడ్డారు' అని వ్యాఖ్యానించారు.

# దశాబ్దపు విశిష్టతగా 'అయోధ్య' తీర్పు

పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌గా ఆ కేసును విచారించిన న్యాయమూర్తులు

**న్యూఢిల్లీ:** అయోధ్య వివాదంపై అత్యున్నత న్యాయస్థానం వెల్లడించిన తీర్పు.. గత దశాబ్దంలో చోటుచేసుకున్న విశిష్ట ఘటనగా నిలిచింది. 'టాప్ ఇండియన్ ఈవెంట్స్ ఆఫ్ ది డికేడ్' పేరిట యాహూ ఇండియా వెలువరించిన జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇక ఆ తీర్పును వెల్లడించిన రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులు 'పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్'గా (ఈ యేటి మేటి వ్యక్తి) నిలిచారు. ఘటనల జాబితాలో ఆర్టికల్ 370 రద్దు అంశం రెండో స్థానాన్ని దక్కించుకుంది. లక్షితదాడులు, జీఎస్టీ అమలు, బీజేపీ ఎదుగుదల, ఆర్టికల్ 377, నిర్భయ లైంగికదాడి కేసు, మంగళయాన్ మిషన్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఇక ఎక్కువ మంది సెర్చ్ చేసిన వ్యక్తుల జాబితాలో ప్రధాని మోదీ అగ్రస్థానం దక్కించుకున్నారు. ఈ జాబితాలో క్రికెటర్ ఎంఎస్ ధోనీ, నటి ప్రియాంక చోప్రా, వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్, మాజీ ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తదితరులకు చోటు దక్కింది. రాజకీయ నేతల జాబితాలో మోదీనే తొలిస్థానంలో నిలువగా, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ.. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని వెనక్కి నెట్టి రెండో స్థానంలో నిలువడం విశేషం. పురుషులు, మహిళల సెలబ్రిటీల జాబితాలో సల్మాన్‌ఖాన్, సన్నీ లియోన్ అగ్రస్థానం దక్కించుకున్నారు.



జనగామ జిల్లా ఓబుల్‌కేశ్వాపూర్‌లోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామిని సోమవారం జర్మనీ దేశస్థులు దర్శించుకున్నారు. సర్పంచ్ రేణుక, ఎంపీటీసీ కొమ్ము సుజాత, ఆలయ నిర్వాహకులు బుర్రగీతతో కలిసి వారు ప్రత్యేక పూజలు చేశారు. పూజారిని అడిగి ఆలయ విశిష్టత తెలుసుకున్నారు. ఇక్కడి ఆహ్లాదకర వాతావరణం, ఆలయంలోని శిల్పకళను చూసి మంత్రముగ్ధులయ్యారు. -జనగామ రూరల్



వరంగల్ భద్రకాళి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణమహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి పంచామృతాలు, పుణ్యజలాలతో అభిషేకం నిర్వహించారు. ఆరు వేల మల్లెపూలతో అర్చన చేశారు. యాగం తరువాత స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, వేదపండితులు సోమసుందరయ్యతోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. -మట్టెవాడ(వరంగల్)



వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేకువజామునే ధర్మగుండంలో స్నానమాచరించి, కోడె మొక్కులు చెల్లించి స్వామివారిని దర్శించుకొన్నారు. దాదాపు 25 వేల మంది వేములవాడకు రాగా, రూ.19 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. -వేములవాడ కల్చరల్



# 13 జిల్లాల్లో అకాల వర్షం

- చాలాచోట్ల నేలకొరిగిన పంట
- అక్కడక్కడా తడిసిన ధాన్యం
- పెద్దపల్లి, భద్రాద్రి జిల్లాల్లో భారీగా నష్టం
- ఆందోళనలో రైతన్న
- అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 3 సెం.మీ. వర్షపాతం





పెద్దపల్లిలో తడిసిన పత్తి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాండురంగాపురంలో నీటమునిగిన వరి మెదళ్లను తీస్తున్న రైతు.. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సోమవారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. దాదాపు అన్నిచోట్ల కోతకు వచ్చిన పంట నేలకొరగా.. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దాదాపు ఏడు వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో 3 సెం.మీ., వర్షపాతం నమోదైంది. పెద్దపల్లి జిల్లా కేంద్రంతోపాటు సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ధర్మారం, పాలకుర్తి, అంతర్గాం, రామగుండం, మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో కోతకు వచ్చిన వరితోపాటు కల్లాల్లోని ధాన్యం, కొనుగోలు కేంద్రాలకు చేర్చిన ధాన్యం తడిసి ముద్దయింది. 30వేల ఎకరాల్లో వరి కోతలు చేపట్టాల్సి ఉండగా, పెద్ద మొత్తంలో పొలాల్లోనే పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోని ధాన్యం దాదాపు 12 వేల క్వింటాళ్లు తడిసినట్టు అధికారులు తెలిపారు. 28 వేల ఎకరాల పత్తి ఏరాల్సి ఉండగా వర్షానికి తడిసినట్టు అధికారులు పేర్కొన్నారు.

**భద్రాద్రి జిల్లాల్లో ఏడు వేల ఎకరాల్లో..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురిసిన వర్షానికి దాదాపు ఏడు వేల ఎకరాల్లో పంట నేల వాలింది. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం కూడా తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం నగర కేంద్రంతోపాటు సమీప మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. రెండువేల ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్టు సమాచారం. వరంగల్ రూరల్ జిల్లా పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో వర్షం కురవగా, కల్లాల్లోని ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల వరిపంట నేలవాలింది. ములుగు జిల్లాలో జల్లులు కురిశాయి. మహబూబాబాద్ జిల్లాలో కోతకు వచ్చిన వరితోపాటు కోసిన వరి మెదళ్లు, చేతికొచ్చిన పత్తి పంట తడిసింది.

**గణపురంలో భారీ వర్షం..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కురిసిన వర్షానికి పొలాల్లోని వరి పంట నేలవాలింది. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం కూడా అక్కడక్కడా తడిసింది. జిల్లా కేంద్రంలోని ఓసీపీ-2లో సోమవారం మూడు షిఫ్టుల్లో 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినట్టు అధికారులు ప్రకటించారు. అత్యధికంగా గణపురం మండలంలో 3 సెం.మీ., చిట్యాల మండలంలో 2.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం వర్షం పడింది. జిల్లా కేంద్రంలో 1.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మరికల్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాలో జల్లులు కురవగా, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసింది. సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్.ఎస్, తిరుమలగిరి, హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల్లో జల్లులు పడ్డాయి. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు 40,326 బస్తాల ధాన్యం రాగా అందులో కొంత మేర తడిసింది. వికారాబాద్ జిల్లాలో తేలికపాటి వర్షం కురిసింది.

## గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన

- రాగల 24గంటల్లో ఓ మోస్తరు నుంచి భారీగా..

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, తార్నాక, నేరెడ్‌మెట్, కాప్రా, దిల్‌సుఖ్‌నగర్, కర్మన్‌ఘాట్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. రాగల 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



మహబూబాబాద్‌లో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి సత్యవతిరాథోడ్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, హరిప్రియానాయక్

## ప్రతీ గ్రామం గంగదేవిపల్లిలా మారాలి

- మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రతీ గ్రామం గంగదేవిపల్లిలా మారేవిధంగా సర్పంచులు కృషి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియనాయక్‌తో కలిసి ఎర్రబెల్లి గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను పంపిణీ చేయడంతోపాటు పలు అభివృద్ధి కార్య క్రమాలను ప్రారంభించారు. రూ.4.20 కోట్ల తో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల భవనాన్ని ప్రారంభించారు. గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో రూ.25 లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ జిల్లాకు మెడికల్ కళాశాల తెచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు.

## ఇంటికే షాదీముబారక్ చెక్కులు

- లబ్ధిదారుల వద్దకు వెళ్లి చెక్కులు అందజేసిన మంత్రి పువ్వాడ అజయ్



ఖమ్మంలో లబ్ధిదారుకు షాదీముబారక్ చెక్కు అందజేస్తున్న మంత్రి అజయ్‌కుమార్

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** పేదింటి ఆడపిల్ల పెండ్లి ఆ కుటుంబానికి భారంగా మారకూడదన్న దృఢ సంకల్పంతోనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తున్నారని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో సోమవారం మేయర్ పాపాలాల్‌తో కలిసి మంత్రి బైక్‌పై ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు రూ.82.60 లక్షల విలువైన 82 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రికి మిఠాయిలు తినిపించి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



కరీంనగర్‌లో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను సహించం

- మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను సహించేది లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించారు. గత యాసంగిలో జరిగిన కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ఒక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామని, అందులో రైతుకు సంబంధించిన పూర్తి వివరాలుంటాయని తెలిపారు. దీనిద్వారా అక్రమాలను అరికట్టాలని సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

## కుమారుడితో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన స్థానికులు

**వరంగల్ సబర్బన్, నమస్తే తెలంగాణ:** కుటుంబ సమస్యలతో జీవితం మీద విరక్తి చెందిన ఓ మహిళ కుమారుడితో కలిసి కాకతీయ కాల్వలో దూకి ఆత్మహత్యకు యత్నిస్తుండగా, స్థానికులు అడ్డుకొన్నారు. ఈ ఘటన వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ సమీపంలో జరిగింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దన్‌సింగ్ దురువార్, శాంతాబాయి అనంతసాగర్‌లో నివసిస్తున్నారు. శాంతాబాయి కొద్దిరోజులుగా స్వగ్రామానికి వెళ్తానని భర్త ను కోరుతుండగా, తన వద్ద డబ్బులు లేవంటున్నాడు. సోమవారం ఇదే విషయంలో గొడవ జరగగా, మనస్తాపం చెందిన శాంతాబాయి చిన్న కుమారుడితో కలిసి కాల్వలో దూకేందుకు యత్నించింది. స్థానికులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. ఆదివారం రాత్రి బస్సు హైదరాబాద్ నుంచి 40 మందితో ఒంగోలుకు బయలుదేరింది. రాత్రి 1.30 సమయంలో ఇంజిన్ నుంచి పొగలు వస్తుండడంతో డ్రైవర్ బస్సును రోడ్డుపక్కకు నిలిపి ప్రయాణికులను కిందికి దింపాడు. ఒక్కసారిగా మంటలు లేచి బస్సు పూర్తిగా కాలిపోయింది. -నల్లగొండ రూరల్

## గద్వాలలో సీపీసీబీ బృందం పర్యటన

- భూగర్భ జలాల కలుషితంపై పరిశీలన
- 23 పత్తి విత్తన శుద్ధి మిల్లుల్లో తనిఖీలకు సన్నద్ధం



మట్టినమూనాలు సేకరిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

**జోగుళాంబగద్వాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పత్తి విత్తనశుద్ధి కర్మాగారాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు జోగుళాంబ గద్వాల జిల్లాలో పర్యటిస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో చెన్నై నుంచి జిల్లాకేంద్రానికి వచ్చిన రీజినల్ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్, బెంగుళూరు నుంచి బీఎంఈఈ పూర్ణిమ, సీపీసీబీ శాస్త్రవేత్త జ్ఞానవేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈఈ రాజేందర్ సోమవారం ఆర్డీవో రాములు ఆధ్వర్యంలో ఫిర్యాదుదారుతో సమావేశమయ్యారు. వారు అందించిన వివరాలు, ఫొటోలు, వీడియోలను వారు పరిశీలించారు. జిల్లాలోని 23 పత్తి మిల్లుల్లో సీపీసీబీ అధికారులు తనిఖీలు చేస్తారని ఆర్డీవో తెలిపారు. తొలిరోజు పలు జిన్నింగ్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టి మట్టి నమూనాలు సేకరించారు.

## లారీ కిందికి దూసుకెళ్లిన ఆటో

- ఇద్దరి మృతి

**తిమ్మాజిపేట :** రైలును అందుకోవాలన్న ఆతృత వారి ప్రాణాలమీదికి తెచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట సమీపంలో లారీని వెనక నుంచి ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 9 మందికి తీవ్రగాయాలయ్యాయి. తిమ్మాజిపేట మండలం చింతగట్టులో సోమవారం పెండ్లి విందు ముగించుకొని ఒకే కుటుంబానికి చెందిన 11మంది హైదరాబాద్‌కు వెళ్లేందుకు జడ్చర్లకు బయలుదేరారు. రైలును అందుకోవాలన్న తొందరలో తిమ్మాజిపేట వద్ద ముందు వెళ్తున్న లారీని ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో 11 మంది తీవ్రంగా గాయపడగా, క్షతగాత్రులను మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు. లలిత(17), లక్ష్మణ్(30) చికిత్స పొందుతూ దవాఖానలో మృతి చెందారు.

## గంజాయి పట్టివేత

**జమ్మికుంట రూరల్:** కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు ఆరు కిలోల గంజాయిని పట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన అంకటి శరత్, కొక్కుల సాయికుమార్ వ్యాపారంలో నష్టాలు రావడంతో, కరీంనగర్‌కు చెందిన రౌడీషీటర్ లవన్‌కుమార్‌తో కలిసి గంజాయి వ్యాపారాన్ని ప్రారంభించారు. జమ్మికుంట నుంచి రైలు ద్వారా మంచిర్యాల, కాగజ్‌నగర్‌కు గంజాయిని తరలిస్తున్నారు. సోమవారం జమ్మికుంట రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా, ఆరు కిలోల బరువున్న మూడు గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. నిందితులు శరత్, సాయికుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. లవణ్‌కుమార్ పరారీలో ఉన్నాడు.



లక్ష్మి పంప్‌హౌస్‌లో గోదావరి జలాలను ఎత్తిపోస్తున్న మోటర్లు

## కొనసాగుతున్న గోదావరి జలాల ఎత్తిపోత

**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి(కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో సోమవారం ఇంజినీర్లు ఐదు మోటర్లు నడిపించారు. 4, 5, 6, 8, 10వ నంబర్ల మోటర్ల ద్వారా సరస్వతి బరాజ్ (అన్నారం)కు 10,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మోటర్ల నుంచి వస్తున్న గోదావరి జలాలు గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలుతున్నాయి. బరాజ్‌లో 7.39 టీఎంసీల నిరు నిల్వ ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న స్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి

## తెలంగాణలో వేగంగా అభివృద్ధి

- స్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి

**గద్వాల, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ సారథ్యంలో దేశంలోనే అత్యంత వేగంగా తెలంగాణ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నదని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో హిందూ ధర్మ ప్రచారయాత్ర ముగిసిన సందర్భంగా సోమవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. కోటలోని శ్రీ భూలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

## ఏసీబీకి చిక్కిన మున్సిపల్ అధికారులు

రూ.5వేలు లంచం తీసుకుంటూ దొరికిన కమిషనర్, జూనియర్ అసిస్టెంట్



ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు

**నర్సంపేట,నమస్తేతెలంగాణ:** లంచం తీసుకుంటూ వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మున్సిపల్ కమిషనర్, జూనియర్ అసిస్టెంట్లు సోమవారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేటలోని నెహ్రూనగర్‌కు చెందిన అశోక్ బిల్డింగ్ వయస్సు నిర్ధారిత సర్టిఫికెట్ కోసం అక్టోబర్ 30న దరఖాస్తు చేశారు. సర్టిఫికెట్ ఇచ్చేందుకు కమిషనర్ వెంకటేశ్వర్‌రావు రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.5 వేలకు ఒప్పందం చేసుకొన్నారు. సర్టిఫికెట్ తీసుకెళ్లాలని అశోక్‌ను మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కోరాడు. సోమవారం అశోక్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావును కలువగా, డబ్బులు జూనియర్ అసిస్టెంట్‌కు ఇచ్చి సర్టిఫికెట్ తీసుకెళ్లాలని సూచించాడు. అశోక్ నుంచి జూనియర్ అసిస్టెంట్ కిరణ్ రూ.5వేలు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కమిషనర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

## పెళ్లింట భారీ చోరీ

- 42 తులాల బంగారు ఆభరణాలు
- 3 లక్షల నగదు అపహరణ

**నేరేడుచర్ల:** నూతన వధువు ఇంట్లో భారీ చోరీ జరిగిన ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో సోమవారం చోటుచేసుకున్నది. రూ.17 లక్షల విలువైన బంగారు నగలు, రూ.3 లక్షల నగదు దోచుకెళ్లినట్టు ఇంటి యజమాని రాచకొండ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల ఒకటిన రాత్రి హైదరా+బాద్‌లోని రామోజీ ఫిలింసిటీలో శ్రీనివాసరావు కుమార్తె వివాహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో తేదీ సాయంత్రం 5 గంటలకు నేరేడుచర్లలో ఇంటికి తాళం వేసి పెండ్లి కూతురితోపాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి హైదరాబాద్‌లోని వివాహ వేదిక వద్దకు వెళ్లారు. సోమవారం హైదరాబాద్‌లోని వియ్యంకుడి ఇంట్లో సత్యనారాయణ స్వామి వ్రతం ఉండటంతో కుటుంబ సభ్యులంతా అక్కడే ఉన్నారు. కాగా, ఒకటోతేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులను తొలగించి లోపలికి ప్రవేశించి అందినకాడికి దోచుకెళ్లారు. సోమవారం ఉదయం పాలు పోసేందుకు వచ్చిన సతీశ్ ఇంట్లో వారిని పిలిచాడు. కాలింగ్ బెల్ కొట్టినప్పటికీ ఎవరూ రాకపోవడం, తలుపు తీసి ఉండటంతో ఆ ఇంటి యజమానికి ఫోన్ చేశాడు. ఇంట్లో పాలు పెట్టి పోతున్నానని చెప్పాడు. 'మేము ఇంట్లో లేము. నువ్వు పాలు ఎలా పెట్టావు' అని శ్రీనివాస్‌రావు ప్రశ్నించగా, తలుపు తీసి ఉన్నదని సతీష్ చెప్పడంతో ఆందోళన చెంది వెంటనే బంధువులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. నేరేడుచర్ల ఎస్సై యాదవేంద్రరెడ్డి క్లూస్‌టీమ్‌తో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 42 తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు పోయినట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చలికాలం

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| మహబూబాబాద్ | 15.0 | 28.0 |
| వరంగల్ రూరల్ | 17.0 | 25.0 |
| నిర్మల్ | 17.0 | 27.0 |
| కామారెడ్డి | 17.0 | 29.0 |
| ఆదిలాబాద్ | 17.8 | 30.5 |
| యాదాద్రి భువనగిరి | 18.0 | 26.0 |
| రంగారెడ్డి | 18.0 | 27.0 |
| వికారాబాద్ | 18.6 | 32.8 |
| సిద్దిపేట | 19.0 | 24.0 |
| నల్లగొండ | 19.0 | 27.4 |
| వనపర్తి | 19.0 | 27.6 |
| మెదక్ | 19.1 | 33.6 |
| సంగారెడ్డి | 19.3 | 26.6 |
| రాజన్న సిరిసిల్ల | 20.0 | 26.0 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 20.0 | 30.0 |
| జనగామ | 20.1 | 26.0 |
| ములుగు | 21.0 | 25.0 |
| జయశంకర్ భూపాలపల్లి | 21.0 | 25.0 |
| భద్రాద్రి కొత్తగూడెం | 21.0 | 26.0 |
| నాగర్‌కర్నూల్ | 21.0 | 26.1 |
| జోగుళాంబ గద్వాల | 21.0 | 27.0 |
| జగిత్యాల | 21.0 | 28.0 |
| సూర్యాపేట | 21.0 | 28.0 |
| మంచిర్యాల | 21.1 | 33.3 |
| కరీంనగర్ | 21.2 | 30.9 |
| హైదరాబాద్ | 21.7 | 26.8 |
| మేడ్చల్ | 21.7 | 26.8 |
| పెద్దపల్లి | 22.0 | 26.0 |
| మహబూబ్‌నగర్ | 22.0 | 26.4 |
| నారాయణపేట | 22.0 | 26.4 |
| వరంగల్ అర్బన్ | 22.0 | 26.5 |
| ఖమ్మం | 22.0 | 27.0 |
| నిజామాబాద్ | 23.0 | 32.3 |



సోమవారం హైదరాబాద్‌లో స్విమ్మర్ గోలి శ్యామలను అభినందిస్తున్న రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్

## గోలి శ్యామలకు మంత్రి అభినందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** ఇటీవల పాట్నాలో జరిగిన 12వ జాతీయ తక్షశిల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో 13కి.మీలు ఈదిన తొలి తెలుగు మహిళ గోలి శ్యామలను రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సోమవారం అభినందించారు. గత నెల గోవాలో జరిగిన జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో శ్యామల రెండో స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఆగస్టులో దక్షిణకొరియాలో జరిగిన వరల్డ్ మాస్టర్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన తొలి తెలుగు మహిళగా 47 ఏండ్ల శ్యామల రికార్డుల్లోకెక్కింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. గచ్చిబౌలీ స్టేడియంలో శ్యామల శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రామసేతును ఈది బుల చౌదరి వలే తెలంగాణకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, జూపల్లి భాస్కర్ రావు పాల్గొన్నారు.

కొత్త తరం

## నా స్థానాన్ని భర్తీ చేయాలి: పేస్

**న్యూఢిల్లీ:** భారత వెటరన్ టెన్నిస్ ప్లేయర్ లియాండర్ పేస్ కెరీర్‌కు వీడ్కోలు పలికే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. తాజాగా పాకిస్థాన్‌తో జరిగిన డేవిస్ కప్ టోర్నీలో భారత్‌ను విజేతగా నిలిపిన పేస్ సోమవారం మీడియాతో మాట్లాడాడు. 'ఇన్నేండ్ల అనుభవం నా కెరీర్‌ను నడిపించింది. డేవిస్‌కప్‌లో 30 ఏండ్లు అద్భుతంగా సాగింది. ఇక మరింత కాలం ఆడాలనుకోవడం లేదు. ఇప్పటికే దేశం తరపున చాలా టోర్నీల్లో ఆడాను. నాలుగు పదుల వయస్సులో ఉన్న నా స్థానాన్ని కొత్త తరం భర్తీ చేయాలి' అని పేస్ అన్నాడు.

# యువ భారత సైన్యమిదే..

## అండర్-19 ప్రపంచకప్‌నకు జట్టు ప్రకటన

### కెప్టెన్‌గా ప్రియం గార్గ్.. తెలంగాణ ఆటగాడు తిలక్‌వర్మకు చోటు



తిలక్ వర్మ

**ముంబై:** వచ్చే ఏడాది జరుగనున్న అండర్-19 ప్రపంచకప్ కోసం ఆలిండియా జూనియర్ సెలెక్షన్ కమిటీ సోమవారం 15 మందితో కూడిన యువ భారత జట్టును ఎంపిక చేసింది. దీనికి ఉత్తర్‌ప్రదేశ్ యువ సంచలనం ప్రియం గార్గ్ సారథ్యం వహించనుండగా.. తెలంగాణ బ్యాట్స్‌మన్ ఠాకూర్ తిలక్ వర్మ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2020 జనవరి 17 నుంచి ఫిబ్రవరి 9 వరకు దక్షిణాఫ్రికా వేదికగా జరుగనున్న ఈ టోర్నీలో భారత్.. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలో దిగనుంది. ప్రపంచకప్‌నకు ముందు దక్షిణాఫ్రికా అండర్-19 జట్టుతో యువ భారత్ తలపడనుంది. సఫారీలతో 3 వన్డేల సిరీస్‌తో పాటు నాలుగు దేశాల వన్డే టోర్నీ కోసం ముందుగానే దక్షిణాఫ్రికాకు పయనమవనుంది. ప్రొటీస్‌తో సిరీస్‌కు ఈ 15 మందితో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో ఆటగాడు రక్షణ్ కూడా ఎంపికయ్యాడు. మెగా టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొననున్నాయి. ఒక్కో గ్రూపులో నాలుగేసి జట్ల చొప్పున మొత్తం 4 గ్రూపులు



ప్రియం గార్గ్

ఉంటాయి. క్వాలిఫయర్ జపాన్, న్యూజిలాండ్, శ్రీలంకతో కలిసి యువ భారత జట్టు గ్రూప్-ఏలో ఉంది. ఇప్పటివరకు 12 సార్లు అండర్-19 ప్రపంచకప్ జరుగగా.. అందులో భారత్ నాలుగు టైటిల్స్ పట్టింది. మహమ్మద్ కైఫ్ (2000), విరాట్ కోహ్లీ (2008), ఉన్ముక్త్ చంద్ (2012), పృథ్వీ షా (2018) దేశానికి ప్రపంచకప్ ట్రోఫీలు అందించారు.

**భిన్న నేపథ్యాల నుంచి..**

ఒకరు పానీపూరి అమ్ముకుంటూ ఇక్కడి వరకు వస్తే.. మరొకరు కన్నతల్లి కలలను నిజం చేస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ప్రస్తుతం యువ జట్టులో ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. అందులో ముఖ్యంగా యశస్వి జైస్వాల్ గురించి చెప్పుకోవాల్సిందే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 17 ఏండ్ల యశస్వి క్రికెట్‌పై ఉన్న మక్కువతో ఇళ్లు వదిలి ముంబై చేరాడు. కడుపు నింపుకునేందుకు పానీపూరిలు అమ్ముకున్న ఈ చిన్నోడు.. బ్యాట్‌పడితే బౌండ్రీలే హద్దుగా చెలరేగిపోతున్నాడు. మ్యాచ్ ఏదైనా బ్యాట్‌తో అదరగొట్టడమే పనిగా పెట్టుకున్న యశస్వి.. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై తరపున డబుల్ సెంచరీ చేయడం ద్వారా లిస్ట్-ఏ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డుల్లోకెక్కాడు. ఇప్పుడతడికి ప్రపంచకప్ రూపంలో మరో చక్కటి అవకాశం దక్కింది. జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన ప్రియం గార్గ్ ఈ ఏడాది రంజీల్లో దాదాపు 65 సగటుతో 814 పరుగులు చేశాడు. 18 ఏండ్ల అధర్వ అంకొలేకర్‌ది మరో కథ. పదేండ్ల వయసులోనే తండ్రి చనిపోతే.. తల్లి సంకల్పమే అతడిని ఈ స్థాయికి చేర్చింది. తండ్రి నిర్వర్తించిన బస్సు కండక్టర్ ఉద్యోగాన్ని కొనసాగించిన తల్లి.. అన్నీ తానై కొడుకును ముందుకు నడిపించింది. జన్మనిచ్చిన తల్లి కలలను నిజం చేయాలని కృతనిశ్చయంతో ఉన్న ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్.. మెగాటోర్నీ వేదికగా చెలరేగిపోవాలని ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు. కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన యుద్ధ వీరుడి కుమారుడు ధ్రువ్ జొరెల్ యువ జట్టుకు వికెట్ కీపర్‌గా వ్యవహరించనున్నాడు.

**భారత అండర్-19 జట్టు:** ప్రియం గార్గ్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఠాకూర్ తిలక్ వర్మ, దివ్యాన్ష్ సక్సేనా, ధ్రువ్ చంద్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), శషావత్ రావత్, దివ్యాన్ష్ జోషి, శుభంగ్ హెగ్డే, రవి బిష్ణోయ్, ఆకాశ్ సింగ్, కార్తీక్ త్యాగి, అథర్వ అంకొలేకర్, కుమార్ కుషాగ్ర (వికెట్ కీపర్), సుశాంత్ మిశ్రా, విద్యాధర్ పాటిల్.



తిలక్‌కు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే పిచ్చి. అతడి పట్టుదల చూస్తే ముచ్చటేస్తుంది. కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ మంచి బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు సాధించాడు. తాజాగా అండర్-19 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికవడం మా ఆనందాన్ని రెట్టింపు చేసింది.

- నంబూరి నాగరాజు, తిలక్ వర్మ తండ్రి

## ఈరోజు కోసమే..

**దక్షిణాఫ్రికా వేదికగా వచ్చే ఏడాది జరిగే అండర్-19 ప్రపంచకప్‌నకు ఎంపిక కావడమే నా ముందున్న లక్ష్యం అని ఈ ఏడాది ఆరంభంలోనే స్పష్టం చేసిన తిలక్ వర్మ ఇప్పుడా చాన్స్ దక్కించుకున్నాడు. టీమ్ఇండియాకు సెలెక్ట్ కావాలంటే.. అండర్-19, అండర్-23, రంజీ, ఐపీఎల్ ఇలా అనేక మార్గాలున్నా.. కుర్రాళ్ల ప్రపంచకప్‌లో మెరిస్తే.. అవకాశం దానంతటదే వస్తుందని అతడి నమ్మకం. ఆ లీగ్, ఈ లీగ్ అని కాకుండా ఆడిన మ్యాచ్‌లన్నింటిలోనూ తనను తాను నిరూపించుకున్న ఈ యువ సంచలనం 2020 అండర్-19 ప్రపంచకప్‌నకు ఎంపికయ్యాడు. సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడగల సత్తా, గంటల తరబడి క్రీజులో పాతుకుపోయే సామర్థ్యం, వయసుకు మించిన పరిణతి, క్రికెట్ పుస్తకాల్లోని ప్రతీ షాట్ ఆడగల నేర్పు వెరసి తిలక్‌ను మంచి బ్యాట్స్‌మన్‌గా తీర్చిదిద్దాయి. అండర్-19 స్థాయిలో ఇప్పటికే తన సత్తా ఏంటో చాటిన ఠాకూర్.. ఇక మెగాటోర్నీలో మెరువాలని ఆశిద్దాం.**

**నమస్తే తెలంగాణ క్రీడాప్రతినిధి**

సీకే నాయుడు, శివలాల్ యాదవ్, ఎంఎల్ జయసింహ, అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, అంబటి రాయుడు.. ఇలా ఎందరో గొప్ప బ్యాట్స్‌మెన్‌ను జాతీయ జట్టుకు అందించిన హైదరాబాద్ గడ్డ ఇప్పుడు మరో ఆణిముత్యాన్ని తీర్చిదిద్దింది. ప్రస్తుతానికి అండర్-19 జట్టుకే ఎంపికైనా.. సీనియర్ జట్టు తరపున సత్తాచాటగల అన్ని లక్షణాలున్న ఆ యువ సంచలనం పేరే నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ. మెదక్ జిల్లాకు చెందిన నంబూరి నాగరాజు, గాయత్రి దేవిల సంతానమైన తిలక్‌కు చిన్నతనం నుంచి క్రికెటంటే ప్రాణం. ఆ జిజ్ఞాసను పసిగట్టిన తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించడంతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చిన అతడు ఇటీవలి కాలంలో అండర్-19 స్థాయిలో దుమ్మురేపుతున్నాడు. దేవధర్ ట్రోఫీ, విజయ్ హజారే, రంజీ ఇలా జట్టు ఏదైనా.. తనదైన శైలిలో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే భారత అండర్-19 జట్టు తరపున అంతర్జాతీయ స్థాయిలో శతకాలతో మెరిసిన తిలక్ వర్మ.. అవసరమైతే బంతితోనూ అదరగొట్టగలడు. టాపార్డర్‌లో బ్యాటింగ్ చేసేందుకు ఇష్టపడే తిలక్.. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని టీమ్ఇండియాకు ఎంపికవడమే తన లక్ష్యమంటున్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్సీఏ)లో ఉన్న తిలక్ వర్మ అండర్-19 ప్రపంచకప్ జట్టుకు ఎంపికవడం చాలా ఆనందంగా ఉందంటున్నాడు. ప్రపంచకప్‌లో సత్తాచాటేందుకు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నాడు.

# పతకాల పంట

### భారత్‌కు ఒకే రోజు 16పతకాలు.. దక్షిణాసియా గేమ్స్



**కఠ్మాండు (నేపాల్) :** దక్షిణాసియా గేమ్స్ (ఎస్ఏజీ)లో భారత ప్లేయర్లు సత్తాచాటారు. సోమవారం ఒక్క రోజే మొత్తం 16 పతకాలు (5 స్వర్ణాలు, 8రజతాలు, 3 కాంస్యాలు) కైవసం చేసుకొని అదరగొట్టారు. తైక్వాండోలో పది, ట్రైయథ్లాన్‌లో నాలుగు, బ్యాడ్మింటన్‌లో రెండు పతకాలు దక్కాయి. భారత పురుషుల, మహిళల బ్యాడ్మింటన్ జట్లు ఫైనల్లో శ్రీలంక జట్లను చిత్తుచేసి స్వర్ణ పతకాలు సాధించాయి. పురుషుల జట్టు 3-1తో లంక జట్టును మట్టికరిపిస్తే.. మహిళల టీమ్ 3-0తో అజేయంగా అగ్రస్థానంలో నిలిచింది. పురుషుల తుదిపోరులో తొలుత బరిలోకి దిగిన స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ 17-21, 21-15, 21-11తో దినుక కరుణరత్నెపై గెలిచాడు. సిరిల్ వర్మ 21-17, 11-5తో ముందంజలో ఉన్న సమయంలో ప్రత్యర్థి సచిన్ దియాస్ వైదొలగడంతో భారత్ 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత అరుణ్ జార్జ్ - సాన్యం శుక్లా జోడీ లంక ద్వయం చేతిలో ఓడింది. అనంతరం గారగ కృష్ణ ప్రసాద్ - ధ్రువ్ కపిల జోడీ 21-14, 21-18తో లంక ద్వయం కరుణరత్నె - హసిత చనకపై గెలువడంతో ఫైనల్లో 3-1తో భారత్ విజయం సాధించింది. అంతకు ముందు సెమీస్‌లో భారత్ 3-0తో పాకిస్థాన్‌ను చిత్తుచేసింది. మహిళల సెమీస్‌లో 3-0తో పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత ప్లేయర్లు సాయి ఉత్తేజిత రావు, గాయత్రి గోపీచంద్, సిక్కిరెడ్డి - జక్కంపూడి మేఘన... ఫైనల్లోనూ శ్రీలంకను 3-0తోనే చిత్తుచేశారు. బ్యాడ్మింటన్ వ్యక్తిగత విభాగం పోటీలు మంగళవారం నుంచి జరుగనున్నాయి.

**తైక్వాండోలో పది పతకాలు**

తైక్వాండో పోటీల్లో భారత అథ్లెట్లు అదరగొట్టారు. రెండు స్వర్ణాలు సహా మొత్తం పది పతకాలు కైవసం చేసుకొని అదరగొట్టారు. డేనియల్ లాల్‌హుంతాంగ, లాలాఫక్జువాలా, లాల్‌త్లమునాపుయాతో కూడిన భారత త్రయం తొలుత పురుషుల టీమ్ పూమ్‌సే విభాగంలో పసిడి పతకాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత గౌరవ్ సింగ్, హర్ష సింఘా ద్వయం పూమ్‌సే విభాగంలో స్వర్ణాన్ని చేజిక్కించుకుంది. దీంతోపాటు పురుషుల, మహిళల టీమ్, వ్యక్తిగత విభాగాల్లో భారత అథ్లెట్లు ఆరు రజతాలు, రెండు కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. ట్రయథ్లాన్ పోటీల్లో భారత అథ్లెట్లు ఓ స్వర్ణం సహా రెండు రజతాలు, ఓ కాంస్యాన్ని చేజిక్కించుకున్నారు. ఆదర్శ ఎంఎస్ సినిమోల్ పురుషుల వ్యక్తిగత ట్రయథ్లాన్ విభాగంలో స్వర్ణ పతకం సాధించగా.. ఇదే పోటీలో బిస్వర్జిత్ శ్రీకోమ్ రజతాన్ని కైవసం చేసుకున్నాడు. ఆదర్శ మూడు పోటీలను గంటా 2నిమిషాల 51సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలువగా, బిశ్వర్‌జిత్ (1:02:59) కాస్త వెనుకబడ్డాడు. మహిళల వ్యక్తిగత విభాగంలో తౌదమ్ సరోజినీ దేవి (1:14:00) రజతం, మోహన్ ప్రజ్ఞా (1:14:57) కాంస్య పతకాలను సాధించారు.

### సెమీస్‌లో ఖో-ఖో జట్టు

రెండు విజయాలతో అదరగొట్టి భారత పురుషుల ఖో-ఖో జట్టు సెమీఫైనల్‌కు చేరింది. తొలుత నేపాల్‌ను ఇన్నింగ్స్ 12పాయింట్ల(17-5) తేడాతో మట్టికరిపించిన భారత్... ఆ తర్వాత బంగ్లాదేశ్‌ను ఇన్నింగ్స్ రెండు పాయింట్ల(12-10)తో ఓడించింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన మన జట్టు... చిట్టచివరన ఉన్న శ్రీలంకతో సెమీస్‌ను మంగవారం తలపడనుంది.

## ఒక్క పరుగివ్వకుండానే ఆరువికెట్లు

### నేపాల్ క్రికెటర్ సంచలన రికార్డు



అంజలి 6/0

**కఠ్మాండు (నేపాల్ ):** నేపాల్ మహిళా బౌలర్ అంజలీ చందా మహిళల అంతర్జాతీయ టీ20ల్లో కొత్త చరిత్ర సృష్టించింది. 13వ దక్షిణాసియా గేమ్స్‌లో భాగంగా మాల్దీవులతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో అంజలీ ఒక్కపరుగు కూడా ఇవ్వకుండా ఆరు వికెట్లు తీసింది. ఈ ఘనత సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డును తన పేరిట లిఖించుకుంది. దీంతో నేపాల్ 5 బంతుల్లోనే 10 వికెట్ల తేడాతో 17 పరుగులు చేసి గెలుపొందింది. అంజలీ నిప్పులు చెరిగి పరుగులేమీ ఇవ్వకుండా ఆరుగురిని పెవిలియన్ చేర్చడంతో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మాల్దీవులు జట్టు 10.1 ఓవర్ల ఆడి 16 పరుగులే చేయగలిగింది. ఎనిమిది మంది పరుగుల ఖాతా కూడా తెరువలేకపోయారు. స్వల్ప లక్ష్యాన్ని నేపాల్ ఐదు బంతుల్లోనే సాధించింది. ఐదు బంతుల్లోనూ మాల్దీవుల బౌలర్ ఐదు ఎక్స్‌ట్రాలు సమర్పించుకుంది. అంతకు ముందు మహిళా క్రికెట్‌లో మలేసియా క్రీడాకారిణి మాస్ ఎలీసా (6/3) పేరిట అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన రికార్డు ఉండేది.


## ఒక్కటైన మనీశ్, అశ్రిత



**ముంబై:** టీమ్ఇండియా క్రికెటర్, ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ ఆటగాడు మనీశ్ పాండే పెండ్లి ముంబైలో సోమవారం ఘనంగా జరిగింది. నటి అశ్రితా శెట్టిని అతడు పెండ్లాడాడు. ట్విట్టర్ వేదికగా క్రికెటర్లు, ప్రముఖులు మనీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వివాహానికి కొద్ది గంటల ముందు సూరత్‌లో ఆదివారం జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20టోర్నీ ఫైనల్లో కెప్టెన్ మనీశ్ (65) అద్భుత ఇన్నింగ్స్‌తో కర్నాటకను విజేతగా నిలిపిన సంగతి తెలిసిందే.

## రూట్ డబుల్ ధమాకా

**హామిల్టన్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో కెప్టెన్ జో రూట్ (441 బంతుల్లో 226; 22 ఫోర్లు, 1 సిక్స్) డబుల్ సెంచరీతో చెలరేగడంతో.. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 476 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 269/5తో నాలుగోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లిష్ జట్టును సారథి ముందుండి నడిపించాడు. అతడికి యువ ఆటగాడు ఓటీ పోప్ (202 బంతుల్లో 75; 6 ఫోర్లు) చక్కటి సహకారం అందించాడు. జట్టు స్కోరు 24/2తో ఉన్న సమయంలో క్రీజులో అడుగుపెట్టిన రూట్ 11 గంటలకు పైగా క్రీజులో నిలిచి 458 పరుగుల వద్ద పెవిలియన్ చేరడం విశేషం. రూట్ మారథాన్ ఇన్నింగ్స్‌కు పోప్ సంయమనం తోడవడంతో.. ఇంగ్లండ్‌కు 101 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. కివీస్ బౌలర్లలో వాగ్నర్‌కు 5 వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ సోమవారం ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. ప్రస్తుతం కెప్టెన్ విలియమ్సన్ (37), టేలర్ (31) క్రీజులో ఉన్నారు. మంగళవారం ఆటకు ఆఖరిరోజు.



రూట్ (226)

## ఆసీస్ ఆటకట్టించే సత్తా భారత్‌కే

**లండన్ :** ఆస్ట్రేలియాను వారిగడ్డపైనే మట్టికరిపించే సత్తా ప్రస్తుతం కోహ్లీ సారథ్యంలోని టీమ్ఇండియాకే ఉందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ అన్నాడు. అందుకు భారత్ వద్ద కావాల్సిన వనరులు ఉన్నాయని అభిప్రాయపడ్డాడు. సొంతగడ్డపై పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-0తో క్లీన్‌స్వీప్ చేసిం ది. అనంతరం వాన్ ట్వీట్ చేశాడు.

### ఐఎస్‌ఎల్‌లో మరో 'డ్రా'

**జంషెడ్‌పూర్:** చివరి క్షణాల్లో గోల్ నమోదు కావడంతో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో మరో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. సోమవారం నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ, జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ జట్ల మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్ చివరకు 1-1తో సమమైంది.

## సిరీస్ ఆసీస్‌దే

### పింక్ టెస్టులో ఇన్నింగ్స్ 48 పరుగులతో పాక్ చిత్తు

**అడిలైడ్:** బ్యాట్స్‌మెన్ కనీస ప్రతిఘటన చూపకపోవడంతో ఆస్ట్రేలియాతో జరిగిన డే అండ్ నైట్ టెస్టులో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 48 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఫలితంగా రెండు టెస్టుల సిరీస్‌ను ఆసీస్ 2-0తో చేజిక్కించుకుంది. పింక్ బాల్ టెస్టుల్లో ఆసీస్‌కు ఇది ఆరో విజయం కాగా.. అందులో నాలుగింటికి అడిలైడ్ వేదిక కావడం విశేషం. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఆసీస్ 120 పాయింట్లు చేజిక్కించుకొని మొత్తం 176 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరింది. టీమ్ఇండియా (360) టాప్‌లో ఉంది. రెండు టెస్టులు ఆడిన పాకిస్థాన్ ఇంకా ఖాతా తెరువలేదు. ఓవర్‌నైట్ స్కోరు 39/3తో సోమవారం ఫాలోఆన్ కొనసాగించిన పాక్.. చివరకు 239 పరుగులకు ఆలౌటైంది. కంగారూ బౌలర్లు లియాన్ (5/69), హజిల్‌వుడ్ (3/63) ధాటికి మసూద్ (68), అసద్ షఫీక్ (57), రిజ్వాన్ (45) మినహా మిగిలినవారు చేతులెత్తేశారు. ట్రిపుల్ సెంచరీ హీరో డేవిడ్ వార్నర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.





బ్రిటిష్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో 17 పతకాలతో మెరిసిన రాష్ట్ర క్రీడాకారులను హైదరాబాద్‌లో సోమవారం అభినందిస్తున్న క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తైక్వాండో గ్రాండ్‌మాస్టర్ జయంత్ రెడ్డి, తదితరులు


## డోప్ టెస్టులో నీరజ్ విఫలం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టోర్నీల్లో ఇటీవల సత్తాచాటుతూ.. 2020 టోక్యో ఒలింపిక్స్ ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకున్న భారత మహిళా బాక్సర్ నీరజ్ (57కేజీలు) డోప్ టెస్టులో విఫలమైంది. ఆమె నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్టు జాతీయ మాదక ద్రవ్య నిరోధక ఏజెన్సీ (నాడా) వెల్లడించింది. దీంతో నీరజ్‌పై తాత్కాలిక నిషేధం వేటు పడింది. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నీలో కాంస్య పతకం దక్కించుకున్న నీరజ్.. రష్యాలో జరిగిన ఓ టోర్నీలో స్వర్ణాన్ని గెలుచుకుంది. ఆమె నుంచి సెప్టెంబర్ 24న సేకరించిన శాంపిల్స్‌ను పరీక్షించగా.. నిషిద్ధ ఉత్ప్రేరకాలు లిగాన్‌డ్రోల్‌తో పాటు మరిన్ని అనాబోలిక్ స్టెరాయిడ్స్ తీసుకున్నట్టు వెల్లడైందని నాడా ప్రకటించింది. ఈ సమాచారం తమకు వారం క్రితమే తెలిసిందని, ప్రస్తుత చర్యగా జాతీయ క్యాంపు నుంచి నీరజ్‌ను పంపించి వేశామని భారత బాక్సింగ్ సమాఖ్య తెలిపింది.



## వేలానికి మ్యాక్స్‌వెల్, లిన్

### స్టార్క్, రూట్ దూరం



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా స్పీడ్‌గన్ మిచెల్ స్టార్క్ వచ్చే సీజన్ ఐపీఎల్ కోసం జరిగే వేలం నుంచి వైదొలిగాడు. కాగా ఆసీస్ స్టార్లు గ్లెన్ మ్యాక్స్‌వెల్, క్రిస్ లిన్ సహా మొత్తం 971 మంది ప్లేయర్లు కోల్‌కతాలో ఈనెల 19న జరిగే వేలంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 713 మంది భారత, 258 విదేశీ ఆటగాళ్లు వేలానికి రానున్నారు. వీరిలో 215కి అంతర్జాతీయ అనుభవం ఉండగా.. 754 మంది అన్‌క్యాప్‌డ్ ప్లేయర్స్, ఇద్దరు అసోసియేట్ దేశాలకు చెందిన వారు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ విజేత ఖమ్మం



**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలుర క్రికెట్ టోర్నీలో ఖమ్మం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి జట్టు 12 ఓవర్లలో 6 వికెట్లకు 68 పరుగులు చేసింది. ఈ సమయంలో వర్షం కారణంగా మ్యాచ్ అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో టోర్నీలో ఓవరాల్ రన్‌రేట్ ఆధారంగా నిర్వాహకులు ఖమ్మం జట్టును విజేతగా ప్రకటించారు. అంతకుముందు జరిగిన వేర్వేరు సెమీఫైనల్లో నల్లగొండ, హైదరాబాద్ పరాజయం పాలయ్యాయి. విజేతలకు టోర్నీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 40,802 | 12,048 |
| ↗ 8 | ↘ 8 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 60.90 డాలర్లు

## క్రెడిట్ కార్డు చెల్లింపులు ఉచితం

ప్రీమియం పేమెంట్లపై ఎల్ఐసీ ప్రకటన

**ముంబై, డిసెంబర్ 2:** డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. క్రెడిట్ కార్డు ద్వారా జరిపే ప్రీమియం చెల్లింపులపై విధించనున్న చార్జీలను ఈ నెల 1 నుంచి పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు సోమవారం సంస్థ ప్రకటించింది. దీంతో క్రెడిట్ కార్డు ద్వారా రెన్యూవల్ ప్రీమియం, నూతన ప్రీమియం లేదా రుణాల చెల్లింపులు, పాలసీలపై తీసుకున్న రుణాలపై వడ్డీ చెల్లింపులపై అదనపు రుసుంను వసూలు చేయరు. కంపెనీ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇక క్రెడిట్ కార్డు ద్వారా ఆర్థిక లావాదేవీలను ఉచితంగా జరుపుకోవచ్చును. వీటితో పాటు కార్డు రహిత చెల్లింపులు, పాయింట్ ఆఫ్ సేల్ మెషిన్ల వద్ద కార్డు డిప్/స్వైప్ ద్వారా జరిపే లావాదేవీలపై ఎలాంటి అదనపు భారం పడదని ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే వినియోగదారుడు మైఎల్ఐసీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రీమియం చెల్లింపులు జరుపుకోవచ్చునని సూచించింది.

# బాదుడు మొదలైంది

### అందరికీ అన్‌లిమిటెడ్ ఫ్రీ కాల్స్ ఉండవు

### అమల్లోకి వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ కొత్త టారీఫ్‌లు

వినియోగదారులపై ప్రత్యేక రీచార్జ్‌ల భారం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** ఉచిత అపరిమిత కాల్స్, చౌక డేటాకు కాలం తీరింది. సోమవారం అర్ధ రాత్రి నుంచి ప్రీ-పెయిడ్ మొబైల్ చార్జీలను వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ పెంచేశాయి. దీంతో నిన్నమొన్నటిదాకా అపరిమితంగా మోగిన మొబైల్స్.. ఇక పరిమితంగా వినిపించనున్నాయి. తమ నెట్‌వర్క్ పరిధిలోని వినియోగదారులకు ఉచిత కాల్స్‌ను అందిస్తున్న సంస్థలు.. ఇతర నెట్‌వర్క్ కస్టమర్లకు చేసే కాల్స్‌పై నిమిషానికి 6 పైసలు చొప్పున వసూలు చేస్తాయి. ఇప్పటికే జియో ఈ తరహా విధానాన్ని అందుబాటులోకి తీసుకురాగా, వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ కూడా అదే బాటలోకి వచ్చాయి. ఈ రెండు సంస్థలు తమ మొబైల్ టారీఫ్‌లను 50 శాతం వరకు పెంచేశాయి. అంతేగాక అపరిమిత ఉచిత కాల్స్‌కు తెరదించాయి. అసలే ఆర్థిక మందగమనం దెబ్బకు ఆదాయం పడిపోయి ఇబ్బందుల్లో ఉన్న సామాన్యులకు ఈ పెంపు శరాఘాతమే అవుతున్నది. ఇతర నెట్‌వర్క్‌ల్లో ఉన్న తమ స్నేహితులు, బంధువులతో మాట్లాడేందుకు ప్రత్యేక రీచార్జీలను చేసుకోవాల్సి వస్తున్నది.

**జియోకే టారీఫోత్సాహం: జేఎం**

మొబైల్ చార్జీల పెంపు.. వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ కంటే రిలయన్స్ జియోకే ఎక్కువగా లాభించేలా ఉన్నది. పెంపు వల్ల ఎయిర్‌టెల్‌కు రూ.2,400 కోట్లు, వొడాఫోన్‌కు రూ.2,100 కోట్లు, జియోకు రూ.3,900 కోట్ల మేర త్రైమాసిక ఆదాయం పెరుగవచ్చని జేఎం ఫైనాన్షియల్ అంచనా వేసింది. జియో పెంపు వివరాలను తెలుపకపోయినా.. 40 శాతం వరకే భారం పడుతుందని స్పష్టం చేసింది. అంతేగాక తమ కస్టమర్లకు 300 శాతం అధిక ప్రయోజనాన్ని అందిస్తామని ప్రకటించింది. దీంతో సోమవారం ఉదయం స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్‌పై ఆ ప్రభావం స్పష్టంగా కనిపించిందని జేఎం ఫైనాన్షియల్ చెబుతున్నది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ దాదాపు రూ.22,650 కోట్లు పెరిగింది. ఇదే సమయంలో ఎయిర్‌టెల్ షేర్ల విలువ రూ.9,370 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.2,730 కోట్లు పుంజుకున్నది.

**పెంపు మంచిదే: సీవోఏఐ**

మొబైల్ కాల్స్, ఇంటర్నెట్ ధరల పెంపు మంచిదేనని భారతీయ సెల్యులార్ ఆపరేటర్ల సంఘం (సీవోఏఐ) స్వాగతించింది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని, టెలికం పరిశ్రమ ఆర్థికంగా బలపడి మరిన్ని ఉద్యోగాలను అందిస్తుందని సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ అభిప్రాయపడ్డారు. 2016-17లో టెలికం రంగ స్థూల ఆదాయం రూ.2.65 లక్షల కోట్లుగా ఉంటే, 2018-19లో రూ.2.45 లక్షల కోట్లకు పడిపోయిందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కాగా, 2016లో జియో రాకతో వాయిస్ కాల్స్ ఉచితమైపోయిన విషయం తెలిసిందే. డేటా ధరలు 95 శాతం తగ్గిపోయాయి.

**పోస్ట్-పెయిడ్ ప్లాన్ల చార్జీలపైనా..**

ప్రీ-పెయిడ్ మొబైల్ చార్జీలను పెంచిన టెలికం సంస్థలు.. త్వరలో పోస్ట్-పెయిడ్ ప్లాన్ల ధరలనూ పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. మార్కెట్‌లో పోటీ వాతావరణం, సుప్రీం కోర్టు తీర్పు మధ్య పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ పడిపోయాయి. ఈ జూలై-సెప్టెంబర్‌లో రికార్డు స్థాయి నష్టాలు వచ్చాయి. ఆదాయం పెరిగేందుకు పోస్ట్-పెయిడ్ ప్లాన్లపైనా బాదుతాయన్న అంచనాలున్నాయి.

**డేటా చార్జీలు తక్కువే: ప్రసాద్**

టెలికం సంస్థలు మొబైల్ చార్జీలను పెంచుతున్న నేపథ్యంలో ఇప్పటికీ ప్రపంచంలో మొబైల్ ఇంటర్నెట్ ధర తక్కువగా ఉన్నది భారత్‌లోనేనని టెలికం శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. భారత్‌లో ఒక గిగాబైట్ మొబైల్ ఇంటర్నెట్ ధర 0.26 డాలర్లుగా ఉందని, బ్రిటన్‌లో 6.66 డాలర్లు, అమెరికాలో 12.37 డాలర్లుగా ఉందని తెలిపారు. ప్రపంచ సగటు ధర 8.53 డాలర్లుగా ఉందని గుర్తుచేశారు. యూపీఏ హయాంలో ఒక జీబీ డేటా ధర రూ.268.97గా ఉందన్న ఆయన ఇప్పుడు రూ.11.78గా ఉందని ట్రాయ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు.

### వొడాఫోన్ ఐడియా నూతన ప్రీ-పెయిడ్ ప్లాన్ల వివరాలివే..!

**కాంబో వోచర్లు**

- రూ.49 - రూ.38 టాక్ టైం, 100 ఎంబీ డేటా, సెకనుకు 2.5 పైసల కాల్ చార్జి, 28 రోజుల వ్యాలిడిటీ
- రూ.79 - రూ.64 టాక్ టైం, 200 ఎంబీ డేటా, సెకనుకు 1 పైస కాల్ చార్జి, 28 రోజుల వ్యాలిడిటీ

**అన్‌లిమిటెడ్ సాచెట్ ప్లాన్**

- రూ.19 - అన్‌లిమిటెడ్ ఆన్-నెట్ వాయిస్, 150 ఎంబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, 2 రోజుల వ్యాలిడిటీ

**అన్‌లిమిటెడ్ ప్లాన్స్ (28 రోజుల వ్యాలిడిటీ)**

- రూ.149 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 2 జీబీ డేటా, 300 ఎస్ఎంఎస్‌లు, 28 రోజుల వ్యాలిడిటీ
- రూ.249 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 28 రోజుల వ్యాలిడిటీ
- రూ.299-అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 28 రోజుల వాలిడిటీ
- రూ.399-అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 3 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 28 రోజుల వ్యాలిడిటీ

**అన్‌లిమిటెడ్ ప్లాన్స్ (84 రోజుల వ్యాలిడిటీ)**

- రూ.379 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 6 జీబీ డేటా, 1,000 ఎస్ఎంఎస్‌లు, 84 రోజుల వ్యాలిడిటీ
- రూ.599 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 84 రోజుల వ్యాలిడిటీ
- రూ.699-అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 84 రోజుల వ్యాలిడిటీ

**అన్‌లిమిటెడ్ ప్లాన్స్ (365 రోజుల వాలిడిటీ)**

- రూ.1499 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 24 జీబీ డేటా, 3,600 ఎస్ఎంఎస్‌లు, 365 రోజుల వ్యాలిడిటీ
- రూ.2399 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 365 రోజుల వ్యాలిడిటీ

**ఫస్ట్ రీచార్జి ప్లాన్స్**

- రూ.97 - రూ.45 టాక్ టైం, 100 ఎంబీ డేటా, సెకనుకు 1 పైస కాల్ చార్జి, 28 రోజుల వ్యాలిడిటీ
- రూ.197 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 2 జీబీ డేటా, 300 ఎస్ఎంఎస్‌లు, 28 రోజుల వ్యాలిడిటీ
- రూ.297 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 28 రోజుల వ్యాలిడిటీ
- రూ.647 - అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 84 రోజుల వ్యాలిడిటీ

- వొడాఫోన్ ఐడియా నుంచి ఇతర నెట్‌వర్క్ వినియోగదారులకు చేసే కాల్స్‌పై నిమిషానికి 6 పైసలు చార్జీ పడుతుంది. అయితే ఈ కాల్స్ చేయడానికి వినియోగదారులు ప్రత్యేక రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. అందుకుగాను వారికి రూ.49, రూ.79 రీచార్జి ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనీసం రూ.49 అయినా రీచార్జి చేయించుకుంటేనే వినియోగదారులు ఇన్‌కమింగ్ కాల్స్‌ను పొందగలుగుతారు. అన్‌లిమిటెడ్ ప్లాన్లు వాడితే ప్రత్యేక రీచార్జి చేసుకోవాల్సిన పనిలేదు. ఆ ప్లాన్లలోనే ఇతర నెట్‌వర్క్ వినియోగదారుల కోసం పరిమిత స్థాయిలో ఉచిత కాల్స్ వస్తాయి.

### భారతీ ఎయిర్‌టెల్

**కాంబో వోచర్లు**

- రూ.19 - అన్‌లిమిటెడ్ కాల్స్, 150 ఎంబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, 2 రోజుల వ్యాలిడిటీ
- రూ.49-రూ.38.52 టాక్ టైం, 100 ఎంబీ డేటా, 28 రోజుల వాలిడిటీ
- రూ.79-రూ.63.95 టాక్ టైం, 200 ఎంబీ డేటా, 28 రోజుల వ్యాలిడిటీ

**అన్‌లిమిటెడ్ ప్లాన్స్ (28 రోజుల వ్యాలిడిటీ)**

- రూ.148 - అన్‌లిమిటెడ్ కాల్స్, 2 జీబీ డేటా, 300 ఎస్ఎంఎస్‌లు
- రూ.248 - అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు
- రూ.298 - అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు

**అన్‌లిమిటెడ్ ప్లాన్స్ (84 రోజుల వ్యాలిడిటీ)**

- రూ.598 - అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు
- రూ.698 - అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు

**అన్‌లిమిటెడ్ ప్లాన్స్ (365 రోజుల వ్యాలిడిటీ)**

- రూ.1498 - అన్‌లిమిటెడ్ కాల్స్, 24 జీబీ డేటా, 3,600 ఎస్ఎంఎస్‌లు
- రూ.2398 - అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 1.5 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు

- వొడాఫోన్ ఐడియాలాగే ఎయిర్‌టెల్ కూడా ఇతర నెట్‌వర్క్‌ల కస్టమర్లకు చేసే కాల్స్‌పై నిమిషానికి 6 పైసలు వసూలు చేస్తుంది. అందుకు వినియోగదారులు ప్రత్యేక రీచార్జి చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వారికి రూ.19, రూ.49, రూ.79 ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రీచార్జి చేసుకుంటేనే వినియోగదారులు ఇన్‌కమింగ్ కాల్స్ స్వీకరించేందుకు అవకాశం ఉంటుంది.



## పెట్టుబడులను ఆకట్టుకోవడానికే కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించాం..

లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** పెట్టుబడులను ఆకట్టుకోవడానికి, భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు వెల్లడించారు. అంతర్జాతీయ కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో తప్పని పరిస్థితుల్లో ఈ కీలక నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధంలో అక్కడి కంపెనీలు తమ ప్లాంట్లను ఇతర దేశాలకు తరలించేయోచనలో ఉన్న ప్రస్తుత తరుణంలో కార్పొరేట్ ట్యాక్స్‌ను పది శాతం వరకు తగ్గించినట్లు మంత్రి చెప్పారు. పన్ను చట్టాల సవరణ బిల్లుకు సోమవారం పార్లమెంట్ ఆమోదం పొందిన నేపథ్యంలో సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన కేంద్ర ప్రభుత్వం..నూతన తయారీ కంపెనీలపై విధించే పన్నును 15 శాతానికి పరిమితం చేసింది. పొరుగు దేశాల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడంతోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించడంతో భారత ప్రభుత్వం కూడా 34.94 శాతంగా ఉన్న పన్నును 25.17 శాతానికి తగ్గించినట్లు చెప్పారు.

**5 శాతం పెరిగిన పన్ను వసూళ్లు**

కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించినప్పటికీ గత నెల చివరినాటికి దేశీయ స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 5 శాతం వృద్ధి నమోదైందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ట్యాక్స్‌ను తగ్గించడం వల్ల ఆదాయం కోల్పోనున్నట్లు వచ్చిన భయాలను మంత్రి తోసిపుచ్చారు. పన్ను వసూళ్లు తగ్గలేదు కానీ, ఐదు శాతం చొప్పున పెరిగాయని, గత త్రైమాసికంలోనే అత్యధికంగా వసూలైనట్లు సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**ఇంధనాలపై పన్నులను తగ్గించం..**

పెట్రోల్, డీజిల్‌లపై సుంకాలను తగ్గించే ప్రతిపాదనేది ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు క్రమంగా పెరుగుతుండటం వల్లనే దేశీయంగా అధికమవుతున్నాయని లోక్‌సభలో మంత్రి వెల్లడించారు. పెట్రోల్, డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తారా అని అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ..దీనిపై చర్చలు జరుగుతున్నాయని, ఈ రెండు ఇంధనాలపై ఎలాంటి జీఎస్టీని విధించడం లేదని, రేట్లను మాత్రం జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోనున్నదని చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన ఏర్పాటైన ఈ కౌన్సిల్‌లో అన్ని రాష్ర్టాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్నారు. ఈ రెండు ఇంధనాలపై కేంద్రం సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ పన్నులను వసూలు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వాలు లెవీ ట్యాక్స్‌ను విధిస్తున్నాయి.

## మరో 5 కోట్ల ఉద్యోగాలు!

ఎంఎస్ఎంఈ రంగంపై ప్రభుత్వం ధీమా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లు ఇప్పటిదాకా 11 కోట్ల ఉద్యోగాలను సృష్టించాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. 2024 నాటికి మరో 5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామని సోమవారం రాజ్యసభలో చెప్పారు. 'ఎంఎస్ఎంఈలు.. దేశ వృద్ధి చోదకాలు. ప్రస్తుతం జీడీపీలో ఈ సంస్థల వాటా 29 శాతంగా ఉన్నది. దేశ ఎగుమతుల్లో కూడా ఎంఎస్ఎంఈల వాటా 49 శాతం. ఎంఎస్ఎంఈలు ఇప్పటివరకు 11 కోట్ల ఉద్యోగాలను సృష్టించాయి' అని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి గడ్కరీ అన్నారు. 2019-24 మధ్య ఐదేండ్లకుగాను అదనంగా 5 కోట్ల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. దీనివల్ల జీడీపీలో, ఎగుమతుల్లో కూడా ఎంఎస్ఎంఈల వాటా పెరుగుతుందన్నారు. కాగా, రాబోయే రెండేండ్లలో 12 టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామని, రూ.200 కోట్ల పథకంలో భాగంగా ఇవి వస్తున్నాయని తెలిపారు.

**జీతాలు 9.2 శాతం పెరుగొచ్చు**

వచ్చే ఏడాది దేశంలో ఉద్యోగుల జీతాలు 9.2 శాతం మేర పెరుగవచ్చని కోర్న్ ఫెర్రి గ్లోబల్ అంచనా వేసింది. ఇది ఆసియా దేశాల్లో అత్యధికమని పేర్కొన్నది. అయితే ద్రవ్యోల్బణంతో కొంత ఇబ్బంది రావచ్చని అభిప్రాయపడింది. నిజానికి గతేడాది వేతనాల పెంపు 10 శాతంగా ఉన్నది. ఈసారి తగ్గుతుండటం గమనార్హం. ప్రభుత్వ సంస్కరణల ఫలాలు అందితే మరింత మెరుగైన ఫలితాలు రావచ్చని సంస్థ ఇండియా విభాగం చైర్మన్ నవనీత్ సింగ్ అన్నారు.

### 3.38 లక్షల కంపెనీల గుర్తింపు రద్దు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** గడిచిన రెండేండ్లలో భారత్‌లో 3.38 లక్షల కంపెనీల గుర్తింపును రద్దు చేసినట్లు వార్షిక నివేదికలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వరుసగా రెండేండ్లకు పైగా వార్షిక రిటర్నులు నమోదు చేయని సంస్థలపై అధికారికంగా వేటు వేసినట్లు, దీంట్లోభాగంగా 2017-18, 2018-19 సంవత్సరాల్లో మూడు లక్షలకు పైగా సంస్థలపై వేటు వేసినట్లు లోక్‌సభలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్‌ఠాకూర్ తెలిపారు.

### 6.3 కాదు 5.1 శాతమే

వృద్ధి అంచనాల్లో క్రిసిల్ కోత

**ముంబై, డిసెంబర్ 2:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి అంచనాను మరోమారు తగ్గించింది ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్. గతంలో 6.3 శాతంగా ఉంటుందని అంచనావేసిన క్రిసిల్.. ఈసారి దీనిని 5.1 శాతానికి కుదించింది. దేశీయ ఆర్థిక మందగమన పరిస్థితులు కొనసాగుతుండటం, జీఎస్టీ, రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్, దివాలా చట్టం వంటి అంశాలు వృద్ధికి బ్రేకులు వేస్తున్నాయని తెలిపింది. జపాన్‌కు చెందిన బ్రోకరేజ్ సంస్థ అంచనా వేసిన 4.7 శాతం కంటే ఇది తక్కువ. ఈ నేపథ్యంలో ఈవారంలో జరుగనున్న రిజర్వు బ్యాంక్ పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను మరోసారి తగ్గించే అవకాశాలున్నాయి.

### ఎన్‌సీసీకి రూ.243 కోట్ల ఆర్డర్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీకి పలు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.243 కోట్ల విలువైన పలు రోడ్డు ప్రాజెక్టుల ఆర్డర్లు వచ్చాయి. గత నెలలో సంస్థ రూ.243 కోట్ల ఆర్డర్లను దక్కించుకున్నదని కంపెనీ ఎండీ ఏవీ రంగరాజు తెలిపారు. ఈ ఆర్డర్లు కేవలం రోడ్డు డిజైన్ నుంచి మాత్రమే లభించాయని, వీటిలో అంతర్గత ఆర్డర్లను చేర్చలేదని ఆయన చెప్పారు.

# అలా కుదరదు

క్లయింట్ల పవర్ ఆఫ్ అటార్నీ వినియోగంపై కార్వీకి తేల్చిచెప్పిన సెబీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:**

తమ క్లయింట్ల పవర్ ఆఫ్ అటార్నీని వినియోగించుకుంటామన్న కార్వీ అభ్యర్థనను మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ఖండించింది. సొంత అవసరాల కోసం క్లయింట్ల సెక్యూరిటీలను తాకట్టు పెట్టిందన్న ఆరోపణల్ని కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ హైదరాబాద్ ఆధారిత సంస్థను స్టాక్ బ్రోకింగ్ కార్యకలాపాల నుంచి సెబీ బహిష్కరించిన సంగతీ విదితమే. అయితే క్లయింట్లు జరిపిన లావాదేవీల సెటిల్మెంట్ల కోసం పవర్ ఆఫ్ అటార్నీ వాడుకుంటామంటూ సెక్యూరిటీస్ అప్పీలెట్ ట్రిబ్యునల్ (శాట్)ను కార్వీ ఆశ్రయించింది. అంతకుముందు కూడా ఈ విషయమై సెబీని కార్వీ సంప్రదించింది. ఈ క్రమంలో దీనిపై స్పష్టత ఇవ్వాలని సెబీకి శాట్ సూచించగా, పవర్ ఆఫ్ అటార్నీలను వాడుకోవడం కుదరదని స్పష్టం చేసింది. అంతేగాక కేసు పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత 95 వేలకుపైగా క్లయింట్లకు చెందిన రూ.2,300 కోట్ల విలువైన సెక్యూరిటీలను కార్వీ అక్రమంగా బదిలీ చేసిందని గుర్తించినట్లు తెలిపింది.

**రహస్య ఖాతా**

బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ)పై తన పేరున ఉన్న ఓ డీమ్యాట్ ఎకౌంట్‌లోకి క్లయింట్ల సెక్యూరిటీలను కార్వీ బదిలీ చేసిందని సెబీ వివరించింది. ఈ ఖాతా వివరాలను ఎప్పుడూ కార్వీ బయటపెట్టలేదని కూడా అన్నది. ఈ సెక్యూరిటీలను తమవిగా చూపి రూ.600 కోట్ల రుణాలను పొందినట్లు చెప్పింది. పూర్తిగా చెల్లించిన క్లయింట్ల సెక్యూరిటీలనూ తమ సొంత/గ్రూప్ సంస్థల కోసం వాడుకోవడానికి నిధుల సమీకరణార్థం తాకట్టు పెట్టారని వివరించింది. ఈ నేపథ్యంలో కార్వీని నమ్మలేమని సెబీ గత శుక్రవారం రాత్రి పొద్దుపోయాక విడుదల చేసిన ఓ ఆదేశంలో తేల్చిచెప్పింది.

**డీఐఎస్‌ల ద్వారా..**

ఇదిలావుంటే తమ సెక్యూరిటీలను బ్రోకర్ ద్వారా అమ్ముకోవాలని భావించే కార్వీ క్లయింట్లు.. ఎలక్ట్రానిక్ లేదా భౌతిక డెలివరీ ఇన్‌స్ట్రక్షన్ స్లిప్ (డీఐఎస్)లను మాత్రం వినియోగించుకునే వీలుందని సెబీ ఈ సందర్భంగా తెలియజేసింది. కాగా, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ).. కార్వీపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ జరుపుతున్నదని సెబీ ప్రకటించింది. క్లయింట్ల నిధులను దుర్వినియోగం చేయడమేగాక, తమ ఆదేశాల అనంతరం కూడా సంస్థ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిందని సెబీ మండిపడింది.

**లైసెన్స్ నిలుపుదల**

కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ ట్రేడింగ్ లైసెన్స్‌ను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు సోమవారం సస్పెండ్ చేశాయి. నిబంధనల అతిక్రమణకుగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్టాక్ ఎక్స్చేంజీలు ప్రకటించాయి. 'ఎక్స్చేంజీల నిబంధనలను పాటించనందుకుగాను డిసెంబర్ 2, 2019 నుంచి కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్‌పై నిషేధం విధిస్తున్నాం' అని వేర్వేరు ప్రకటనల్లో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు తెలియజేశాయి. మరోవైపు కార్వీపై సెబీ తీసుకున్న చర్యలతో 90 శాతం క్లయింట్ల సెక్యూరిటీలు సురక్షితంగా ఉన్నాయి. దాదాపు 83 వేల మంది ఇన్వెస్టర్లు తమ సెక్యూరిటీలను తిరిగి పొందగలిగారు.

## 'బెస్ట్ ప్రైస్' కస్టమర్లకు క్రెడిట్ కార్డు

హెచ్‌డీఎఫ్‌సీతో జతకట్టిన వాల్‌మార్ట్



**హైదరాబాద్, డిసెంబర్ 2:** అమెరికాకు చెందిన రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ఇండియా.. బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో జతకట్టింది. ఈ ఒప్పందంలో భాగంగా హోల్‌సేల్ 'బీ2బీ క్యాష్ అండ్ క్యారీ' సేవలు అందిస్తున్న బెస్ట్ ప్రైస్ వినియోగదారులకు క్రెడిట్ కార్డును అందించనున్నది.ఈ క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలు చేసిన వస్తువులపై 18 రోజుల నుంచి 50 రోజుల వరకు ఎప్పుడైనా చెల్లింపులు జరుపవచ్చునని వాల్‌మార్ట్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో క్రిశ్ అయర్ తెలిపారు. హైదరాబాద్ తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 26 హోల్‌సేల్ స్టోర్లలో ఒకేసారి ఈ కార్డును విడుదల చేసినట్లు చెప్పారు. బెస్ట్ ప్రైస్ ఖాతాదారులకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు, ఈ కార్డు తీసుకున్న వారు ఎంతైన షాపింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. మరోవైపు వ్యాపార విస్తరణలో భాగంగా ఏపీలోని కర్నూల్‌లో ఏర్పాటు చేసిన హోల్‌సేల్ స్టోర్‌ను వచ్చే వారంలో ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆర్థిక మందగమన పరిస్థితులు ఉన్నప్పటికీ దేశీయ రిటైల్ రంగం అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, ప్రపంచ మార్కెట్లో భారత్ అన్ని విభాగాల్లో దూసుకుపోతున్నదన్నారు. ఈ కో-బ్రాండెడ్ కార్డుపై రివార్డులు, క్యాష్ బ్యాక్ ఆఫర్ లభించనున్నదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధి పరాగ్ రావు తెలిపారు. రెండు రకాల్లో లభించనున్న ఈ కార్డుపై ఏడాదికి రూ.1,000 వరకు ఫీజును వసూలు చేస్తున్నట్లు చెప్పారు.



కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మెదక్ జిల్లా మఖ్దూంపూర్, కుచన్‌పల్లి గ్రామాల్లో తడి, పొడి చెత్త డబ్బాలను పంపిణీ చేస్తున్న ఫ్రీడం ఆయిల్ ప్రతినిధులు

# గిడ్డంగుల్లోకి నిధుల వరద

### 2017 నుంచి రూ.25 వేల కోట్ల పెట్టుబడి

### 2021 నాటికి రూ.49,500 కోట్లకు చేరుకోనున్నట్లు అంచనా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:**

గిడ్డంగులు భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకుంటున్నాయి. గడిచిన మూడేండ్లలో రూ.25 వేల కోట్ల మేర పెట్టుబడులను ఆకట్టుకున్న ఈ రంగం..వచ్చే మూడేండ్లలో ఇది రూ.49,500 కోట్లకు చేరుకునే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఈ కామర్స్ కంపెనీలు తమ వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించడంతో లాజిస్టిక్ స్థలానికి అనూహ్యంగా డిమాండ్ నెలకొన్నదని అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెన్సీ కోలియర్ వెల్లడించింది. 2017 నుంచి భారత్‌లో ఇండస్ట్రియల్, వేర్‌హౌజింగ్ విభాగాలు అత్యధికంగా పెట్టుబడులను ఆకట్టుకుంటున్నాయని, ముఖ్యంగా ఈ-కామర్స్ సేవలు ఊపందుకోవడం, వినియోగదారులకు సంబంధించిన విభాగాలకు అంచనాలకు మించి వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణమని తెలిపింది. దేశీయ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహంగా ఉన్నప్పటికీ ఈ రెండు రంగాలు దూసుకుపోతున్నాయని, పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంత వాసులు ఆన్‌లైన్‌లోనే అన్ని వస్తువులు కొనుగోలు చేయడంతో ఈ-కామర్స్ సేవలకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. దీంతో ఈ-కామర్స్ సంస్థలు కొనుగోలుదారులకు తక్కువ సమయంలోనే బుకింగ్ చేసుకున్న వస్తువులను అందించడానికి భారీగా గిడ్డంగులను ఏర్పాటు చేసుకున్నాయి. గిడ్డంగులను లీజుకు తీసుకోవడానికి దేశంలోవున్న అతిపెద్ద కంపెనీలు ఆసక్తి చూపడం, ముఖ్యంగా ఈ-కామర్స్‌తోపాటు 3పీఎల్(థర్డ్-పార్టీ లాజిస్టిక్) విభాగాల నుంచి అధిక డిమాండ్ ఉండటం, ముంబై, పుణెలలో మైక్రోమేకర్స్‌ను తయారు చేయడానికి ఆసక్తి చూపినట్లు కోలియర్స్ ఇంటర్నేషనల్ ఇండియా సీఎండీ సంకే ప్రసాద్ తెలిపారు. గిడ్డంగులను ఏర్పాటుకు సంబంధించి పెట్టుబడులను బెంగళూరు అత్యధికంగా ఆకట్టుకుంటున్నదని, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం పన్నులను ఎత్తివేయడం ఇందుకు కారణమని ఆయన చెప్పారు. ప్రభుత్వాలు ప్రకటించిన పాలసీల్లో భాగంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ, మేక్ ఇన్ ఇండియా పథకం వేర్‌హౌజింగ్ రంగం భారీ పెట్టుబడులను ఆకట్టుకుంటున్నాయి.



బయోడైవర్సిటీ బ్రిడ్జి పైనుంచి కారుపల్టీలు కొట్టిన ఘటనలో మృతిచెందిన సత్యవేణి కుటుంబసభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేస్తున్న హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్



తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా పదవీ విరమణ చేసిన కన్వల్జిత్‌సింగ్‌ను సన్మానిస్తున్న పీసీసీఎఫ్ ఆర్ శోభ, అటవీశాఖ ఉద్యోగులు

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

ఏరియా జీఎంలను ఆదేశించిన సింగరేణి సీఎండీ శ్రీధర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ శ్రీధర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వెనుకబడిన లక్ష్యాలతోపాటు నెలవారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశించారు. సింగరేణి భవన్‌లో డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలు, ఇతర కారణాలతో ఇప్పటికే వెనుకబడిన మూడు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తితోపాటు మిగిలిన నాలుగు నెలల్లో సాధించాల్సిన లక్ష్యాన్ని చేరుకోవాలని, దీని కోసం రోజుకు 2.08 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, రవాణా జరుపాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు శంకర్, చంద్రశేఖర్, భాస్కర్‌రావు, బలరాం, ఆంటోనిరాజు, జీఎంలు పాల్గొన్నారు.



## ఎన్వోసీ ఉంటేనే ఎగ్జిబిషన్‌కు అనుమతి

స్పష్టం చేసిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అన్ని శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు ఉంటేనే జనవరి 1 నుంచి ఎగ్జిబిషన్ నిర్వహణకు అనుమతిస్తామని సోమవారం హైకోర్టు స్పష్టంచేసింది. ప్రమాదం జరిగినప్పుడు బయటకు వెళ్లే మార్గాల సూచికలతో కూడిన ఎగ్జిబిషన్ మైదానం మ్యాప్‌ను సమర్పించాలని తెలిపింది. ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇస్తే ఏయే అంశాలతో సంతృప్తిచెంది ఎన్వోసీ ఇచ్చారో కోర్టుకు తెలుపాలని ఆయా శాఖలను హైకోర్టు ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది.

## ఆహారధాన్యాల నిల్వకు రైల్వే స్థలాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆహారధాన్యాల నిల్వల కోసం రైల్వే స్థలాలను ఎంపికచేయాలని రైల్వే, భారత ఆహార సంస్థ అధికారులు నిర్ణయించారు. సోమవారం ఏపీ, తెలంగాణ ఎఫ్‌సీఐ అధికారులతో దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా సమావేశమయ్యారు. ఖాళీ స్థలాలను గుర్తించి నివేదిక రూపొందించాలని నిర్ణయించారు.

# ఆరోగ్యలక్ష్మితో రక్తహీనతకు చెక్

- నిత్యం 22,28,150 మందికి పోషకాహారం పంపిణీ
- రోజుకు రూ.2.46 కోట్లు ఖర్చు
- గర్భిణులకు అండగా కేసీఆర్ కిట్
- పరీక్షలకు వెళ్లేవారికి 'అమ్మ ఒడి' వాహనం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పేదరికం, అవగాహనారాహిత్యం, పోషకాహారలోపంతో దేశవ్యాప్తంగా మహిళలను రక్తహీనత సమస్య పట్టిపీడిస్తున్నది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎక్కువగా గర్భిణులు మృత్యువాతపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య లక్ష్మి నిరుపేద మహిళలకు వరంగా మారింది. ఈ పథకంలో గర్భిణులు, బాలింతలు, బాలికలకు పోషకాహారం అందిస్తున్నారు. ఆరోగ్య లక్ష్మి పథకం కింద 22,28,150 మందికి నిత్యం పాలు, గుడ్లు, అన్నం, పప్పుతో భోజనం అందిస్తున్నారు. ఈ పథకంలో 5,31,310 మంది బాలింతలు/గర్భిణులు, 10,42,675 మంది ఏడు నెలల నుంచి మూడేండ్ల వయసు చిన్నారులు, 6,54,165 మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల వయసు బాలికలు పోషకాహారం పొందుతున్నారు. దీనికోసం ప్రభుత్వం రోజుకు రూ.2.46 కోట్లు ఖర్చు చేస్తున్నది.

### తగ్గుతున్న బాధితుల సంఖ్య

గత ఏడాది జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 15-49 ఏండ్ల మధ్య వయసున్న మహిళల్లో 53 శాతం మంది రక్తహీనత సమస్య ఎదుర్కొంటున్నట్టు గుర్తించారు. రాష్ట్రంలో 7,786 కుటుంబాల్లో సర్వే చేపట్టగా 55 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు తెలిసింది. 6-59 నెలల చిన్నారుల్లో 60.7 %, నాన్ ప్రెగ్నెంట్ మహిళలు 15-49 ఏండ్లవారిలో 56.9 %, గర్భిణులు 18-40 ఏండ్ల వారిలో 49.8 %, 15-49 ఏండ్ల వయసు మహిళల్లో 56.7 % మందిలో రక్తహీనత ఉన్నట్టు గుర్తించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలతో రాష్ట్రంలో రక్తహీనతతో బాధపడేవారి సంఖ్య తగ్గుముఖం పడుతున్నది. వైద్యపరీక్షల కోసం దవాఖానకు వెళ్లేందుకు గర్భిణులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు 'అమ్మ ఒడి' వాహనాలను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవించే మహిళలకు ప్రోత్సాహకంగా కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్నారు. బాలింతలు పూర్తిస్థాయిలో విశ్రాంతి తీసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12 వేలు ఆర్థిక సహాయాన్ని (బాలికకు జన్మనిస్తే రూ .13 వేలు) విడుతలవారీగా అందజేస్తున్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకంతో గర్భిణులు పనులకు వెళ్లకుండా ఇంటి పట్టునే ఉంటూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవిస్తున్నారు.

### రక్తహీనత నివారణకు మాత్రలు

ఎర్ర రక్తకణాలు తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం ఐరన్ లోపమని, విటమిన్ బీ12, ఫోలిక్‌యాసిడ్ సమృద్ధిగా లేకపోవడంతో ఈ సమస్యకు గురవుతున్నట్లు వైద్యనిపుణులు చెప్తున్నారు. రక్తహీనత నివారణకు ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఐరన్, ఫోలిక్‌యాసిడ్ మాత్రలను అందజేస్తున్నారు. రక్తహీనతతో బాధపడే మహిళలకు 200 ఐరన్ మాత్రలు అందజేస్తున్నారు.



మిస్‌మ్యాచ్ సినిమా ప్రీరిలీజ్ వేడుకలో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు, హీరో వెంకటేశ్. చిత్రంలో నిర్మాత శ్రీరాంరాజు, ఉదయ్‌శంకర్, ఐశ్వర్యరాజేశ్ తదితరులు ఉన్నారు.

## సినిమాలు మహిళల గౌరవం పెంచాలి

'మిస్‌మ్యాచ్' సినిమా ప్రీరిలీజ్ వేడుకలో మంత్రి టీ హరీశ్‌రావు

'ప్రస్తుతం సినిమాల్లో కొత్తతరం హవా నడుస్తున్నది. నవ్యమైన ఆలోచనలతో నటీనటులు, సాంకేతిక నిపుణులు అద్భుత విజయాల్ని అందుకొంటున్నారు. 'మిస్‌మ్యాచ్' చిత్రం కూడా అదే పంథాలో నిర్మించారనిపిస్తున్నది' అని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మనిషి వ్యక్తిత్వాన్ని, మహిళల గౌరవాన్ని ఇనుమడింపజేసేలా సినిమాల రూపకల్పన జరగాలని ఆకాంక్షించారు. ఉదయ్‌శంకర్, ఐశ్వర్యారాజేశ్ జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్‌మ్యాచ్'. ఎన్వీ నిర్మల్‌కుమార్ దర్శకుడు. భరత్‌రాం, శ్రీరాంరాజు నిర్మాతలు. ఈ నెల 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి టీ హరీశ్‌రావు, హీరో వెంకటేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఈ చిత్ర కథానాయకుడి తండ్రి శ్రీరామ్ మీద ఉన్న గౌరవంతో ఈ వేడుకకు వచ్చాను. ట్రైలర్ చూస్తే క్రీడా నేపథ్యంలో నడిచే ప్రేమకథ అని అర్థమైంది. ప్రేమ.. మనిషి సామర్థ్యాల్ని పెంచాలి. మనుషుల్ని విజయపథం వైపు నడిపించాలి. సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలి. ఎట్టి పరిస్థితుల్లో వికృతరూపం తీసుకోకూడదు. ఈ సినిమా హీరో ఉదయ్‌శంకర్ 15 ఏండ్ల వయసులోనే గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకెక్కారు. ఈ చిత్రంలోని సందేశం సొసైటీతో మ్యాచ్ కావాలని, సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకొంటున్నాను' అని అన్నారు. హీరో వెంకటేశ్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాకు పనిచేసినవారిలో చాలామంది నా సన్నిహితులున్నారు. 'ఆటగదరా శివ' చిత్రంలో చక్కగా నటించిన ఉదయ్‌శంకర్‌కు ఈ సినిమాలో మంచి పాత్ర దొరికింది. తన రియల్‌లైఫ్ క్యారెక్టర్‌కు దగ్గరగా ఉంది. సందేశాత్మక కథతో రూపొందిన ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి' అని చెప్పారు. గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి మాట్లాడుతూ.. 'హరీశ్‌రావు చిరునవ్వు అంటే నాకు చాలా ఇష్టం. నిర్మాతతో నాకు ఇరవైయేండ్ల పరిచయం ఉంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రేమ, సందేశం మేళవించి ఈ సినిమాను హృద్యంగా రూపొందించారు' అన్నారు. స్త్రీ శక్తికి నిదర్శనంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, భిన్న మనస్తత్వాలు కలిగిన యువతీయువకుల ఇతివృత్తంతో ఈ సినిమాను ఆద్యంతం ఆసక్తికరంగా తీర్చిదిద్దారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దర్శకుడు నిర్మల్‌కుమార్, నిర్మాతలు భరత్‌రాం, శ్రీరాంరాజు, నాయకానాయికలు ఉదయ్‌శంకర్, ఐశ్వర్యరాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

- సినిమా డెస్క్, నమస్తే తెలంగాణ



జనాభా లెక్కల సేకరణపై ఉన్నతాధికారులతో సమీక్ష జరుపుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి. చిత్రంలో రాజేశ్వర్‌తివారి, శాంతికుమారి, అధర్‌సిన్హా తదితరులు కూడా ఉన్నారు.

## మొబైల్ యాప్ ద్వారా జనాభా లెక్కలు

- 71,136 మంది ఎన్యూమరేటర్ల ద్వారా సేకరణ
- ఏర్పాట్లపై సమీక్షలో సీఎస్ ఎస్కే జోషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జనాభా లెక్కలను మొబైల్ యాప్ ద్వారా, పేపర్ షెడ్యూల్ ద్వారా సేకరించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. జనాభా లెక్కల సేకరణ తెలంగాణలో 71,136 మంది ఎన్యూమరేటర్ల ద్వారా సేకరిస్తున్నట్టు వెల్లడించారు. 2021 సంవత్సరానికి జనాభా లెక్కల సేకరణ ఏర్పాట్లపై సోమవారం బీఆర్కే భవన్‌లో ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షించారు. ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటుచేసి చార్జ్ ఆఫీసర్లను నియమిస్తామన్నారు. ఇప్పటికే 65 మంది మాస్టర్ ట్రైనర్లకు తొలి విడుత శిక్షణ ఇచ్చామని, రెండో విడుత శిక్షణ 7వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. 2020 జనవరిలో దాదాపు రెండు వేల మంది క్షేత్రస్థాయి శిక్షకులకు ట్రైనింగ్ ఇస్తామని, వీరు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఏప్రిల్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. జనాభా లెక్కల సేకరణలో భాగంగా ఇండ్ల సంఖ్య, కుటుంబాల సంఖ్యతో పాటు జాతీయ జనాభా లెక్కల రిజిస్టర్‌ను అప్‌డేట్ చేస్తారని చెప్పారు. ఈ లెక్కల సేకరణ వల్ల వ్యక్తుల వివరాలతోపాటు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, నివాస వివరాలను కూడా సేకరిస్తామన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్‌తివారి, శాంతికుమారి, అధర్‌సిన్హా, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఆర్థికశాఖ ఉన్నతాధికారి శివశంకర్, డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్స్ ఇలంబర్తి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు, పురపాలకశాఖ డైరెక్టర్ శ్రీదేవి, గెజిటీర్స్ డైరెక్టర్ కిషన్‌తోపాటు ప్లానింగ్, మీ-సేవ అధికారులు పాల్గొన్నారు.

# చికిత్సపొందుతూ చంద్రయ్య మృతి

- 28 రోజులుగా వైద్యసేవలు పొందుతూ తుదిశ్వాస
- తాసిల్దార్ విజయారెడ్డి సజీవదహనం ఘటనలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



చంద్రయ్య (ఫైల్)

**అబ్దుల్లాపూర్‌మెట్/ సుల్తాన్‌బజార్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ తాసిల్దార్ విజయారెడ్డి సజీవదహనం ఘటనలో గాయపడిన అటెండర్ చంద్రయ్య (53) ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. 28 రోజులుగా మృత్యువుతో పోరాడి సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రాళ్లగూడెంకు చెందిన చంద్రయ్య సొంతూరులో వీఆర్‌ఏగా పనిచేశాడు. అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్ తాసిల్దార్ కార్యాలయం ఏర్పాటుచేయడంతో అక్కడ అటెండర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. గతనెల 4న అబ్దుల్లాపూర్‌మెట్ తాసిల్దార్ కార్యాలయంలో విజయారెడ్డిపై ఓ వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ఆమెను కాపాడబోయిన చంద్రయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సంతోష్‌నగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం రాళ్లగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు. చంద్రయ్యకు భార్య పద్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయారెడ్డి సజీవదహనం కేసులో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. విజయారెడ్డితోపాటు డ్రైవర్ గురునాథం, ఘాతుకానికి పాల్పడిన కూర సురేశ్ ఇప్పటికే మృతిచెందగా, ప్రస్తుతం చంద్రయ్య కూడా కన్నుమూశారు. పెద్దదిక్కును కోల్పోయిన తమను ఆదుకోవాలని చంద్రయ్య కుటుంబ సభ్యులు కోరారు.

### చంద్రయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం: ట్రెసా

**అబ్దుల్లాపూర్‌మెట్** తాసిల్దార్ విజయారెడ్డిని రక్షించేక్రమంలో ప్రమాదానికి గురై మరణించిన ఆఫీస్ సబార్డినేట్ చంద్రయ్య కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగా రవీందర్‌రెడ్డి, కే గౌతమ్‌కుమార్ తెలిపారు. సోమవారం చంద్రయ్య కుటుంబసభ్యులను ఓదార్చారు. చంద్రయ్య అంత్యక్రియలు, ఇతర ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తక్షణమే స్పందించి డీఆర్డీవో అపోలో దవాఖానలో చికిత్స అందించినప్పటికీ చంద్రయ్య మరణించడం చాలా బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ప్లాటు మంజూరు చేసి, సొంతింటి నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెసా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శుక్లా, జిల్లా నాయకులు జనార్దన్‌రావు, రామ్మోహన్, బాలరాజ్, జంగయ్య, మేడ్చల్ జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి, వీఆర్వో, వీఆర్‌ఏ నాయకులు రవినాయక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా కొణిజర్లలో పురుగుమందు డబ్బాతో నిరసన వ్యక్తంచేస్తున్న తుమ్మలపల్లి రైతులు

## పాస్‌పుస్తకాల కోసం రైతుల ఆందోళన

ఖమ్మం జిల్లా కొణిజర్ల డిప్యూటీ తాసిల్దార్ అడ్డగింత

ధర్మగంట

**కొణిజర్ల:** ఐదు దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న తమ భూములకు అధికారులు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపిస్తూ కొందరు రైతులు సోమవారం పురుగుమందు డబ్బాతో ఖమ్మం జిల్లా కొణిజర్ల తాసిల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మండలంలోని తుమ్మలపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 19, 20, 21లలో రెండు ఎకరాల భూమిని గుండ్ల రాములు అనే వ్యక్తి అదేగ్రామానికి చెందిన వల్లభి రామయ్య వద్ద 1968లో అగ్రిమెంట్ పేపర్‌పై కొనుగోలుచేశారు. అనంతరం వారి కుమారులు గుండ్ల నాగేశ్వరరావు, వీరభద్రం, నరసింహారావు సాగుచేసుకుంటున్నారు. అయితే ఈ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని, కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పొలం కొనుగోలుకు సంబంధించి కాగితాలు ఉన్నప్పటికీ వల్లభి రామయ్య కూతురు కట్ల పుష్పావతి భూమి తనదేనంటూ రెవెన్యూ అధికారుల వద్ద వివాదాన్ని సృష్టించారని, అధికారులు సత్వరమే స్పందించాలని డిమాండ్ చేస్తూ పురుగుమందు డబ్బాతో బాధితులు నిరసన వ్యక్తంచేశారు. ఇదే రెవెన్యూ పరిధిలోని మరో 4.20 ఎకరాలపై సైతం ఇదే తరహాలో వివాదం నెలకొనడంతో సంబంధిత రైతులు అచ్చన హుస్సేన్, వెంకటనర్సమ్మతోపాటు మరికొంతమంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ డిప్యూటీ తాసిల్దార్ దామోదర్‌ను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ నెల 11వ తేదీన గ్రామంలో పర్యటించి సర్వేచేస్తామని డిప్యూటీ తాసిల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## రోబోథాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- సృజనాత్మకతను ప్రదర్శించేందుకు అవకాశం
- విజేతలకు రూ.లక్ష వరకు బహుమతులు
- లోగోను ఆవిష్కరించిన ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్



రోబోథాన్-2020 పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సాంకేతిక అక్షరాస్యతలో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టాలనే లక్ష్యంతోపాటు రాష్ట్రంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్న తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) మరో కీలక కార్యక్రమాన్ని చేపట్టింది. నూతన రంగాల్లో సృజనాత్మకతను ప్రదర్శిస్తే విజేతలకు రూ.లక్ష వరకు నగదు బహుమతులతోపాటు అంతర్జాతీయ రోబోటిక్ అవకాశం కల్పించేందుకు 'రోబోథాన్-2020'ని ప్రకటించింది. నేషనల్ సైన్స్ డే సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 28న ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. 'రోబోథాన్-2020' లోగోను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ సోమవారం ఆవిష్కరించారు. ఉత్సాహవంతులు పోటీలో పాల్గొని తమ సత్తాను చాటుకోవాలని సూచించారు. 2020 సంవత్సరాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో టీటా రోబోథాన్‌ను చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. రోబోథాన్-2020 టీటా డిజిథాన్ గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ.. సామాజిక సమస్యలకు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృజనాత్మక పరిష్కారం అనే ఎజెండాతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. 12 ఏండ్ల పైచిలుకువారికి ఇందులో అవకాశం కల్పిస్తున్నామని, bit.ly/robothon 2020 లింక్ ద్వారా ఔత్సాహికులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 6300368705, 8123123434 నంబర్ల ద్వారా కూడా సమాచారం పొందవచ్చని సూచించారు. లోగో ఆవిష్కరణలో సౌమ్య కునిశెట్టి, పూజ, శ్రీనివాస్ పిల్లి, వినయ్ దాసరి, రమ్య, ప్రదీప్, నీలగిరి, నితీశ్, వివేక్, విక్రం, ఇలియాస్, హారిక తదితరులు పాల్గొన్నారు.

## తనువు చాలించిన ప్రేమజంటలు

రంగారెడ్డి జిల్లాలో ఘటనలు



పల్లవి, మహేందర్, శ్రీరాములు, సుశీల (ఫైల్)

**షాబాద్, నమస్తే తెలంగాణ:** రెండు ప్రేమ జంటలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నాయి. షాబాద్ మండలం లింగారెడ్డి గూడకు చెందిన మహేందర్ (22), పల్లవి (19) రెండేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. కొద్దిరోజుల కిందట వీరి ప్రేమ విషయం ఇరువురు కుటుంబసభ్యులకు తెలిసింది. దీంతో మరోసారి కలువొద్దని ఇద్దరినీ హెచ్చరించారు. మనస్తాపానికి గురైన మహేందర్, పల్లవి సోమవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లి చెట్టుకు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మరో ఘటనలో కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన నాగిళ్ల శ్రీరాములు (23), సుశీల (19) ప్రేమించుకుంటున్నారు. సామాజికవర్గాలు వేరుకావడంతో ఆదివారం రాత్రి యువతి కుటుంబసభ్యులు సుశీలను మందలించారు. ప్రేమను కుటుంబసభ్యులు అంగీకరించడంలేదని సుశీల అర్ధరాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయం ప్రియురాలి మరణవార్త విన్న శ్రీరాములు.. జీర్ణించుకోలేక గ్రామం వెలుపల చెట్టుకు ఉరి వేసుకుని ప్రాణాలు విడిచాడు. వేర్వేరు ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రొబేషనరీ సబ్ రిజిస్ట్రార్లకు నియామకపత్రాలు అందజేస్తున్న సోమేశ్‌కుమార్, చిరంజీవులు

## ప్రొబేషనరీ సబ్ రిజిస్ట్రార్లకు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖలో కొత్తగా నియమితులైన 23 మంది ప్రొబేషనరీ సబ్‌రిజిస్ట్రార్లకు రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనరేట్‌లో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. శిక్షణను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. చట్టాలు తెలుసుకొని, క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా అధ్యయనం చేసేలా శిక్షణను రూపొందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సోమేశ్‌కుమార్, కమిషనర్ చిరంజీవులు సబ్‌రిజిస్ట్రార్లకు నియామకపత్రాలను అందించారు. కార్యక్రమంలో అదనపు ఐజీ వెంకట్ రాజేశ్, డీఐజీలు సుభాషిణి, సైదిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.




## తల్లిని కొట్టి చంపిన కొడుకు

మద్యం మత్తులో ఘాతుకం

రంగారెడ్డి జిల్లాలో ఘటన

**షాద్‌నగర్, నమస్తే తెలంగాణ:** మద్యానికి బానిసైన ఓ కుమారుడు.. కన్న తల్లిని రోకలిబండతో కొట్టి చంపాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కంసాన్‌పల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. బైండ్ల వెంకటమ్మ (60).. కుమారుడు నర్సింహులుతో కలిసి గ్రామంలో ఉంటున్నది. తాగిన మైకంలో భార్యపై గొడ్డలితో దాడిచేసి జైలుపాలైన నర్సింహులు.. జైలు నుంచి తిరిగి వచ్చినా మద్యాన్ని మానలేదు. తల్లి వెంకటమ్మతో తరచూ గొడవపడుతుండేవాడు. ఆదివారం మద్యం తాగి వచ్చి తల్లితో మరోసారి గొడవపడ్డాడు. ఇంట్లో నిద్రిస్తున్న వెంకటమ్మను రోకలిబండతో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.




చలికాలం వచ్చిందంటే ప్రజలు బయటకు రావాలంటే జంకుతుంటారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో చలి తీవ్రత పెరుగుతున్నది. సాయంత్రం ఐదు గంటలకే చలి అధికమవుతున్నది. శీతాకాలంలో ప్రజలు, చిన్నారులు, వృద్ధులు చలి నుంచి బయట పడేందుకు ఉన్ని దుస్తులు, మంకీ క్యాప్‌లు, మాస్కులు, శాలువాలు కొనుగోలు చేస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో చిన్నారులు మంటలు వేసుకుని వెచ్చదనం పొందుతున్నారు.




నేవీ డే ఉత్సవాలను పురస్కరించుకొని విశాఖ ఆర్కే బీచ్‌లో నౌకాదళం చేపట్టిన రిహార్సల్స్ అబ్బురపరిచాయి. సముద్రాన్ని చీల్చుకుంటూ దూసుకొచ్చే జెమినీ బోట్లు.. వినీలాకాశంలో చక్కర్లు కొడుతూ త్రివర్ణ పతాకంతో దిగివచ్చిన స్కైడైవర్లు.. శత్రు నౌకలపై దాడిచేసి మెరుపువేగంతో వెళ్లిపోయే సీ కింగ్ హెలికాప్టర్లు.. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. కళ్లు చెదిరే విన్యాసాలతో కదనరంగాన్ని తలపించి విశాఖపట్నం ఆర్కే బీచ్ పరిసరాల్లో వాతావరణం వేడెక్కింది.

నమస్తే తెలంగాణ
# జిందగీ
మంగళవారం 3 డిసెంబర్ 2019 WWW.NTNEWS.COM /nt.zindagi



ఆఫీసులో భోజనం చేయగానే కండ్లు మూతలుపడుతుంటాయి. తప్పని పరిస్థితిల్లో కండ్లు నలుపుకుంటూ పనిలో మునిగిపోతున్నారా? అయితే.. ఈ ఉద్యోగంలో చేరండి. రాత్రి 9 గంటలు నిద్రపోండి. 100 రోజులు. రూ. లక్ష గెలుచుకోండి. ఇది ఎక్కడంటే..

## బాగా నిద్రపోతారా? రూ.లక్ష గెలుచుకోండి!

అబ్బా.. రోజంతా నిద్రపోయే జాబ్ ఉంటే ఎంతబాగుండు. జపాన్‌లో కాసేపు పడుకోవడానికి కూడా టైం ఇచ్చినట్లుగా మన ఆఫీసులో కూడా కొంచెం సేపు నిద్రపోండని చెబితే ఎంత బాగుండు. ఎప్పుడూ అనుకోవడమే గాని ఏనాడు ఏ యజమానీ చెప్పలేదు. ఇలా ఎవరో అనుకుంటున్న సమయంలో దేవతలు తథాస్తు అని ఉంటారు కాబోలు. బెంగళూరుకు చెందిన ఓ స్టార్టప్ సంస్థ 'రండి నిద్రపోండి.. రూ. లక్ష అందుకోండి' అంటూ ఉద్యోగం ఆఫర్ చేస్తున్నారు. దేవుడా..! అనుకోగానే దేవుడు వరం ప్రసాదించినట్లు ఉందీ ఉద్యోగం. రోజుకు ఎనిమిది గంటలే కాకుండా గొడ్డు చాకిరీ చేపించుకునే సంస్థలను చూశాం కాని ఇలా నిద్రపోయే ఆఫర్ ఎప్పుడూ చూడలేదంటున్నారు నెటిజన్లు. అంతేకాదు, ఈ ఉద్యోగంలో భాగంగా రోజూ రాత్రి 9 గంటలు నిద్రపోతే చాలు. అయితే 100 రోజులపాటు తప్పకుండా ఈ డ్యూటీ చేయాలంటున్నారు. స్లీప్ ప్యాట్రన్స్‌పై స్టడీ చేస్తున్న పరుపుల కంపెనీ 'వేక్‌ఫిట్' ఈ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ స్లీప్ ఆఫర్‌కు దేశంలో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు వెబ్‌సైట్ wakefit.co ను సంప్రదించండంటూ సంస్థ డైరెక్టర్ చైతన్య రామలింగ గౌడ చెబుతున్నారు. 100 రోజుల ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కోసం అభ్యర్థులు ప్రత్యేకంగా ఆఫీసుకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఎవరు ఎంత బాగా నిద్రపోగలరో వివరిస్తే చాలు. వారి ఇంటికే కంపెనీ మ్యాట్రెస్, స్లీప్ ట్రాక్స్ పంపుతారు. ఈ ఉద్యోగానికి ఎంపికయ్యే అభ్యర్థులు వారు నిద్రపోయే సమయాన్ని వీడియో తీసి పంపాలని డైరెక్టర్ తెలిపారు.





# దివ్యాంగులకు పెద్దన్న! అన్నదాతలకు అన్న!

**అవమానాల నుంచి ఆలోచన పుట్టింది. ఆ ఆలోచన నుంచి సంఘర్షణ మొదలైంది. ఆ సంఘర్షణే.. పోరాటాలకు నాంది పలికింది. విధి వెక్కిరింతలను జయించాలనే పట్టుదల పెంచింది. ఆ పట్టుదలకు కృషి తోడైంది. దాని ఫలితంగా.. వారు ఎక్కడైతే అవమానాలు పొందారో అక్కడే అభినందనలు, సత్కారాలు అందుకుంటున్నారు. అంతేకాదు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అరుదైన, అనేక సత్కారాలూ పొందుతున్నారు. వారే మన తెలంగాణ బిడ్డలు జ్యోతిగౌడ్, నారా నాగేశ్వరరావు, ఐ.వి. శ్రీనివాసరెడ్డి. ఈసారి 'బెస్ట్ బ్రెయిలీ ప్రెస్' అవార్డు వరించిన జ్యోతిగౌడ్‌ను ఇది వరకే 'జిందగీ' పరిచయం చేసింది. దివ్యాంగులైన ఆమెతో పాటుగా నారా నాగేశ్వరావు, ఐ.వి.శ్రీనివాసరెడ్డి కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పురస్కారాలను నేడు రాష్ట్రపతి చేతులమీదుగా అందుకోబోతున్నారు. అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం సందర్భంగా వీరిద్దరూ తాము చేసిన విశేష కృషిని 'జిందగీ'తో పంచుకున్నారు.**

**వరంగల్** రూరల్ జిల్లాలోని ములుగుకు చెందిన నారా నాగేశ్వరరావు.. నేడు ఈ స్థాయికి చేరుకోవడానికి నాడు ఆయన చేసిన పోరాటాలు, కృషి.. సాధించాలనే పట్టుదలే కారణం. ఇవాళ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా రోల్ మోడల్ విభాగంలో అవార్డు అందుకోబోతున్న నారా నాగేశ్వరరావు.. చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలు అనుభవించారు. రెండేండ్లప్పుడే పోలియో సోకడంతో కాళ్లు చచ్చుబడ్డాయి. అయినా చదువుకోవాలనే పట్టుదలతో రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. తర్వాత ఏపీ రెసిడెన్షియల్‌లో సీటు సంపాదించి టెన్త్ డిస్టింక్షన్‌లో పాసయ్యారు. డాక్టర్ అవ్వాలనే లక్ష్యంతో ఇంటర్ చేసేందుకు సిద్ధమవుతుండగా.. దివ్యాంగులకు రిజర్వేషన్లు లేవని, ఆర్థిక ఇబ్బందులొస్తాయని తెలిసినవాళ్లు చెప్పడంతో ఎంపీసీ చేశారు. గండిపేట సీబీఐటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదివి.. అనంతరం జేఎన్‌టీయూ నుంచి ఎంబీఏ, ఓయూ నుంచి ఎల్ఎల్‌బీ ప్రథమ శ్రేణిలో పాసయ్యారు. ఇలా చదువంతా ప్రభుత్వ దివ్యాంగ సదనాల్లో ఉంటూ చదువుకున్నారు.

### అనుకూలంగా మలుచుకోవాలి..



దివ్యాంగులు ఏ విషయంలోనూ కృంగిపోకుండా.. పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోవాలి. కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయపథంలో దూసుకెళ్తారు. నాకు హెలెన్ కెల్లర్ స్ఫూర్తి. ఆమెలోని పట్టుదల నాలో ధైర్యాన్ని పెంచాయి. నేడు అందుకుంటున్న ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. ఇదే స్ఫూర్తితో దివ్యాంగుల హక్కుల సాధికారత కోసం కృషి చేస్తా. రాష్ట్రంలోని దివ్యాంగులను నిర్లక్ష్యం చేయకుండా.. ప్రభుత్వాలు ఆదరించాలి.

**- నారా నాగేశ్వరరావు,**
రోల్‌మోడల్ జాతీయ పురస్కారం గ్రహీత.

### సరైన చట్టాలు లేక ఇబ్బందులు

ఆ కాలంలో దివ్యాంగులకు సరైన చట్టాలు లేకపోవడం, ఉన్నా వాటిలో వారికి ప్రాధాన్యం లేకపోవడంతో ఉద్యోగం కోసం చాలా ఇబ్బందులు పడ్డారు నాగేశ్వరరావు. ఒకవైపు చదువుకున్న దివ్యాంగులు ఎక్కువైపోవడంతో నిరుద్యోగం బాగా పెరిగిపోయింది. ఈ క్రమంలో 1998లో 11 యూనివర్సిటీల్లో దివ్యాంగులను ఒక చోటుకి చేర్చి.. ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఉద్యోగాలు సాధించుకునేందుకు 'నిరుద్యోగ వికలాంగుల సంఘం' స్థాపించారు. ఆ సంఘానికి నాగేశ్వరరావు ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆ సంఘం ద్వారా పోరాటాలు చేసి, రాజకీయ నాయకులు, ఉన్నతస్థాయి ఐఏఎస్, ఐపీఎస్‌ల మద్దతు కూడగట్టుకున్నారు. శాంతియుతంగా పోరాటాలు చేసి 'జీఓ ఎంఎస్ నంబర్ 9' వచ్చేలా కృషి చేశారు. ఆ జీఓ ఫలితంగా 7,500 మంది దివ్యాంగులకు ఉద్యోగాలొచ్చాయి. 2002లో టీటీసీతో సంబంధం లేకుండా 750 మంది దివ్యాంగులకు టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసేలా జీఓ తీసుకురావడంలో కీలకంగా పనిచేశారు నాగేశ్వరరావు. దివ్యాంగులకు కూడా స్టడీ సర్కిల్ తీసుకురావడంలో విశేషంగా కృషి చేశారు. దివ్యాంగ ఉద్యోగుల్లో ప్రమోషన్స్ కోసం 'జీఓ ఎంఎస్ నంబర్ 42'ను సాధించారు. ఎంతోమంది విధివంచిత, దివ్యాంగ బాలలను ప్రభుత్వం నిర్వహించే సంస్థల్లో చేర్పించారు.

వెలుగు పథకం (ఇందిరా క్రాంతి)లో మహిళా గ్రూపులతో పాటుగా దివ్యాంగుల ప్రాజెక్ట్‌ను చేర్చడానికి నియమించిన కమిటీలో సభ్యుడిగా, మూడు శాతం రిజర్వేషన్ సాధించడానికి కృషిచేసి టాస్క్‌ఫోర్స్ కమిటీలో సభ్యుడిగా కొనసాగారు. వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం తెలంగాణలో రూల్స్ తయారు చేయడానికి నియమించిన 'తెలంగాణ స్టేట్ రూల్స్ ఫాములేషన్ కమిటీ'లో సభ్యుడిగా కీలకంగా వ్యవహరించారు నాగేశ్వరరావు. ప్రస్తుతం 'బాలల సంరక్షణ సంఘం' కమిటీలో సభ్యుడిగా, రాష్ట్రస్థాయి వికలాంగుల అడ్వైజరీ బోర్డులో మెంబర్‌గా, శిశు గృహాలను తనిఖీ, లైసెన్స్ మంజూరీ కమిటీలో సభ్యుడిగా, దివ్యాంగుల ఓటు హక్కు వినియోగం కోసం.. ఈసీ నియమించిన కోర్ కమిటీలో సభ్యుడిగా కొనసాగుతున్నారు.

### జాతీయస్థాయిలో అవార్డులు..

నారా నాగేశ్వరరావు నిస్వార్థ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు ఆయన్ను వరించాయి. 'జాతీయ యువజన అవార్డు 2005-6'ను అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా అందుకున్నారు. యువజనులకు చేసిన సేవలకు గాను.. ఈ అవార్డు వరించింది. దివ్యాంగులకు చేసిన సేవలకు గాను.. 'జాతీయ హెలెన్ కెల్లర్ అవార్డు 2003'ను అప్పటి డిప్యూటీ స్పీకర్ శివరాజ్ పాటిల్ చేతులమీదుగా అందుకున్నారు. 'జాతీయ ఉత్తమ వ్యక్తి అవార్డు-2014'ను అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతులమీదుగా అందుకున్నారు. ఇవేకాకుండా రాష్ట్రస్థాయిలో 'బెస్ట్ సోషల్ వర్కర్', 'బెస్ట్ గోల్డ్ షీల్డ్ అవార్డు', 'బెస్ట్ యూత్ అవార్డు' వంటివి అందుకున్నారు. ఈరోజు 'నేషనల్ రోల్ మోడల్ అవార్డు 2019'ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అందుకోనున్నారు. అప్పట్లో నాగేశ్వరరావు చదివిన కంప్యూటర్ ఇంజినీరింగ్‌కు అమెరికాలో ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. దివ్యాంగ సమాజం కోసం వాటన్నిటినీ వదులుకున్నారు. ఇలా 20 యేండ్లుగా పోరాటం చేస్తున్నారు.

### ఇవికూడా చేస్తే బాగుంటుంది

- దివ్యాంగులకు రిజర్వేషన్ల శాతం 4 నుంచి 7 శాతం పెంచాలి.
- 21 రకాలుగా ఉన్న దివ్యాంగుల్లో.. మన రాష్ట్రంలో ఎంతమంది జనాభా ఉన్నదనేది లెక్కలు లేవు. కాబట్టి దివ్యాంగుల జనాభాను లెక్కించేందుకు చర్యలు చేపట్టాలి. దానివల్ల సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయి.
- దివ్యాంగులకు సంక్షేమ శాఖ, ప్రత్యేక కమిషన్‌ను నియమించాలి.
- మానసిక వికలాంగులకు ప్రభుత్వం ప్రత్యేక గురుకులాలు నిర్మించాలి.
- దివ్యాంగులకు నిరుద్యోగ భృతి కూడా ఇవ్వాలి.
- సామాజిక వర్గాల వారీగా దివ్యాంగులకు సబ్‌ప్లాన్ తీసుకురావాలి.
- తీవ్ర వైకల్యం ఉన్నవారి కోసం ప్రత్యేక పథకాలు రూపొందించాలి.
- దివ్యాంగులకు రోస్టర్ పాయింట్లు తగ్గించాలి. మొత్తం 20 లోపు ఉండేలా కుదించాలి.
- దివ్యాంగులకు యాదగిరి గుట్టలో ప్రత్యేక ఆస్పత్రి నిర్మిస్తే బాగుంటుంది.

**చిన్నప్పుడే** పోలియో సోకి కాళ్లు నడవలేని స్థితికి చేరాయి. స్నేహితులు, చుట్టుపక్కల వారు ఎగతాళి చేసినా పట్టుదలతో చదివి పదిమందితో శభాష్ అనిపించుకున్నారు శ్రీనివాసరెడ్డి. ఉద్యోగంలో చేరిన కొత్తలో వికలాంగుడు ఏమి చేయగలడని అంతా ఆట పట్టించారు. అయినా వెనుకడుగు వేయ లేదు. నమ్మిన సిద్ధాంతాలను వదలలేదు. అందుకే రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఉద్యాన విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి.. ఇవాళ రాష్ట్రపతి చేతుల మీదుగా 'లోకో మోటర్ డిజేబులిటీ' అవార్డును అందుకోబోతున్నారు.

గుంటూరు జిల్లాలోని ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో 1979లో జన్మించిన శ్రీనివాసరెడ్డి.. ఉద్యోగరీత్యా తెలంగాణలోనే ఉంటున్నారు. చదువుతోనే వ్యక్తిగతంగాను, సామాజికంగా అభివృద్ధి సాధించడంతోపాటు... తాను అనుకున్న లక్ష్యాన్ని అందుకోగలనని ఆయన నిర్ణయించుకున్నారు. అందుకోసం నిరంతరం కృషి చేశారు. నడవాలంటే మరో మనిషి సాయం కావల్సిన స్థితిలోనూ పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2007లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వ్యవసాయ కళాశాలలో చేరిన శ్రీనివాసరెడ్డి అనతికాలంలోనే తన ప్రతిభతో విద్యార్థులు, ఆచార్యుల మన్ననలు పొందారు. తన ఆలోచనా విధానాన్ని పదిమందికీ పంచుతూ రైతుల్లో నిత్య చైతన్య దీపికలు వెలిగిస్తున్నారు.

### తెలంగాణ ప్రభుత్వం వచ్చాక..



టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపారు. రూ.500 ఉన్న పెన్షన్‌ను రూ.3016కు పెంచి.. వయసుతో, వైకల్య శాతంతో నిమిత్తం లేకుండా ఇవ్వడం చాలా ధైర్యవంతమైన ఆలోచన. ప్రతియేటా వికలాంగుల సంక్షేమానికి రూ.920 కోట్లను కేటాయించడం హర్షణీయం. దివ్యాంగుల కోసం వీల్‌చైర్ల పంపిణీ, డిజిటల్ క్లాస్ రూంలు, ఎంపీ3 ప్లేయర్లు, 4జీ ఫోన్లు ఇచ్చారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా దివ్యాంగుల సంక్షేమంలోనే రాష్ట్రం రెండోస్థానంలో ఉన్నది.

**- డాక్టర్ ఐ.వి.శ్రీనివాసరెడ్డి,**
లోకోమోటర్ పురస్కార గ్రహీత

### రైతులకు సుపరితం...

దివ్యాంగుడిగా ఉన్న శ్రీనివాసరెడ్డి 200కు పైగా రైతు సదస్సుల్లో ముఖ్యవక్తగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటిపంటలు వేస్తే.. లాభసాటిగా ఉంటాయో వివరించేవారు. పురుగుమందుల వాడకం, కొత్త వంగడాలు, భూసార పరీక్షలు వంటి వాటిపై నిత్యంతో రైతులతో చర్చించేవారు. వివిధ పత్రికలు, జాతీయ, అంతర్జాతీయ పుస్తకాల్లో 100కు పైగా వ్యాసాలు, పదుల సంఖ్యలో టీవీ, రేడియో కార్యక్రమాలతో రైతులకు దగ్గరయ్యారు. తొమ్మిదేండ్లపాటు ప్లేస్‌మెంట్ సెల్ బాధ్యుడిగా శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో.. సుమారు 250 మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారు. ఏఈఎల్ఫీ డైరెక్టర్‌గా కొనసాగుతున్న శ్రీనివాసరెడ్డి 'స్పైసీ ఇండియా' మ్యాగజైన్‌కు సంపాదకుడిగానూ పని చేస్తున్నారు.

### ఔషధ మొక్కలపై పరిశోధనలు

రాష్ట్రంలో ఔషధ మొక్కల స్థితిగతులు, ఉపయోగాలపై పలురకాల ప్రాజెక్టులు చేపట్టారు శ్రీనివాసరెడ్డి. సుమారు రూ. 50లక్షల విలువచేసే ప్రాజెక్టులు కళాశాలకు తెచ్చి వాటిపై పరిశోధనలు చేశారు. ఖమ్మం జిల్లాలో బయోడైవర్సిటీపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు ఐవీఎస్ రెడ్డి. 28 పరిశోధనా వ్యాసాలను వివిధ అంతర్జాతీయ, జాతీయ సెమినార్లు, కాన్ఫరెన్సులలో సమర్పించారు. ఇవేగాక 102 రైతు శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని అనేక వేలమంది రైతులను చైతన్య పరిచారు. ఉద్యాన - పంటల్లో నూతన సాగు విధానాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తున్న డాక్టర్ ఐ.వి. శ్రీనివాసరెడ్డి అన్నదాతలకు సుపరిచితులే.

### అందుకున్న అవార్డులు


ఐవీ శ్రీనివాసరెడ్డి మాజీ గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా ఈ ఏడాది ఆగస్టు 10న 'ఉత్తమ విద్యాబోధకుడి'గా పురస్కారాన్ని అందుకున్నారు. 2016 జులైలో వీనస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో 'ఉత్తమ ఫ్యాకల్టీ' పురస్కారాన్ని చెన్నైలో అందుకున్నారు. 2018 జూన్ 2న నాటి మంత్రి పద్మారావు చేతులమీదుగా 'ఉత్తమ ఆచార్యుడిగా, ఉద్యాన శాస్త్రవేత్తగా' పురస్కారాన్ని పొందారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో 2018లో గురుపూజోత్సవం సందర్భంగా మాజీ ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి చేతులమీదుగా 'ఉత్తమ ఆచార్యుడి'గా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ విభాగాల్లో అనేక ఉత్తమ ఫలితాలను సాధించి.. అందరి మన్ననలు పొందారు ఐవీఎస్ రెడ్డి.

*... డప్పు రవి*

---

**అడుగండి చెబుతా**

## ఎముకల నొప్పికి కారణమేంటి?



**నా వయసు 62 సంవత్సరాలు. నాలుగేండ్లుగా ఎముకల నొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నాను. డాక్టర్ దగ్గరికి వెళ్తే ఏవో మందులు ఇచ్చారు. జాగ్రత్తగా ఉండకపోతే ఎముకలు విరిగే అవకాశం ఉంటుందన్నారు. టాబ్లెట్లు వాడుతున్నాను. నాకు ఎముకలు విరిగేంత సమస్య ఏమి వచ్చింది? ఇప్పుడు వాడుతున్న మందులతో సమస్య పోతుందా?**

**- రాజమణి,** నర్సంపేట

మీకు ఆస్టియోపోరొసిస్ అనే సమస్య ఉంది. నెలసరి రావడం ఆగిపోయిన మహిళల్లో ఈ సమస్య సర్వసాధారణంగా కనిపిస్తుంది. నెలసరి ఆగిపోవడంతో స్త్రీ హార్మోన్లు తగ్గిపోతాయి. ఈస్ట్రోజన్ లెవల్స్ తగ్గడం వల్ల ఎముకలపై ప్రభావం పడి, ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. దాంతో ఎముకలు గుల్లబారి పెళుసుగా తయారవుతాయి. అందువల్ల ఏ చిన్న దెబ్బ తగిలినా విరిగేందుకు ఆస్కారం ఉంటుంది. అందుకే మిమ్మల్ని కింద పడకుండా జాగ్రత్తగా ఉండమని చెప్పారు. ఈ సమస్య ఉన్నప్పుడు కాల్షియం థెరపీ ఇస్తారు. అంటే కాల్షియం టాబ్లెట్లను సప్లిమెంట్లుగా తీసుకోవాల్సి ఉంటుంది. విటమిన్ డి కూడా తీసుకోవడం వల్ల కాల్షియం శోషణ పెరుగుతుంది. కొందరికి ఈస్ట్రోజన్ రీప్లేస్‌మెంట్ థెరపీ కూడా అవసరం అవుతుంది. టెరిపారైడ్ అనే మందును కూడా ఆస్టియోపోరొసిస్‌కి వాడుతారు. ఇది పారాథైరాయిడ్ హార్మోన్ రూపం. ఇది ఎముకల నిర్మాణానికి ఉపయోగపడుతుంది. ఈ మందులు వాడడం వల్ల గుల్లబారిన ఎముకల సాంద్రత పెరుగుతుంది. ఆస్టియోపోరొసిస్ వల్ల ఎముకలు విరిగే పరిస్థితి ఉన్నవారికి ఇది చాలా మంచి మందు. కాంబినేషన్ డ్రగ్ థెరపీ కూడా ఆస్టియోపోరొసిస్‌కి మంచి పరిష్కారం చూపుతుంది.

**డాక్టర్ రత్నాకర్ రావు**
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్



### వంటింటి చిట్కాలు



- కారం ఎక్కువైన కూరల్లో రెండు టమాటాలు వేసి ఉడకబెడితే కారం తగ్గుతుంది.
- ఉప్పు ఎక్కువైన కూరల్లో బంగాళదుంప ముక్కలు వేసి కాసేపయ్యాక తీస్తే ఉప్పును ముక్కలు పీల్చుకుంటాయి.
- కూరగాయల్లో చింత పండురసం వేయాలనుకుంటే కూరలు ఉడికిన తర్వాత చివరగా వేయాలి.
- అల్లం ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే తడి వస్త్రంలో చుట్టి పెట్టాలి.
- పచ్చిటమాటాలు త్వరగా పండాలంటే వాటికి రెండు పండు టమాటాలు వేస్తే సరి.
- కాకర కాయలు నిలువగా కోసి పెడితే త్వరగా పండవు.
- టమాటాలను ఉప్పు నీటిలో వేసి ఉంచితే తాజాగా ఉంటాయి.

## జామ ఆకులతో అందం.. ఆరోగ్యం



**ఇప్పటివరకు క్రీమ్స్, ఇతర రసాయన పదార్థాలతో అందాన్ని పొందారు. పండ్లు, వంటింటి సామగ్రితో ఇంకా కొందరు బ్యూటీ టిప్స్ ట్రై చేశారు. కానీ ఆకులతో కూడా అందాన్ని రెట్టింపు చేసుకోవచ్చు. అదెలాగంటే...**

- జామ ఆకులు బ్లాక్ హెడ్స్ సమస్యల్ని దూరం చేస్తాయి. కొన్ని జామ ఆకుల్ని తీసుకొని వాటిని నీటిలో మరిగించాలి. తర్వాత కొద్దిగా పసుపు కలిపి మెత్తని ముద్దగా నూరి ముఖానికి పట్టించి మర్దన చేయాలి. ఆ తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తే బ్లాక్ హెడ్స్ తొలిగిపోతాయి.
- జామ ఆకుల్ని మెత్తగా నూరి కొద్దిగా పసుపు, రోజ్ వాటర్ కలిపి రోజూ రాత్రి పడుకునే ముందు ముఖానికి పట్టించాలి. జామ ఆకుల్లో ఉండే బ్యాక్టీరియా మొటిమలను కలుగజేసే కణాలను రాకుండా చేస్తుంది. చర్మంపై ఉండే నల్లని మచ్చలు, మరకల్ని తొలగిస్తుంది.
- జామ ఆకులు ముఖంపై వచ్చే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి. తరచూ జామ ఆకుల ముద్దను ఫేస్ ప్యాక్‌గా వాడేవారికి ముఖంపై ముడతలు రావు. వయసు పైబడినట్లుగా కనిపించకుండా అందంగా కనిపిస్తారు. జామ ఆకులను ముద్దగా చేసి ఆ రసాన్ని ముఖంపై రోజూ రాత్రి నిద్రించే ముందు రాసుకోవచ్చు.
- జామ ఆకుల్ని నీటిలో మరిగించి ఉప్పును కలిపితే వచ్చిన ద్రావణాన్ని నోటి శుభ్రతకు వాడాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తే నోటి దుర్వాసన పోతుంది. జామ పుల్లలతో పళ్లు తోముకుంటే చిగుళ్ల సమస్యలు నయమవుతాయి.

నమస్తే తెలంగాణ

# జీవనరేఖ

[ కరీంనగర్ ]

మంగళవారం 3 డిసెంబర్ 2019



నొప్పి కలుగడానికి సవాలక్ష కారణాలుంటాయి. ఏ కారణం వల్ల నొప్పి వస్తున్నదో తెలుసుకుంటే దాన్ని తగ్గించడం సులువవుతుంది. కాని కొన్ని సార్లు నొప్పి రావడానికి ఏది కారణమవుతున్నదో తెలుసుకోవడం కష్టమవుతుంది. అందువల్ల చికిత్స పక్కదారి పడుతుంది. నరేశ్ విషయంలో అదే జరిగింది. నడుంనొప్పి విషయంలో కూడా కొన్నిసార్లు ఇలాగే అవుతుంది. నడుములో నొప్పి రావడానికి నరాల్లో సమస్య ఉండొచ్చు. ఎముకకు సంబంధించిన సమస్య కావొచ్చు. లేదా కేవలం కండరంలోనే ఇబ్బంది ఉండొచ్చు. ఇలాంటప్పుడు నడుమునొప్పి వస్తే న్యూరాలజిస్టు, ఆర్థోపెడిక్ డాక్టర్లలో ఎవరిదగ్గరికని వెళ్తారు? అదేవిధంగా కీళ్ల నొప్పులు ఆస్టియో ఆర్థరైటిస్ వల్ల వస్తే ఆర్థోపెడిక్ డాక్టర్ దగ్గరికి వెళ్లాలి. ర్యుమటాయిడ్ ఆర్థరైటిస్ వల్ల వస్తే ర్యుమటాలజిస్ట్ దగ్గరికి వెళ్లాలి. ఈ తేడా పేషెంటు కనుక్కోవడం కష్టం. ఎక్కడికి వెళ్లాలా అని తికమక పడ్తారు. ఇలాంటి గందరగోళానికి పరిష్కారమే పెయిన్ డాక్టర్. నొప్పి కీళ్లు, ఎముకలకు సంబంధించిందా..? నరాలకు సంబంధించిందా..? లేక ర్యుమాటిక్ (ఆటోఇమ్యూన్) కారణాలేమైనా ఉన్నాయా అని అన్ని కోణాల్లో విశ్లేషించి, దానికి అనుగుణంగా చికిత్స చేస్తారు పెయిన్ డాక్టర్లు. అలా పెయిన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్ స్టార్ట్ అయింది. నొప్పి ఏ కారణం వల్ల వచ్చినప్పటికీ దానికి చికిత్స చేయగలుగుతారు పెయిన్ డాక్టర్లు.

## పెయిన్ మేనేజ్‌మెంట్ క్లినిక్..



ఇప్పుడు చాలా హాస్పిటల్స్ నొప్పి తగ్గించడానికి ప్రత్యేక డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాయి. ఈ డాక్టర్ల బృందంలో పెయిన్ స్పెషలిస్టుతో పాటుగా ఆర్థోపెడిక్, న్యూరోఫిజీషియన్, న్యూరోసర్జన్, ర్యుమటాలజిస్టు, సైకాలజిస్టు ఉంటారు. 3 నెలల కన్నా ఎక్కువ రోజులు నొప్పి బాధిస్తూ ఉంటే పెయిన్ మేనేజ్‌మెంట్ క్లినిక్‌లో డాక్టర్‌ని కలవాలి.

## పెయిన్ మేనేజ్‌మెంట్‌లో ఎన్ని రకాల చికిత్సలుంటాయి?

- మెడికల్ మేనేజ్‌మెంట్. అంటే పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు ఇస్తారు.
- వ్యాయామం, ఫిజియోథెరపీ, బరువు తగ్గడం
- బలమైన పెయిన్ కిల్లర్లు ఇవ్వడం.
- నర్వ్ బ్లాక్స్ లేదా నర్వ్ పెయిన్ రిలీవింగ్ ఇంజెక్షన్లు – ఇవి నొప్పిని తీసుకెళ్లే నరాల్లో సమాచార ప్రసారాన్ని కట్ చేస్తాయి.
- రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నిక్
- క్రయోథెరపీ–మజిల్, లిగమెంట్‌లలో సమస్య ఉన్నప్పుడు వాడుతారు.
- పిఆర్‌పి ఇంజెక్షన్లు
- ఓజోన్ ఇంజెక్షన్లు – డిస్క్‌లోకి ఇస్తారు. కేవలం నొప్పి మాత్రమే ఉంటే చిన్న డోస్‌లో ఇస్తారు. దాంతో డిస్క్ కుంచించుకుపోతుంది.
- ఎండోస్కోపిక్ డిస్క్ ప్రొసీజర్లు – ఎండోస్కోపీ ద్వారా చిన్న రంధ్రం ద్వారా అదనంగా పెరిగిన డిస్క్‌ను తీసేస్తారు. దీన్ని డిసెక్టమీ అంటారు. పెయిన్‌తో పాటు అక్కడ మొద్దుబారిపోయి కూడా ఉన్నా, డిస్క్ పెద్దగా ఉన్నా ఈ చికిత్స చేస్తారు.

## సైడ్ ఎఫెక్టులుంటాయా?




నోటి ద్వారా వేసుకునే టాబ్లెట్లకు సైడ్ ఎఫెక్టులు ఉండే అవకాశం ఉంది. కానీ వీటిని అతి తక్కువ సమయం అంటే 7 రోజుల వరకు మాత్రమే వాడుతారు. కాబట్టి దుష్ప్రభావాలు పెద్దగా ఉండవు. ఇంజెక్షన్లకు సైడ్‌ఎఫెక్టులేమీ ఉండవు. వీటిని షార్ట్ టర్మ్‌లో ఒకేసారి ఇస్తారు. నోటి మాత్రలను 3నెలల కన్నా ఎక్కువ కాలం వాడితే అసిడిటీ, ఆరు నెలల కన్నా ఎక్కువ వాడితే కిడ్నీ సమస్యలు వస్తాయి. అందుకే సొంతంగా వాడొద్దు.

# 'పెయిన్స్'తో పరేషాన్ కావొద్దు!

*నొప్పికి స్పెషల్ డాక్టరా..? ఆశ్చర్యపోయాడు నరేశ్. గుండెకు, మెదడుకు, పొట్టకు.. ఇలా అవయవాలను బట్టి స్పెషలిస్టు డాక్టర్లు ఉన్నారని తెలుసుగానీ నొప్పికి స్పెషల్ డాక్టర్ ఏంటి..?*

*పెయిన్ స్పెషలిస్టును కలవమని చెప్పిన స్నేహితుడి మాటలకు ఆలోచనలో పడ్డాడు నరేశ్. అతనికి తలనొప్పి చాలా రోజులుగా బాధపెడుతోందని న్యూరాలజిస్టు దగ్గరికి వెళ్లాడు. లక్షణాలను బట్టి అది మైగ్రేన్‌గా భావించి చికిత్స ప్రారంభించారు న్యూరాలజీ డాక్టర్. ఎన్ని రోజులు మందులు వాడినా నొప్పి తగ్గడం లేదు. దాంతో స్నేహితుడి సలహా మీదట పెయిన్ స్పెషలిస్టు దగ్గరికి వెళ్లాడు. అప్పటిదాకా మైగ్రేన్‌గా భావించిన ఆ నొప్పికి కారణం మెడ నరాల్లో ఉందని తేలింది. పెయిన్ మేనేజ్‌మెంట్ చికిత్సతో ఇప్పుడు నరేశ్ నొప్పి తగ్గి హాయిగా ఉన్నాడు.*

## పెయిన్ మేనేజ్‌మెంట్‌తో నొప్పులు దూరం

**నొప్పి..** ఒక లక్షణం.. మన శరీరంలో ఏదో ఇబ్బంది ఉందని తెలియజెప్పే సంకేతం. శరీరం నుంచి మెదడుకు సమాచారాన్ని తీసుకెళ్లే నాడుల్లో నొప్పికి సంబంధించిన సంకేతాలను తీసుకువెళ్లే నాడులు కూడా ఉంటాయి. ఈ చిన్న చిన్న నరాల ద్వారా నొప్పి సంకేతం మెదడుకు చేరినప్పుడు మనకు నొప్పి తెలుస్తుంది. నొప్పి తాత్కాలికంగా కొద్ది రోజులు మాత్రమే ఉండొచ్చు. లేదా దీర్ఘకాలం బాధించవచ్చు. క్యాన్సర్ పేషెంట్లకు కూడా నొప్పులు అధికంగా ఉంటాయి.



### అక్యూట్ పెయిన్

ఒక రోజు నుంచి 3 నెలల లోపు ఉండే నొప్పిని అక్యూట్ పెయిన్ అంటారు. సర్జరీ తరువాత నొప్పి, ఫ్రాక్చర్లు, తలనొప్పులు ఈ కోవలోకి వస్తాయి. వీటికి సింపుల్ పెయిన్ కిల్లర్స్ చాలు. సర్జరీ అయినప్పుడు పెద్ద కోత ఉంటుంది. అది తగ్గడానికి టైం పడుతుంది. అదే విధంగా ఫ్రాక్చర్ అయినప్పుడు విరిగిన ఎముక ఫిక్స్ అయ్యేవరకు టైం పడుతుంది. ఆ గాయం మానేవరకు నొప్పి ఉంటుంది. అపెండిసైటిస్, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, కిడ్నీలో రాళ్లు, అల్సర్ల వంటివి ఉన్నప్పుడు వచ్చే నొప్పి అక్యూట్ పెయినే. ఆపరేషన్ చేస్తే దీని నొప్పి పోతుంది. ఆపరేషన్ తరువాత ఉండే ఏ నొప్పి అయినా అక్యూట్ పెయిన్‌గానే ఉంటుంది. సర్జరీ వల్ల ఏర్పడిన స్కార్ నయమయ్యేవరకు నొప్పి ఉంటుంది. హిస్టరెక్టమీ, మయోమెక్టమీ.. ఇలా ఏ ఆపరేషన్ చేయించుకున్నా ఆ తరువాత ఉండే నొప్పి అక్యూట్ పెయినే. ఇలాంటి నొప్పులకు మైల్డ్ పెయిన్ కిల్లర్స్ చాలు. 7 నుంచి 10 రోజుల వరకు వాడితే సరిపోతుంది. సాధారణంగా సర్జరీ చేసిన వాళ్లే పెయిన్ కిల్లర్లు ఇస్తుంటారు.

### క్రానిక్ పెయిన్

కారణం ఏదైనా సరే 3 నెలల కన్నా ఎక్కువ కాలం నొప్పి ఉంటే దాన్ని క్రానిక్ పెయిన్ అంటారు. సాధారణంగా ఏ కణజాలం అయినా గాయం మానడానికి గరిష్టంగా 3 నెలలు పడుతుంది. 3 నెలల్లోగా ఏ నొప్పి అయినా తగ్గిపోవాలి. అంతకన్నా ఎక్కువ కాలం ఉందంటే అది దీర్ఘకాలిక నొప్పి అవుతుంది. ఈ నొప్పులు 5 రకాలుంటాయి. మెడ నొప్పి, నడుము నొప్పి, భుజం నొప్పి, మోకాలి నొప్పి, పాదం నొప్పి – ప్లాంటార్ ఫేసైటిస్.

### మెడనొప్పి

మెడనొప్పికి ప్రధాన కారణం స్పాండిలైటిస్ లేదా సర్వైకల్ స్పాండిలోసిస్. మెడ నుంచి వచ్చే నొప్పిని స్పాండిలోసిస్ అంటారు. మెడ దగ్గర ఉండే ఎముకలు, లిగమెంట్లు, జాయింట్లు, కండరాలు ఎక్కడైనా సమస్య ఉండొచ్చు. సాధారణంగా మెడలో ఉండే డిస్క్ అనే మెత్తటి గుజ్జులాంటి పదార్థం నరంపై ఒత్తిడి కలిగించడం వల్ల నొప్పి వస్తుంది. ఆస్టియోపోరోసిస్ వల్ల ఎముక బలహీనమై నొప్పి వస్తుంది. మొదట దీనికి మైల్డ్‌గా ఉండే పెయిన్ కిల్లర్లు ఇస్తారు. రెండు మూడు రోజులైనా నొప్పి తగ్గకుంటే బలమైన పెయిన్ కిల్లర్లు ఇస్తారు. ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ వంటి పరీక్షలు చేయిస్తారు. ఎముక సమస్య ఉంటే ఎక్స్‌రేలో తెలుస్తుంది. ఎంఆర్‌ఐలో నరాలు, డిస్క్, లిగమెంట్లు, కండరాలకు సంబంధించిన సమస్యలు తెలుస్తాయి. ఈ పరీక్షలను బట్టి చికిత్స ఉంటుంది. ఈ పరీక్షల ఆధారంగా మూడు రకాల మేనేజ్‌మెంట్ ఉంటుంది. మందులు ఇస్తూ ఫిజియోథెరపీ ఇవ్వడం, ఫిజియోథెరపీతో పాటు ఇంజెక్షన్లు ఇవ్వడం, ఇంట్రామస్కులర్ పెయిన్ కిల్లర్లు కూడా ఇవ్వొచ్చు. కొన్నిసార్లు సర్వికల్ ఎపిడ్యూరల్ కూడా అవసరం పడొచ్చు.

### సర్వికల్ ఎపిడ్యూరల్



మెడలోని వెన్నుపాము భాగంలోకి నొప్పి ఇంజెక్షన్ ఇవ్వడమే సర్వికల్ ఎపిడ్యూరల్. ఇది ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ ఆధారంగా చేసే పెయిన్ ఇంటర్‌వెన్షన్ టెక్నిక్. అంటే ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్‌లలో చూస్తూ మందు పంపిస్తారు. స్క్రీన్ మీద చూస్తూ మందు పంపించడం వల్ల వెన్నుపాములోని నరానికి తగలకుండా సేఫ్‌గా ఇవ్వొచ్చు.

### సర్వికల్ ఫేసెట్ రేడియోఫ్రీక్వెన్సీ ఇంజెక్షన్

ఒక్కోసారి మెడలోని చిన్న చిన్న కీళ్లలో ఉండే కార్టిలేజ్ అరిగిపోవడం వల్ల నొప్పి వస్తుంది. ఇలాంటప్పుడు రేడియోఫ్రీక్వెన్సీ ఉపయోగించి నొప్పి తగ్గిస్తారు. నొప్పి కలిగించే నాడీకణజాలానికి రేడియోఫ్రీక్వెన్సీ తగలగానే అది కాలిపోతుంది. కీళ్ల నుంచి నొప్పికి సంబంధించిన సమాచారాన్ని తీసుకెళ్లే నరాలను ఈ రేడియోఫ్రీక్వెన్సీతో కాల్చేస్తారు.

### ఆక్సిపీటల్ హెడేక్ - మెడవల్ల వచ్చే తలనొప్పి

దీన్ని సాధారణంగా మైగ్రేన్ అనుకుంటారు. మెడ నుంచి తలపైకి నొప్పి ఉంటుంది. ఇది మైగ్రేన్ అనుకుని న్యూరాలజిస్ట్ దగ్గరికి వెళ్తారు. నిజానికి దీనికి మెదడుతో ఎటువంటి సంబంధం లేదు. మెడలోని ఎముకల మధ్య ఉండే చిన్న చిన్న నరాలపై ఒత్తిడి పడడం వల్ల ఈ నొప్పి వస్తుంది. దీన్ని సర్వికోజెనిక్ హెడేక్ అంటారు. దీనికి కూడా రేడియోఫ్రీక్వెన్సీ ద్వారానే ట్రీట్‌మెంట్ ఇస్తారు. ఈ నరాలు మామూలుగా కనిపించవు. కాబట్టి ముందు డై పంపిస్తారు. ఆ తరువాత రేడియోఫ్రీక్వెన్సీ పంపిస్తారు. ఈ ట్రీట్‌మెంట్ ఇవ్వకపోతే ఈ తలనొప్పికి సర్జరీ అవసరం అవుతుంది. సర్జరీ ద్వారా నరాల మీద పడుతున్న ఎముకను కట్ చేసి తీసేస్తారు.



### నడుంనొప్పి

నడుమునొప్పికి సాధారణ కారణం స్ప్రెయిన్. దీనివల్ల నడవలేరు. కూర్చుని లేవలేరు. ఇది అక్యూట్ పెయిన్‌గా కూడా ఉండొచ్చు. సాధారణంగా క్రీడాకారుల్లో కనిపిస్తుంది. నడుమును తిప్పినప్పుడు అంటే అసాధారణంగా పక్కకి తిప్పితే ఈ నొప్పి వస్తుంది. దీనికి తగినంత విశ్రాంతి తీసుకోవడం, ఐస్ ట్రీట్‌మెంట్, మైల్డ్ పెయిన్ కిల్లర్లు సహాయపడుతాయి.

అక్యూట్ డిస్క్ హెర్నియేషన్ నడుమునొప్పికి ప్రధాన కారణం. దీన్నే డిస్క్ ప్రొలాప్స్ అంటారు. వెన్నుపూసల మధ్యలో ఉండే డిస్క్ పక్కకు జారి, నరంపై ఒత్తిడి కలిగించడం దీనికి కారణం. ఇలాంటప్పుడు నడుము నొప్పితో పాటు ఒక కాలి నొప్పి కూడా వస్తుంది.

నడుము నొప్పికి ఫేసెట్ జాయింట్‌లో గాని, సాక్రో ఇలియాక్ జాయింట్‌లో గాని సమస్య ఉండొచ్చు. సాక్రో ఇలియాక్ జాయింట్ మన బరువును కాళ్లపై సమానంగా పడేలా చేస్తుంది. ఇది డ్యామేజి అయితే పిరుదుల్లో నొప్పి వస్తుంది. హైహీల్స్ వాడేవాళ్లకు, ఒక కాలి పొడవు ఎక్కువ ఉండేవాళ్లకు ఇలాంటి సమస్య రావొచ్చు.

ర్యుమటాయిడ్ ఆర్థరైటిస్ పేషెంట్లకు ఆంకైలోసిస్, స్పాండిలైసిస్ లాంటి సమస్యల వల్ల నడుము నొప్పి వస్తుంది. వీళ్లకు కూర్చోవడం కూడా కష్టమవుతుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా చిన్న నరాలకు చికిత్స చేస్తారు.

### ఫెయిల్డ్ బ్యాక్ సర్జరీ సిండ్రోమ్

ఒకసారి వెన్నుపాముకు సర్జరీ చేసిన తరువాత అదే సమస్య మరో చోట రావొచ్చు. సర్జరీ ద్వారా ఎముకను కట్ చేసిన చోట అది బలహీనం కావొచ్చు. అక్కడ స్థిరత్వం పోయి ఒక దగ్గర భారం ఎక్కువ పడుతుంది. దాంతో నొప్పి రావొచ్చు. దీనికి అవసరమైన పరీక్షలు, ఎంఆర్‌ఐ లాంటి టెస్టులు చేసి ఎక్కడ సమస్య ఉందో కనుక్కుంటారు. ఎపిడ్యూరల్ అథెరోలైసిస్ ద్వారా ఎపిడ్యూరల్ ఇంజెక్షన్ ఇస్తారు. సర్జరీ వల్ల ఏర్పడిన స్కార్ కణజాలం వల్ల కూడా నరాలపై ఒత్తిడి పడొచ్చు. ఈ కణజాలాన్ని బ్రేక్ చేయడం ద్వారా చికిత్స ఇస్తారు. ఇంజెక్షన్ ఇస్తే ఇది కరిగిపోతుంది.

### భుజం నొప్పి



భుజంలో నొప్పికి అతి సాధారణ కారణం ఫ్రోజెన్ షోల్డర్. అంటే జాయింట్ ఫ్రీజ్ అవుతుంది. భుజం కీలు ఉండే కండరాలు – రొటేటరీ కఫ్ మజిల్స్ ఫ్రీజ్ అవుతాయి. దీంతో భుజాన్ని ఎటూ కదిలించలేరు. కదిలిస్తే నొప్పి వస్తుంది. ఈ సమస్య ఉన్నప్పుడు జాయింట్‌లోకి ఇంజెక్షన్ ఇచ్చి అధెషన్స్‌ని బ్రేక్ చేస్తారు.

మెడనొప్పి వల్ల కూడా భుజం నొప్పి రావొచ్చు. దీనికి మెడలోని డిస్క్ సమస్య కూడా కారణం కావొచ్చు. భుజంతో పాటు చేయి నొప్పి కూడా ఉంటుంది. నరం, జాయింట్, ఎముక, లిగమెంట్ దేనిలో సమస్య అనేది మ్యాప్ చేసి సరైన చికిత్స ఇస్తారు.

### మోకాలి నొప్పి

సాధారణంగా ఒక వయసు తర్వాత మోకాళ్లనొప్పి అననివాళ్లు ఉండరు. ఈమధ్య కాలంలో చిన్నవయసులోనే మోకాలి కీలు అరిగిపోవడం, నొప్పి చూస్తున్నాం. సాధారణంగా ఆస్టియో ఆర్థరైటిస్ వల్ల మోకాళ్ల నొప్పి వస్తుంది. దీనికి మొన్నటివరకు కీలు మార్పిడి తప్ప మార్గం లేదు. కాని రీప్లేస్‌మెంట్‌కి ఖర్చు పెట్టుకోలేని వాళ్లు, సర్జరీ సరిపడని వాళ్లు అటు పెయిన్ కిల్లర్లు వేసుకుంటూ ఉండడం కష్టం. ఇటు నొప్పి భరించడం మరింత కష్టం. ఇలాంటివాళ్లకు పెయిన్ మేనేజ్‌మెంట్ మంచి పరిష్కారం చూపిస్తుంది. నొప్పి తగ్గించడానికి జెనిక్యులర్ నర్వ్ రేడియో ఫ్రీక్వెన్సీ ఇస్తారు. కీళ్లకు వెళ్లే నరాన్ని జెనిక్యులర్ నరం అంటారు. రేడియోఫ్రీక్వెన్సీ ద్వారా దీన్ని కాల్చేస్తారు. దాంతో నొప్పి తగ్గిపోతుంది.



మోకాలి నొప్పి ప్రారంభంలో ఉన్నప్పుడు మోకాలికి బలాన్నిచ్చే వ్యాయామాలు చెప్తారు. తగ్గకపోతే విస్కో సప్లిమెంటేషన్ చేస్తారు. ఇది జాయింట్‌కి లూబ్రికెంట్‌గా పనిచేస్తుంది. అంటే అరిగిపోయిన కార్టిలేజ్ స్థానంలో ఈ విస్కస్ పదార్థాన్ని పంపిస్తారు.

ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా ట్రీట్‌మెంట్ – ప్లేట్‌లెట్ కణాలను రక్తం నుంచి విడదీసి వాటిని మోకాలిలోకి ఇంజెక్ట్ చేస్తారు. ఈ ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మాలో ఉండే పెరుగుదల కారకాలు మోకాలినొప్పి తగ్గించడంలో సహాయపడుతాయి. అయితే ఇది మోకాలి నొప్పి గ్రేడ్ 1 దశలో ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగపడుతుంది.

### పాదం నొప్పి - ప్లాంటార్ ఫేషియా




పాదం చదునుగా ఉండేవాళ్లకు పాదంలో, చీలమండల్లో నొప్పి కనిపిస్తుంది. హై హీల్ వేసుకోవడం వల్ల అది పాదం చీలమండల దగ్గర ఎక్కువ ఒత్తిడి పడి నొప్పి వస్తుంది. ఈ సమస్యకు అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే అవసరం అవుతాయి. చికిత్సగా యాంటి ఇన్‌ఫ్లమేటరీ ఇంజెక్షన్ ఇస్తారు.

### ట్రైజెమినల్ న్యూరాల్జియా

అప్పట్లో బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌ను విపరీతంగా బాధపెట్టిన తలనొప్పి ఇది. ట్రైజెమినల్ న్యూరాల్జియా ఉన్నవాళ్లలో ముఖంలో ఒకవైపు ఎలక్ట్రిక్ షాక తగిలినట్టుగా నొప్పి వస్తుంది. అయితే ఇది కంటిన్యువస్‌గా ఉండదు. ఒకట్రెండు సెకన్లు ఉండిపోతుంది. కాని భరించలేనంత ఉంటుంది. రోజులో అయిదారు సార్లు ఇలా నొప్పి దాడిచేస్తుంది. దీన్ని భరించలేక ఆత్మహత్య యత్నం చేసేవాళ్లు కూడా ఉంటారు. గతంలో అయితే దీనికి సర్జరీ చేసేవాళ్లు. ఇప్పుడు రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా ట్రీట్మెంట్ ఇస్తున్నారు. ముఖానికి నాడీప్రసారం చేసే ట్రైజెమినల్ నరం పైన రక్తనాళం పడి దాన్ని ఇరిటేట్ చేస్తుంది. అందువల్లే ఇలాంటి నొప్పి వస్తుంది. సర్జరీ ద్వారా ఈ రక్తనాళాలను పక్కకు జరుపుతారు. సర్జరీ అవసరం లేకుండా ఇప్పుడు రేడియో ఫ్రీక్వెన్సీని ఆ నర్వ్ పైకి పంపిస్తారు. ఈ ట్రీట్‌మెంట్ వల్ల ముఖంలో ఒకవైపు కొంచెం స్పర్శ తగ్గుతుంది. వేరే సైడ్ ఎఫెక్టులు ఏమీ ఉండవు.

### నొప్పి మానసికమైంది కూడా...



నొప్పి శారీరకంగానే కాదు మానసికంగా, సామాజికంగా కూడా ప్రభావం చూపిస్తుంది. నొప్పికి తీసుకునే చికిత్స పక్కదారి పట్టినప్పుడు కుటుంబ సభ్యుల నుంచి కూడా కొన్నిసార్లు సరైన తోడ్పాటు లభించదు. ముఖ్యంగా మహిళల విషయంలో ఇది సామాజికంగా, మానసికంగా చాలా కుంగదీస్తున్నది. నొప్పికి అసలు కారణం తెలీక చాలామంది డాక్టర్ల దగ్గరికి వెళ్తారు. చాలాసందర్భాల్లో నొప్పి చికిత్స పక్కదారి పడుతుంది. ఇలాంటప్పుడు నొప్పి తగ్గకుంటే 'నొప్పీ లేదు.. ఏమీ లేదు.. నటిస్తున్నావం'టారు. పని చేయడం తప్పించుకోవడానికి ఇలా నొప్పి అని అబద్ధాలాడుతున్నావంటారు. తమ బాధను ఎవరూ నమ్మట్లేదని వీళ్లు బాధపడుతారు. మానసికంగా చాలా కుంగిపోతారు. కొందరు ఆత్మహత్య ప్రయత్నం కూడా చేస్తుంటారు. అందుకే పేషెంట్లకే కాదు, వాళ్లను చూసుకునే కుటుంబ సభ్యులకు కూడా కౌన్సెలింగ్ అవసరం. 25 నుంచి 30 శాతం స్పైన్ సర్జరీలు ఫెయిల్ అవుతాయి. వీళ్లలో 3 నుంచి 4 శాతం మంది నొప్పితో ఉంటారు. కానీ సర్జరీ అయ్యాక కూడా నొప్పి వస్తుందంటున్నారని, అంతా నటనే అంటూ నమ్మరు. ఇలాంటప్పుడు పెయిన్ డాక్టర్‌ని కలిస్తే సర్జరీ ఫెయిల్ అయ్యాక వచ్చే నొప్పికి కూడా పెయిన్ మేనేజ్‌మెంట్ ద్వారా చికిత్స ఇవ్వొచ్చు. యోగా, మెడిటేషన్ లాంటివి నొప్పి నుంచి మనసు మళ్లించడానికి తోడ్పడుతాయి.

**డాక్టర్ జి. రామ్మోహన్**
సీనియర్ పెయిన్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్
(నొప్పి నివారణ నిపుణులు)
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్
8121022333



# నిపుణ

# — విద్య ఉద్యోగ సమాచారం —

## ఏఆర్‌సీఐలో

**హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 11
- **పోస్టులు:** టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్, టెక్నీషియన్.
- **అర్హతలు:** పోస్టుని బట్టి పదోతరగతి, ఇంజినీరింగ్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** డిసెంబర్ 23
- **వెబ్‌సైట్:** https://www.arci.res.in

## మనులో ఫ్యాకల్టీలు

**హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను)లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తదితరాలు.
- **మొత్తం ఖాళీలు:** 39
- **అర్హత:** పోస్టుని బట్టి ఇంజినీరింగ్ డిగ్రీ, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం. నెట్/ సెట్/ స్లెట్‌లలో అర్హత సాధించి ఉండాలి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **చివరితేదీ:** డిసెంబర్ 24
- **వెబ్‌సైట్:** http://www.manuu.ac.in

**ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

## ఐడీబీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు




- **పోస్టు:** స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్
- **మొత్తం ఖాళీలు:** 61
- **పోస్టులవారీగా ఖాళీలు:** డీజీఎం–2, ఏజీఎం–5, మేనేజర్–54.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, సీఏ/ ఎంబీఏ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ స్క్రీనింగ్, గ్రూప్ డిస్కషన్/ పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 12
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.700/- ఎస్సీ/ఎస్టీలకు రూ.150, పీహెచ్‌సీలకు ఫీజు లేదు.
- **వెబ్‌సైట్:** www.idbibank.in.

## ఎన్‌ఎస్‌టీఐలో

**హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌ఎస్‌టీఐ) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**




- **పోస్టు:** జూనియర్ కన్సల్టెంట్లు.
- **మొత్తం ఖాళీలు:** 4
- **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో ఇంజినీరింగ్ డిప్లొమా, బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 11
- **వెబ్‌సైట్:** http://atiepihyderabad.gov.in

## రైట్స్‌లో

**గురుగ్రామ్‌లోని రైట్స్ లిమిటెడ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

RITES
THE INFRASTRUCTURE PEOPLE
Rail India Technical & Economic Service

- **మొత్తం ఖాళీలు:** 3
- **పోస్టులు:** జాయింట్ జనరల్ మేనేజర్ (సివిల్), సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్), డీజీఎం (సివిల్).
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా
- **పోస్టు:** ఇంజినీరింగ్ ప్రొఫెషనల్స్
- **మొత్తం ఖాళీలు:** 7
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 19
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** డిసెంబర్ 30
- **వెబ్‌సైట్:** https://rites.com



హైదరాబాద్‌లో సాయంత్రం నాలుగు గంటల సమయంలోనే మంచు కమ్మేసిన దృశ్యమిది. రోజురోజుకూ పెరుగుతున్న చలితీవ్రత.. సాయంత్రం నుంచే చల్లదనం భాగ్యనగరవాసులను వణికిస్తున్నది. - నమస్తే తెలంగాణ, హైదరాబాద్

# పన్నుల రాబడిలో రాష్ట్రం నంబర్‌వన్

## వాణిజ్యపన్నులశాఖ నూతన కమిషనర్ నీతూప్రసాద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అధికారులు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేసి జీఎస్టీ, వ్యాట్ రాబడిలో తెలంగాణను ఎప్పటికీ అగ్రస్థానంలో నిలుపాలని వాణిజ్యపన్నులశాఖ కమిషనర్ నీతూకుమారిప్రసాద్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వాణ్యిజ్యపన్నులశాఖ కమిషనర్‌గా సోమవారం పదవీబాధ్యతలు చేపట్టిన నీతూకుమారిని ఆ శాఖ అధికారులు, ఉద్యోగసంఘాల




నీతూప్రసాద్‌ను అభినందిస్తున్న తెలంగాణ స్టేట్ ట్యాక్స్ అసోసియేషన్ నాయకులు

ప్రతినిధులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్తు,సేవల పన్ను వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్నదని అన్నారు. ఉన్నతాధికారుల నుంచి మొదలుకుని కింది స్థాయి ఉద్యోగుల వరకు సమిష్టిగా కృషిచేయడం వల్లనే ఇది సాధ్యమైందని వివరించారు. తెలంగాణ స్టేట్ ట్యాక్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టీ వెంకటేశ్వర్లు, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు స్వర్ణకుమార్, వేణుగోపాల్, లక్ష్మయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి. తదితరులు కమిషనర్‌ను కలిసి అభినందించారు.



# అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ

- ఛత్తీస్‌గఢ్ మాదిరిగా అభివృద్ధి చేసి చూపుతాం
- జార్ఖండ్ ఎన్నికల సభలో రాహుల్‌గాంధీ



జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గిరిజన మహిళలతో కలిసి నృత్యంచేస్తున్న రాహుల్‌గాంధీ

**సిమ్‌డెగ (జార్ఖండ్):** తమ పార్టీ అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జార్ఖండ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన అభివృద్ధిని జార్ఖండ్‌లో కూడా చేసి చూపుతామని అన్నారు. సోమవారం జార్ఖండ్ రాష్ట్రంలోని సిమ్‌డెగ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల తొలి బహిరంగసభలో పాల్గొని ప్రచారాన్ని రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా తొలుత రైతు సమస్యలపై దృష్టి సారిస్తున్నది. జార్ఖండ్‌లో కూడా ఛత్తీస్‌గఢ్ మాదిరి అభివృద్ధి చేసి చూపుతాం. అధికారంలోకి రాగానే రైతు రుణ మాఫీ చేపడుతాం. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజనుల భూములను లాక్కొని పారిశ్రామికవేత్తలకు ఇచ్చింది. కానీ, ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గిరిజనులకు అండగా నిలిచేందుకు ట్రైబల్ బిల్, ఫారెస్ట్ రైట్స్ లా తీసుకొచ్చి బీజేపీ ఆటలు కట్టించాం. చరిత్రలో తొలిసారిగా టాటా కంపెనీకి కేటాయించిన భూములను వెనక్కి తీసుకొని గిరిజనులకు అప్పగించాం. బీజేపీ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా బడా వ్యాపారవేత్తలకు భూములు కేటాయిస్తూ రైతులను నిర్లక్ష్యం చేస్తున్నది. రైతులు ఎంతగా ఉద్యమాలు చేసినా వారు పండించిన పంటలకు మద్దతు ధర మాత్రం ఇవ్వలేదు' అని చెప్పారు. ఎంతో గొప్పగా చెప్పుకొంటున్న పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదని, కేవలం ప్రధాని మోదీ స్నేహితులకే లాభం చేకూరిందని రాహుల్ విమర్శించారు. ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా మేకిన్ ఇండియా (భారత్‌లో తయారీ) జపం చేస్తున్నారని, అయితే ఈ పథకంతో జార్ఖండ్ రాష్ట్రంలో ఒక్కరికైనా ఉపాధి లభించిందా? అని రాహుల్ ప్రశ్నించారు. 81 మంది సభ్యులుండే జార్ఖండ్ అసెంబ్లీకి ఐదు విడుతల్లో ఎన్నికలు జరుగుతుండగా.. ఇప్పటికే తొలి విడుత పూర్తయ్యాయి. ఈ నెల 7 న రెండో విడుత ఎన్నికలు జరుగనున్నాయి. చివరి విడుత ఎన్నికలు ఈ నెల 20న నిర్వహిస్తుండగా.. 23న ఎన్నికల ఫలితాలు రానున్నాయి. ఇక్కడ ఆర్జేడీ, జేఎంఎంతో పొత్తు కుదుర్చుకొన్న కాంగ్రెస్.. అధికారంలో ఉన్న బీజేపీని ఢీకొంటున్నది.

# ఎన్నార్సీ డెడ్‌లైన్ 2024

- వచ్చే సాధారణ ఎన్నికల్లోగా దేశవ్యాప్తంగా అమలుచేస్తాం
- ప్రతి ఒక్క చొరబాటుదారుడినీ దేశం నుంచి వెళ్లగొడతాం
- జార్ఖండ్ ఎన్నికల సభలో తేల్చిచెప్పిన అమిత్ షా

**చక్రధర్‌పూర్/బహరాగోరా, డిసెంబర్ 2:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న జాతీయ పౌర జాబితా(ఎన్నార్సీ)ను 2024లోగా దేశవ్యాప్తంగా అమలుచేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లోగా దేశంలోని ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి దేశం నుంచి వెళ్లగొడతామని స్పష్టంచేశారు. ఇటీవలి ముగిసిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఎన్నార్సీ కారణంగా పార్టీ ఘోరంగా దెబ్బతిన్నదని ఆ రాష్ట్ర బీజేపీ నేతలు మొరపెట్టుకున్నప్పటికీ, అమిత్ షా మాత్రం వెనక్కి తగ్గలేదు. బెంగాల్ సరిహద్దునే ఉన్న జార్ఖండ్‌లో సోమవారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఎన్నార్సీని అమలుచేసి తీరుతామని తేల్చిచెప్పారు. 'వారిని పంపేయొద్దని రాహుల్ బాబా (కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ) కోరుతున్నారు. ఎక్కడికి వెళ్తారు, ఏం తింటారని బాధపడిపోతున్నారు. కానీ నేను మీ అందరికీ హామీ ఇస్తున్నా. 2024 ఎన్నికల్లోగా అక్రమ వలసదారులందరినీ వెళ్లగొడతాం' అని అమిత్‌షా పేర్కొన్నారు. అయోధ్య అంశాన్ని మరోసారి లేవనెత్తుతూ.. సుప్రీంకోర్టులో కేసు విచారణను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని ఆరోపించారు. కానీ, ప్రజల ఆశీర్వాదంతో తాము కేసును ముందుకు తీసుకెళ్లామని, ఫలితంగా అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి మార్గం సుగమమైందని చెప్పారు.

### పదవీ కోసమే కాంగ్రెస్‌తో హేమంత్ దోస్తీ

జార్ఖండ్‌లో బీజేపీకి వ్యతిరేకంగా జట్టుకట్టిన జేఎంఎం-కాంగ్రెస్- ఆర్జేడీ కూటమిపైనా



జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఆయన విమర్శలు గుప్పించారు. 'జార్ఖండ్ రాష్ట్రం కోసం ఆందోళన చేపట్టిన విద్యార్థులపై కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లాఠీలతో కొట్టించింది. ఇప్పుడు హేమంత్ సొరేన్ (జేఎంఎం నేత) ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో అదే కాంగ్రెస్‌తో చేతులు కలిపారు' అని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి (వికాస్ కీ గంగా) ప్రవహిస్తున్నదంటే.. అందుకు రెండింజన్లే (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) కారణమని పేర్కొన్నారు. మోదీ సర్కారు దేవ్‌ఘర్‌లో ఎయిమ్స్‌ను నిర్మించిందని చెప్పారు. ప్రస్తుతం దేవ్‌ఘర్‌తోపాటు బొకారో, దుమ్కా, జంషెడ్‌పూర్‌లలో విమానాశ్రయాలను నిర్మిస్తున్నదని పేర్కొన్నారు. పంట బీమా పథకం ద్వారా 20 లక్షల మంది రైతులు లబ్ధి పొందారని తెలిపారు. ఐదేండ్లలోనే మోదీ సర్కార్, రఘువర్ దాస్ ప్రభుత్వం రాష్ట్రంలో నక్సలిజాన్ని అంతం చేసి అభివృద్ధికి బాటలు పరిచిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రఘువర్‌దాస్ అవినీతిరహిత, సుస్థిర పాలనను అందించారన్నారు. జార్ఖండ్ చరిత్రలో ఐదేండ్ల పాలనను పూర్తిచేసుకోవడం ఇదే మొదటిసారి. 'రాహుల్‌గాంధీ ప్రస్తుతం జార్ఖండ్‌లోనే ఉన్నారు. ఆయనకు సవాల్ విసురుతున్నా. గత 55 ఏండ్లలో జార్ఖండ్ అభివృద్ధికి ఏం చేశారో చెప్పండి. మేం కూడా ఐదేండ్లలో ఏం చేశామో వెల్లడిస్తాం' అని అమిత్ షా సవాల్ విసిరారు. 'అసెంబ్లీ ఎన్నికల టికెట్లను అమ్ముకున్న, ఆదివాసీలను దోచుకున్న, జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన, కోట్ల అవినీతికి పాల్పడిన పార్టీలు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లలేవు' అని కూటమి పార్టీలపై విమర్శలు గుప్పించారు.

# బలిగొంటున్న భారీ వానలు

## తమిళనాడులో గోడకూలి 17 మంది దుర్మరణం

## మృతుల్లో పదిమంది మహిళలు, ఇద్దరు చిన్నారులు

- తెల్లవారుజామున నిద్రలోనే గాల్లో కలిసిన ప్రాణాలు
- ఇప్పటివరకు రాష్ట్రంలో 25 మంది మృతి

**కోయంబత్తూర్, డిసెంబర్ 2:** ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు తమిళనాడును అతలాకుతలం చేస్తున్నాయి. పలువురి ప్రాణాలను బలిగొంటున్నాయి. తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. వర్షాల కారణంగా కోయంబత్తూర్‌కు 50 కి.మీ. దూరంలోని మెట్టుపాళ్యం సమీపంలో ఉన్న నాదుర్ గ్రామంలో గోడ కూలి 17 మంది మృత్యువాతపడ్డారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో 15 అడుగుల ఎత్తైన గోడ ఒక్కసారిగా కూలి.. పక్కనే వరుసగా ఉన్న మూడు పెంకుటిళ్లపై పడటంతో ఆ ఇండ్లలో నిద్రిస్తున్న 17 మంది నిద్రలోనే కన్నుమూశారు. మృతుల్లో పదిమంది మహిళలు, ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో గోడ పూర్తిగా తడిసి ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక, ఇతర సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని స్థానికులతో కలిసి శిథిలాల కింద చిక్కుకుపోయిన మృతదేహాలను బయటకు తీశారని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై సీఎం కే పళనిస్వామి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున రాష్ట్ర విపత్తు నివారణ నిధి నుంచి పరిహారం అందజేస్తామని ప్రకటించారు. కూలిన గోడ నిర్మాణం కూడా వివాదంలో ఉన్నది. కోయంబత్తూర్ కలెక్టర్ కే రాజమణి, ఎస్పీ సుజిత్‌కుమార్ ఘటనాస్థలిని సందర్శించారు. గోడ నిర్మాణం విషయంపై గ్రామస్థులు సమాచారం ఇచ్చారని, అది అక్రమంగా నిర్మించినట్టు తేలితే కూల్చేస్తామని రాజమణి మీడియాకు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టేందుకు గ్రామస్థుల నుంచి ఆయన పలు సూచనలు స్వీకరించారు.

### పాఠశాలలు, కళాశాలలు మూసివేత

భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తే ప్రమాదం ఉన్నదన్న వాతావరణ కేంద్రం హెచ్చరికలతో తమిళనాడు, పుదుచ్చేరిలో పాఠశాలలు, కళాశాలలను మూసేశారు. మద్రాస్ విశ్వవిద్యాలయం, అన్నా విశ్వవిద్యాలయాల్లో పరీక్షలను వాయిదా వేశారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తమిళనాడులో చాలా ప్రాంతాలతోపాటు పక్కనున్న పుదుచ్చేరిలో



తమిళ నాడులోని కోయంబత్తూర్ సమీపంలోని మెట్టుపాళ్యంలో భారీవర్షాల కారణంగా కూలిపోయిన ఇండ్లు.. శిథిలాలను తొలిగించి, మృతదేహాలను వెలికితీస్తున్న సహాయ సిబ్బంది

గత 24 గంటల్లో భారీ వర్షాలు పడ్డాయి. నవంబర్ 29 నుంచి సోమవారం వరకు వర్షాలకు సంబంధించిన ఘటనల్లో తమిళనాడులోనే మొత్తం 25 మంది మృతిచెందారని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో 176 సహాయక శిబిరాలను ఏర్పాటుచేసినట్టు తెలిపింది. అత్యవసర పరిస్థితులు ఎదురైతే బాధితులను రక్షించేందుకు పడవలను కూడా సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నది. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు 600 నీటి మోటార్లను వినియోగిస్తామని చెప్పింది. భారీ వర్షాలతో అతలాకుతలమైన ట్యుటికోరిన్, కుడ్డలూర్, తిరునెవెల్లి జిల్లాల్లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాల్లో 1000 మందికి ఆశ్రయం కల్పించారు. వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లుచేశారు. బలమైన గాలులు వీస్తున్నందున కొమోరిన్, లక్ష్యద్వీప్ ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లొద్దని తుఫాను హెచ్చరిక కేంద్రం సూచించింది. తమిళనాడులో మరో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ.. వర్షాలతో దెబ్బతిన్న రెయిబోనగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి.. సహాయక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఆ దుఃఖానికి 35 ఏండ్లు!

- ఇప్పటికీ భోపాల్ గ్యాస్ బాధితులకందని న్యాయం
- శారీరక, మానసిక రుగ్మతలతో సతమతం

**భోపాల్, డిసెంబర్ 2:** 'భోపాల్ గ్యాస్' విషాదానికి మంగళవారంతో 35 ఏండ్లు. వేల మందిని బలిగొన్న ఈ విషాదం తాలూకు బాధితులకు ఇప్పటికీ న్యాయం జరుగలేదు. బాధితులకు వైద్య, ఆర్థిక, సామాజిక పునరావాస కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని బాధిత సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. బాధితుల కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ఆరోగ్య పరిశోధనా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన భోపాల్ మెమోరియల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ (బీఎంహెచ్చార్సీ).. వారి ఆరోగ్య పరిస్థితుల మెరుగుదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. సుదీర్ఘ కాలం అనారోగ్యంతో బారిన పడిన బాధితుల సంఘం నేత అబ్దుల్ జబ్బార్ ఇటీవల మరణించడమే దీనికి ఉదాహరణ అని భోపాల్ గ్యాస్ పీడిత్ మహిళా స్టేషనరీ కర్మచారీ సంఘ్ అధ్యక్షురాలు రషీదా బీ అని పేర్కొన్నారు. భోపాల్ బాధితుల వైద్య సంరక్షణ హక్కు కోసం పోరాడిన అబ్దుల్ జబ్బార్ ఇటీవలే మరణించారు. చివరి రోజుల్లో పలు దవాఖానల్లో చికిత్స పొందారు. భోపాల్ విషాదం జరిగి 35 ఏండ్లవుతున్న సందర్భంగా మంగళవారం నిరసన ప్రదర్శనలు, సభలు జరిపేందుకు బాధితులు సమాయత్తం అవుతున్నారు.



భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి 35 ఏండ్లైన సందర్భంగా భోపాల్‌లో సోమవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, మృతులకు నివాళి అర్పించిన సంభావన ట్రస్ట్ క్లినిక్ ప్రతినిధులు

### ఆదుకోవడంలో అంతులేని నిర్లక్ష్యం

☛ బీఎంహెచ్చార్సీలో కొన్నేండ్లుగా నేఫ్రాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాలు మూతపడి ఉన్నాయి. న్యూరాలజీ, పల్మోనరీ మెడిసిన్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, గ్యాస్ట్రో మెడిసిన్ విభాగాలకు ప్రత్యేక వైద్యులే లేరు. ఏడేండ్లుగా ఈ దవాఖానలో రీసెర్చ్ జరిగిన దాఖలాలే లేవు. తాజాగా భారత వైద్య అధ్యయన మండలి (ఐసీఎంఆర్) నూతనంగా ప్రకటించిన రీసెర్చ్ ప్రాజెక్టుల్లో మూడు మాత్రమే భోపాల్ విషాదానికి సంబంధించిన అంశాలు ఉన్నాయి.

☛ బాధితుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు తీసుకున్న చర్యలు మృగ్యం. బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్న ఆరు దవాఖానల్లో ప్రతిరోజూ 4,000 మందికి పైగా రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటారు. కానీ వీటిలో ఒక్కటి మినహా మిగతా దవాఖానల్లో గత 19 ఏండ్లలో ఒక మానసిక వైద్యుడిని కూడా నియమించలేదు. ఆ ఒక్క దవాఖానలో పనిచేసిన మానసిక వైద్యుడు కూడా వారానికి 12 గంటల పాటు మాత్రమే అందుబాటులో ఉండేవారు. కానీ గత నెలలో ఆ డాక్టర్ కూడా వెళ్లిపోయారు.

☛ బాధితుల్లో 30 శాతం మనోవైకల్యానికి గురయ్యారు. వారిలో 80 శాతం మంది ఇప్పటికీ కోలుకోనేలేదు. మహారాష్ట్రలోని లాతూర్ భూకంపం, రష్యాలోని చెర్నోబిల్ అణు దుర్ఘటన తదితర విషాదాల నుంచి బాధితులు రెండు, మూడేండ్లలోనే కోలుకున్నా భోపాల్ గ్యాస్ బాధితులు మాత్రం వివిధ మానసిక వ్యాధులతోనే సతమతం అవుతున్నారు.

☛ బాధితుల పునరావాసానికి కేంద్రం రూ.104 కోట్లు కేటాయించినట్లు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా తెలిసింది. వాటిల్లో తొమ్మిదేండ్లుగా రూ.18 కోట్లు అవినీతి పరులు స్వాహా చేస్తే మిగతా రూ.86 కోట్లు అలాగే ఉన్నాయి.

☛ వేల మంది బాధిత కుటుంబాలు సరైన ఉద్యోగాల్లేక, డబ్బుల్లేక ఆకలితో అలమటిస్తున్నాయి. నిధుల కొరత పేరుతో 2018 నుంచి 473 మంది వితంతువులకు అధికారులు పెన్షన్ నిరాకరిస్తున్నారు.

☛ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర పారిశ్రామిక విషాదాల్లో '1984 భోపాల్ గ్యాస్ విషాదం' ఒకటి.

☛ 1984 డిసెంబర్ రెండవ తేదీ అర్ధరాత్రి తర్వాత మూడో తేదీ వేకువజామున భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ప్లాంట్ నుంచి మిథైల్ ఐసోసైనేట్ గ్యాస్ లీక్ కావడంతో 25 వేల మంది మృత్యువాత పడగా, ఐదు లక్షల మందికి పైగా ప్రజలు దీర్ఘకాలం వ్యాధుల బారిన పడ్డారు.



అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన మైనార్టీ కమిటీ సమావేశంలో పాల్గొన్న శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కమిటీ చైర్మన్ ఫరీదుద్దీన్, సభ్యులు అబ్దుల్ బలాల, మాగంటి గోపినాథ్, మాణిక్‌రావు, స్టీఫెన్ సన్, డీ రాజేశ్వర్‌రావు, ఫారూఖ్ హుస్సేన్, జాఫ్రీ

# మైనార్టీల కోసం అధిక నిధులు

## మైనార్టీ కమిటీ సమావేశంలో స్పీకర్ పోచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం దేశంలోనే అధిక నిధులు కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో చైర్మన్ ఫరీదుద్దీన్ అధ్యక్షతన మైనార్టీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనారీ విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేసిందని తెలిపారు. అన్ని మతాల పండుగలను అధికారికంగా జరుపుతున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందాలన్నారు. కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి సరైన నివేదిక అందిస్తే మైనార్టీల పథకాలు మరింత పారదర్శకంగా రూపొందుతాయని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అబ్దుల్ బలాల, మాగంటి గోపినాథ్, మాణిక్‌రావు, స్టీఫెన్ సన్, డీ రాజేశ్వర్‌రావు, ఫారూఖ్ హుస్సేన్, జాఫ్రీ పాల్గొన్నారు.

# క్వింటాల్ ఉల్లి రూ.10 వేలు

## ఏపీలోని కర్నూలు మార్కెట్‌లో గరిష్ఠ ధర

**కర్నూలు:** దేశవ్యాప్తంగా ఉల్లి ధర ఆకాశాన్ని అంటుతున్న విషయం తెలిసిందే. తాజాగా సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి ధర గరిష్ఠస్థాయిలో పలికింది. క్వింటాల్ ధర రూ. 10 వేలకుపైగా అమ్ముడు పోయింది.

### సాగు ఎగుమతి పాలసీకి కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయ ఎగుమతి విధానానికి రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీని ప్రభుత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన క్లస్టర్లలోఈ విధానం అమలునకు జిల్లా కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించారు. ప్రభు త్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శిని కో చైర్మన్‌గా నియమించిన కమిటీలో స్టేట్ ఎక్స్‌పోర్ట్ కమిషనర్, వ్యవసాయశాఖ కమిషనర్, ఉద్యానశాఖ, మార్కెటింగ్‌శాఖల డైరెక్టర్లు, ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్, అడిషనల్ డీజీఎఫ్‌టీ, టీఎస్ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ డైరెక్టర్, నాబార్డు డీజీఎం, అపెడా ఏజీఎం, ఎన్‌హెచ్‌బీ ఏజీఎం, ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీలు సభ్యులుగా ఉన్నారు. ఎగుమతి విధానానికి 13 జిల్లాలను క్లస్టర్లుగా గుర్తించారు. ఇందులో నాగర్‌కర్నూల్, వనపర్తి, మంచిర్యాల, రంగారెడ్డి, సంగారెడ్డిలో మామి డి, భద్రాద్రికొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి క్లస్టర్లలో మిర్చి, నిజామాబాద్, నిర్మల్‌లో పసుపు, జగిత్యాలలో మామిడి, పసుపు, ఖమ్మంలో మామిడి, మిర్చి, మహబూబాబాద్‌లో మామిడి, పసుపు, మిర్చి పంటలకు ఎగుమతి విధానాన్ని అమలుచేయనున్నారు.

# చంద్రబాబుకు నిరసనల సెగ

- రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటుకు అనుకూల ప్రకటన చేయాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్

**అమరావతి, నమస్తే తెలంగాణ:** రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ప్రకటన చేశాకే మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు కర్నూలులో అడుగుపెట్టాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం కర్నూలులో చంద్రబాబు పర్యటనను వ్యతిరేకిస్తూ రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ నేతల ఆధ్వర్యంలో నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహించి టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. చంద్రబాబు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. శ్రీబాగ్ ఒప్పందనాన్ని చంద్రబాబు గౌర




కర్నూలులో చంద్రబాబు పర్యటనను వ్యతిరేకిస్తూ నల్లజెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

వించి రాయలసీమకు న్యాయంచేయాలని, రాజధాని లేదా కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు అనుకూల ప్రకటన చేశాకే ఇక్కడ అడుగుపెట్టాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. చంద్రబాబు కోస్తాంధ్రలో రాజధాని, హైకోర్టు, ఉన్నత విద్యాసంస్థలు, ఐటీ, ఎమ్స్, ఐఐటీ, ఎన్ఐటీ, పరిశ్రమలను ఒకే చోట కేంద్రీకరించి రాయలసీమకు తీరని అన్యాయంచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా టీడీపీ అధినేత తన వైఖరి మార్చుకొని శ్రీబాగ్ ఒప్పందం అమలుకు సీఎం జగన్‌కు లేఖ రాయాలని డిమాండ్‌చేశారు.

# డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టు

**గుంటూరు:** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా నల్లపాడులో డ్రగ్స్ తయారీ ముఠా గుట్టురట్టయింది. సోమవారం 12 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుల్లో సుడాన్, టాంజానియా, ఈజిప్ట్, నైజిరియా, సౌదీ, ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందినవారున్నారు. నల్లపాడులోని ఓ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ తయారుచేస్తుండగా వీరు పట్టుబడ్డారు. ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేస్తున్న నిందితుడు షాజీని కూడా పోలీసులు అరెస్ట్‌చేశారు.

# కృష్ణా బోర్డు భేటీ మళ్లీ వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాలుగు ప్రధాన అంశాలు ఎజెండాగా మంగళవారం జరుగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం మళ్లీ వాయిదాపడింది. ఈ మేరకు బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం రెండు రాష్ట్రాలకు అధికారికంగా సమాచారమిచ్చారు. వాస్తవంగా నవంబర్ 27న బోర్డు సమావేశం జరుగాల్సి ఉన్నది. కానీ, ఆ సమావేశాన్ని వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ కోరడంతో డిసెంబర్ 3న నిర్వహించనున్నట్టు బోర్డు తెలిపింది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు కూడా ఎజెండా అంశాలను కూడా సిద్ధం చేశారు. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల నీటి లెక్కలు కొలిక్కివస్తాయని భావించారు. కానీ మంగళవారం జరుగాల్సిన సమావేశాన్ని వాయిదా వేయాలని రెండు రాష్ట్రాల ఈఎన్సీలు బోర్డును కోరారు. ఈ నేపథ్యంలో తాజాగా రెండోసారి సమావేశాన్ని వాయిదావేసిన బోర్డు అధికారులు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

# మానవత్వం నా మతం

- మాట నిలబెట్టుకోవడం నా కులం: ఏపీ సీఎం జగన్
- వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా పథకం ప్రారంభం

**అమరావతి, నమస్తే తెలంగాణ:** 'మానవత్వం నా మతం.. మాట నిలబెట్టుకోవడం నా కులం' అని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తన కులం, మతంపై ప్రతిపక్షాలు పదేపదే ప్రస్తావిస్తున్నాయని అన్నారు. ఎన్నికల మ్యా నిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. సోమవారం గుంటూరు ప్రభుత్వ దవాఖానలో వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కార్యక్రమాన్ని జగన్ ప్రారంభించారు. పేషెంట్లకు ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నట్టు వివరించారు. ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి అవసరమైన వారికి రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేలకువరకు ఎన్ని రోజులైనా, నెలలైనా డాక్టర్లు సిఫార్సు మేరకు ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు.

నమస్తే తెలంగాణ

చిత్రం

[ కరీంనగర్ ]

మంగళవారం 3 డిసెంబర్ 2019

# వెంకీ పుట్టినరోజున..

వెంకటేష్, నాగచైతన్య కథానాయకులుగా నటిస్తున్న మల్టీస్టారర్ చిత్రం 'వెంకీమామ'. సురేష్ ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై డి.సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కె.ఎస్.రవీంద్ర (బాబీ) దర్శకుడు. రాశీఖన్నా, పాయల్‌రాజ్‌పుత్ కథానాయికలు. వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 13న ఈ చిత్రం విడుదలకానుంది. హీరో రానా, దర్శకుడు బాబీలపై చిత్రీకరించిన ఓ ఫన్నీ వీడియో ద్వారా విడుదల తేదీని చిత్రబృందం వెల్లడించింది. నిర్మాతలు మాట్లాడుతూ 'కుటుంబ విలువలు, వినోదం, ప్రేమ, భావోద్వేగాల సమ్మిళితంగా సాగే చిత్రమిది. లక్ష్యసాధనలో ఓ మామాఅల్లుళ్లకు ఎదురైన పరిణామాలేమిటన్నది ఆకట్టుకుంటుంది. వెంకటేష్, నాగచైతన్య పాత్రలు నవ్యరీతిలో ఉంటాయి. వారి కలయికలో వచ్చే సన్నివేశాలు అలరిస్తాయి. ఇటీవల విడుదలైన పోస్టర్స్, పాటలకు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్.తమన్, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల.



'వెంకీమామ' చిత్రంలో రాశీఖన్నా, నాగచైతన్య, పాయల్‌రాజ్‌పుత్, వెంకటేష్

# టాలీవుడ్‌ను విస్మరించను!

'దే దే ప్యార్ దే' సినిమా విజయంతో బాలీవుడ్ పరిశ్రమలో రకుల్‌ప్రీత్‌సింగ్‌కు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రెండు సినిమాల్ని ఓకే చేసిందీ అమ్మడు. 'హిందీ చిత్రసీమలో సవాలుతో కూడిన మంచి పాత్రలు నన్ను వెతుక్కుంటూ వస్తున్నాయి. ప్రతి సినిమా కోసం నేను ఒకే రకమైన అంకితభావంతో పనిచేస్తాను. అయితే ఫలితాలు మన చేతిలో ఉండవు. అదృష్టం కొద్ది ఈ ఏడాది కెరీర్ ఆశాజనకంగా కనిపిస్తున్నది' అని చెప్పింది రకుల్. బాలీవుడ్‌తో పాటు తమిళ భాషలో వరుస అవకాశాలు వరిస్తున్నా..తెలుగు సినీరంగానికే తన మొదటి ప్రాధాన్యత అని చెప్పుకొచ్చింది ఈ పంజాబీ సోయగం. 'తెలుగు పరిశ్రమకు నేనెప్పుడు రుణపడి ఉంటాను. ఈ ఏడాది రెండు సినిమాలు చేయబోతున్నాను. టాలీవుడ్‌లో నేను నటిగా ఎదిగాను. ఊహించని స్టార్‌డమ్ సంపాదించుకున్నాను. సినిమా కళను పరిపూర్ణంగా అర్థం చేసుకోవడానికి తెలుగు ఇండస్ట్రీ బాటలు వేసింది. అందుకే ఏ భాషలో సినిమాలు చేస్తున్నా..తెలుగును మాత్రం ఎప్పటికీ విస్మరించను' అని చెప్పింది



రకుల్‌ప్రీత్‌సింగ్



గ్రీన్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని పార్కులో మొక్కలు నాటారు. మొక్కలను నాటి రక్షిస్తే అవి మనల్ని కాపాడుతాయని రామ్‌లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రీన్‌చాలెంజ్ రూపంలో ఎంపీ సంతోష్‌కుమార్ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారని వారు కొనియాడారు. ఈ ఉద్యమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని రామ్‌లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాదంబరి కిరణ్ పాల్గొన్నారు.



శ్రీనివాస్, మామిడి హరికృష్ణ

# స్కామ్ నేపథ్యంలో..

చెంగ్, మైరా అమిత్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఓట్లీ నేను'. విష్ణుష్ కలగర దర్శకుడు. శ్రీనివాస్ శరకడం నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో నటుడు కాశీవిశ్వనాథ్ విడుదలచేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ 'ట్రైలర్ బాగుంది. వినూత్నమైన పాయింట్‌తో దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించారు' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'ఓటమి ఎరగని మైరా అనే యువతి కథ ఇది. ఆమె జీవితగమనంలో ఎదురైన సంఘటనల సమాహారమే ఈ చిత్ర ఇతివృత్తం. ఓ స్కామ్ ప్రధానంగా ఊహకందని మలుపులతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. ఈ నెల 15న మా సంస్థ ద్వారా హైదరాబాద్‌లో ఇండియన్ ఫ్యాషన్ అండ్ ఫిలిం ఫెస్టివల్‌ను నిర్వహించబోతున్నాం. ప్రతిభ ఉండి అవకాశాలు లేని వారికి చక్కటి వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణుష్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగరవీధుల్లో వినోదం



శ్రీనివాసరెడ్డి, అనిల్ రావిపూడి

శ్రీనివాసరెడ్డి, సత్య, షకలకశంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భాగ్యనగరవీధుల్లో గమ్మత్తు'. ఈ సినిమా ద్వారా హాస్యనటుడు శ్రీనివాసరెడ్డి దర్శకుడిగా పరిచయవుతున్నాడు. డిసెంబర్ 6న విడుదలకానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం జరిగింది. చిత్ర బ్యానర్ లోగోను దర్శకుడు అనిల్ రావిపూడి, టైటిల్ యానిమేషన్‌ను తమన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత శ్రీనివాసరెడ్డి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'రెండుగంటల పాటు సంపూర్ణ వినోదాన్ని అందించే చిత్రమిది. సినిమా చూసిన దిల్‌రాజు, కిరీష్..మరికొంతమంది చిన్న మార్పుల్ని సూచించారు. అవన్నీ మా సినిమాకు ఉపయోగపడ్డాయి. చిన్న దొంగతనాలు చేసే ముగ్గురు వ్యక్తుల జీవితంలో ఎదురైన సంఘటనల నేపథ్యంలో ఆద్యంతం సరదాగా సాగిపోయే సినిమా ఇది' అన్నారు. 'రెండు తెలుగు రాష్ర్టాల్లో ఈ సినిమా గమ్మత్తు చేస్తుంది. చక్కటి కామెడీతో శ్రీనివాసరెడ్డి ఈ సినిమాను తెరకెక్కించారు. వినోదంతో పాటు ప్రేమకథ కూడా ఉంటుంది. శ్రీనివాసరెడ్డి, సత్య, షకలకశంకర్ కలయికలో వచ్చే సన్నివేశాలు కడుపుబ్బా నవ్విస్తాయి. ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత పద్మనాభరెడ్డి చెప్పారు. దర్శకుడిగా శ్రీనివాసరెడ్డి తొలి ప్రయత్నం విజయవంతమవ్వాలని తమన్, అనిల్ రావిపూడి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# నిశ్శబ్దం మూకీ కాదు!

''నిశ్శబ్దం' చిత్రాన్ని మూకీ సినిమాగా అపోహపడుతున్నారు. అది అవాస్తవం. ఓ మూగ, చెవిటి యువతి కథ ఇది. హీరోహీరోయిన్లు కాకుండా తెరపై పాత్రలు మాత్రమే కనిపిస్తాయి' అని అన్నారు కోన వెంకట్. టీజీ విశ్వప్రసాద్‌తో కలిసి ఆయన నిర్మిస్తున్న తాజా చిత్రం 'నిశ్శబ్దం'. అనుష్క, మాధవన్, అంజలి, మైఖేల్ మ్యాడసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ దర్శకుడు. జనవరి 31న ఈ చిత్రం విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కోన వెంకట్ మాట్లాడుతూ 'రెండేళ్ల క్రితం ఈ సినిమా ప్రయాణం ప్రారంభమైంది. హేమంత్‌మధుకర్ చెప్పిన కథ వినగానే అద్భుతమైన సినిమా అవుతుందనిపించింది. ఈ జర్నీలో కొన్ని అనుకోని సంఘటనలు జరిగాయి. తొలుత వేరే హీరోయిన్‌తో ఈ సినిమా చేయాలనుకున్నాం. అనుకోకుండా ఆమె డేట్స్ సర్దుబాటు కాలేదు. అదే సమయంలో విమానప్రయాణంలో అనుష్కను కలిస్తే ఆమెకు కథ వినిపించాను. అనుష్కతో పాటుచాలా మంది నటీనటులు ఒకరిని అనుకొని మరొకరితో సినిమా చేశాం. పూర్తిస్థాయిలో అమెరికాలో చిత్రీకరణ జరుపుకున్న తొలి తెలుగు సినిమా ఇది. హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులు సినిమా కోసం పనిచేశారు. యజ్ఞంలా భావించి ఈ సినిమా చేశాం. స్క్రీన్‌ప్లేపరంగా నా కెరీర్‌లో ఛాలెంజింగ్ సినిమా ఇది. తెలుగు, తమిళ్ భాషల్లో ఈ సినిమాను రూపొందించాం. మలయాళం, హిందీ భాషల్లో అనువదిస్తున్నాం. ఆ తర్వాత ఇంగ్లీష్‌లో విడుదలచేస్తాం' అని తెలిపారు. హేమంత్ మధుకర్ మాట్లాడుతూ 'కోన వెంకట్‌కు కథ చెప్పగానే రెగ్యులర్ సినిమాలా కాకుండా హాలీవుడ్ స్థాయిలో చేద్దామన్నారు. థ్రిల్లర్ కథాంశమిది. కథపై నమ్మకంతోఅనుష్క ఈ సినిమా కోసం నాలుగు నెలల పాటు సంజ్ఞలకు సంబంధించిన మెళకువలతో పాటు పెయింటింగ్ నేర్చుకున్నారు. ఈ సినిమాలో అంజలి పోలీస్‌గా కనిపిస్తుంది' అని తెలిపారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ ''నిన్నుకోరి' సినిమా ద్వారా కోనవెంకట్‌తో నా ప్రయాణం ప్రారంభమైంది. హాలీవుడ్ స్థాయిలో తెలుగు సినిమా చేయాలనే సంకల్పంతో చిత్రాన్ని నిర్మించాం' అన్నారు. సినిమాలో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా తన పాత్ర సాగుతుందని సుబ్బరాజు అన్నారు. వందన, వివేక్ కూచిభొట్ల తదితరులు పాల్గొన్నారు.



వివేక్, వందన, విశ్వప్రసాద్, హేమంత్‌మధుకర్, కోన వెంకట్

'అంజల జవేరి సినిమాల విషయంలో నాకు ఎలాంటి సలహాలు ఇవ్వదు. మనసుకు నచ్చింది చేయమని ప్రోత్సహిస్తుంది' అని అన్నారు తరుణ్‌రాజ్ అరోరా. ఆయన ప్రతినాయకుడిగా నటించిన చిత్రం 'అర్జున్ సురవరం'. సంతోష్ దర్శకుడు. ఇటీవల ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. సోమవారం హైదరాబాద్‌లో తరుణ్ రాజ్ అరోరా పాత్రికేయులతో ముచ్చటించారు..

# అంజలకు నేనే ప్రపోజ్ చేశా!

దేశవ్యాప్తంగా ఉన్న సమకాలీన సమస్యను చర్చిస్తూ దర్శకుడు సంతోష్ ఈ సినిమాను తెరకెక్కించారు. నవతరం మోసాలబారిన పడకుండా జాగ్రత్తగా ఎలా నడుచుకోవాలో అవగాహన కల్పించే సినిమా ఇది. తమిళ మాతృక 'కణితన్'లో నేనే ప్రతినాయకుడిగా నటించాను. అదే పాత్రను తెలుగులో పోషించడం కష్టమేమీ అనిపించలేదు. మాతృక పూర్తిగా హీరో, విలన్ దృక్కోణం నుంచి సాగుతుంది. కానీ తెలుగులో పాత్రికేయుల సమస్యలు, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ హంగులు జోడించి దర్శకుడు రూపొందించారు. కథ చెడిపోకుండా నా శైలిలో పాత్రకు న్యాయం చేసే ప్రయత్నం చేశాను. నటనకు భాషాభేదాలతో సంబంధం లేదన్నది నా సిద్ధాంతం. పాత్ర తాలూకూ భావోద్వేగాలతో సహానుభూతి చెందుతూ నటించడానికి ప్రయత్నిస్తాను. భిన్న భాషల్లో నటించే అవకాశాలు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మోడల్‌గా నా కెరీర్ ప్రారంభమైంది. పదిహేనేళ్ల పాటు మోడలింగ్ రంగంలో పనిచేశాను. ఎలాంటి సినిమా చేయాలి, ఏ సంస్థ, దర్శకుడితో కలిసి పనిచేయాలనే దానిపై జడ్జిమెంట్ లేకపోవడంతో తొలినాళ్లలో కొన్ని అనవసరమైన సినిమాల్లో నటించి తప్పుచేశాను. ఆ సినిమాల విషయంలో ఎవరిని నిందించడం లేదు. అవే నాకు నటనను నేర్పించాయి.

**ప్రేమవివాహం...**

అంజల జవేరి, నేను ప్రేమించి పెళ్లిచేసుకున్నాం. స్నేహితుల ద్వారా ఆమె నాకు పరిచయమైంది. తొలుత నేనే ఆమెకు ప్రపోజ్ చేశాను. పదమూడేళ్ల పాటు స్నేహితులుగా ఉన్న తర్వాత పెళ్లిచేసుకున్నాం. మా వివాహం జరిగి ఏడేళ్లవుతుంది. అంజలాజవేరి సినిమాల్లో పునరాగమనం చేసే ఆలోచనలో ఉంది. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నది. ప్రస్తుతం మలయాళంలో 'మామాంగం', హిందీలో 'లక్ష్మీబాంబ్'లో తమిళంలో ఓ సినిమా చేస్తున్నాను. తెలుగులో మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నా.



తరుణ్‌రాజ్ అరోరా

# ఉత్కంఠగా 'సమరం'



సాగర్, ప్రగ్యానయన్

సాగర్‌గంధం, ప్రగ్యానయన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సమరం'. బషీర్ ఆలూరి దర్శకుడు. యూనివర్సల్ ఫిలింస్ పతాకంపై శ్రీనివాస్ వీరంశెట్టి, జీవీఎస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'క్రైమ్ థ్రిల్లర్ కథాంశమిది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. కథానుగుణంగా టైటిల్ పెట్టాం. అన్ని కమర్షియల్ హంగులతో మెప్పిస్తుంది. ఈ నెలలోనే విడుదల చేయాలనుకుంటున్నాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. సుమన్, వినోద్‌కుమార్, సత్యప్రకాష్, జహీదా, ప్రియాన్షు, సహానా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నాగబాబు, సంగీతం: రాజ్‌కిరణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: బషీర్ ఆలూరి.

## శ్రీదేవి జీవితచరిత్ర

దివంగత నటి శ్రీదేవి జీవిత చరిత్రను 'శ్రీదేవి ది ఎటర్నల్ స్క్రీన్ గాడెస్' పేరుతో రచయిత సత్యార్థ్ నాయక్ రచించారు. ఆదివారం న్యూఢిల్లీలో ఈ పుస్తకాన్ని బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకునే, శ్రీదేవి భర్త నిర్మాత బోనీకపూర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా దీపికాపదుకునే మాట్లాడుతూ 'శ్రీదేవి జీవితంపై రాసిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం నాకు లభించడం గౌరవంగా భావిస్తున్నాను. నేను నటించిన సినిమాలు శ్రీదేవి చూసేవారు. వ్యక్తిగతంగా అభినందిస్తూ సందేశాలు పంపిస్తుండేవారు' అని పేర్కొన్నది. ఈ పుస్తకానికి బాలీవుడ్ హీరోయిన్ కాజోల్ ముందుమాట రాశారు. 'శ్రీదేవి నటనాజీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఆమె సినిమాలు చూస్తూ పెరిగాను. నటనలో ఆమె ఒక ఇనిస్టిట్యూట్. ఆమె జీవితచరిత్రకు ముందుమాట రాసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను' అని కాజోల్ వ్యాఖ్యానించారు. శ్రీదేవి బాల్యం నుంచి స్టార్ హీరోయిన్‌గా ఎదిగే క్రమంలో ఎదుర్కొన్న పరిస్థితుల్ని, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఆమె జీవితంలోని ఆసక్తికరమైన విషయాల్ని చర్చిస్తూ రచయిత ఈ పుస్తకాన్ని రచించారు.





బోనీకపూర్, దీపికాపదుకునే